ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-3-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 47 పేజీలు: 10+4 వెల: 6.50



కీలక రంగాలకు రూ.54,926 కోట్లు: కేంద్రం
ఎల్జీజి ఎటిఎం వచ్చేసింది.. 5





శ్రీపరాభవ నామ ఉగాది సందర్భంగా మా పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు
-డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

# బరాబర్.. మళ్లీ నేనే వస్తా..

## 2034 దాకా కాంగ్రెస్‌దే అధికారం

### అసెంబ్లీకి కెసిఆర్ రావాలి, సలహాలివ్వాలి..
### ఆయన ఇప్పటి దాకా తీసుకున్న జీతం రూ.1.6 కోట్లు
### 6 గ్యారంటీల్లో ఒక్కటి మినహా అమలు చేశాం.. నేనెప్పుడూ కష్టజీవినే.. స్వశక్తితో ఎదిగా..
### హెల్త్ పాలసీపై ఏ దర్యాప్తుకైనా సిద్ధం: అసెంబ్లీలో సిఎం రేవంత్
### గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం.. సభ రేపటికి వాయిదా



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి18:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకు ఉంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 2029లో కూడా మళ్లీ బరాబర్ తొక్కుకుంటూ వస్తానని ఆయన అసెంబ్లీ వేదికగా సవాల్ విసిరారు. తాను వారసత్వంగా పదవిలోకి వచ్చిన వ్యక్తిని కాదని.. ఒక్కో మెట్టు ఎక్కుతూ.. నన్ను తొక్కాలనుకున్న వారిని తొక్కుకుంటూ వచ్చానని అసెంబ్లీలో ఘాటుగా ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చపై బుధవారం సాయంత్రం ఆయన అసెంబ్లీలో సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిభింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్ ను ఆవిష్కరిస్తూ... రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగం చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆయన చేసిన ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదు. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి అవసరమైన విశిష్ట ప్రణాళిక అని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వస్తారని అనుకున్నాం కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు చెబుతారని భావించాం కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాలేదని దుయ్యబట్టారు. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా... కొందరిలో రాచరిక పోకడలు మాత్రం పోలేదని ప్రతిపక్ష నేత,మాజీ సిఎం కెసిఆర్‌పై మండిపడ్డారు. వారు నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకులను ఎన్నుకుంటున్నారు..కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. ప్రజలే తప్పు

>>2



బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మంత్రులు తుమ్మల, వాకిటి, వివేక్

## 22న రైతు భరోసా

### నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించనున్న సిఎం రేవంత్: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు ఉగాది కానుకగా సిద్ధిపేట జిల్లా నర్మెటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు సిఎం ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరిని ప్రారంభిస్తారని, రూ. 80 కోట్లతో నిర్మించనున్న రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపనచేయనున్నారని తెలిపారు.

>>2



సిఎస్ రామకృష్ణారావు

## పదవీ కాలం పొడిగింపు

### రాష్ట్ర సర్కార్ లేఖకు స్పందించిన కేంద్రం

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపుపై గత కొద్ది రోజులుగా సాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన పదవీ కాలాన్ని మరో 3 నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర హోం శాఖ పరిధిలోని పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీవోపీటీ) నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పరిణామాల నేపథ్యంలో జూన్ నెలాఖరు వరకు రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.కాగా, వాస్తవానికి గతేడాది ఆగస్టు 31న రామకృష్ణారావు పదవీ

>>2


ముంచుకొస్తున్న ఎరువుల సంక్షోభం 5




బుధవారం మక్కలతో ర్యాలీగా వెళ్తున్న కెటిఆర్, హరీష్, సబిత ఇతర బిఆర్ఎస్ నేతలు

## బిఆర్ఎస్ వాకౌట్

### మూసీ ప్రక్షాళనకు అనుకూలం.. దోపిడీకి వ్యతిరేకం
### డిపిఆర్ లేకుండా ఇళ్ల కూల్చివేత తగదు: కెటిఆర్

**హైదరాబాద్,మార్చి 18,ప్రభాతవార్త:** మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, "గృహమేధయాగం" చేస్తూ ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ ప్రకటించి పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి నిరసనగా సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చారు. ప్రశ్నోతర్తరాల సమయంలో ఎమ్మెల్యేలు తారకరామారావు,దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్,బండారి లక్ష్మారెడ్డి మూసీ నదిపై వేసిన ప్రశ్నకు పురపాలక బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో లేకపోవడంతో శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సమాధానం ఇవ్వగా సభ్యులు ఆయన సమాధానంతో సంతృప్తి పొందక వాకౌట్ చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారవు మాట్లాడతూ మూసీ ప్రక్షాళన చేయడానికి 16వేల కోట్లు సరిపోతాయనీ లక్షన్నర కోట్లకు ఆప్రాజెక్టును పెంచడంవెనుక ఉద్దేశ్యం ఏందనీ ప్రశ్నించారు.ప్రభుత్వం వద్ద డిపిఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు.డిపిఆర్ తయారీకి పద్దెనిమిది నెలలు పడుతుందని జనవరిలో చెప్పిన శాసనభవ్యవహారాల మంత్రిఇప్పుడు డిపిఆర్ ఉందనీ

>>2

## కొత్త డిజిపి కోసం 3 పేర్లు



### యుపిఎస్‌సి నుంచి అందిన లేఖ
### ఆనంద్, ఆప్టే, సౌమ్యా మిశ్రాలలో ఒకరికి అవకాశం

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర నూతన డిజిపి పదవి ఎంపికకు సంబంధించి యుపిఎస్‌సి నుంచి ముగ్గురి పేర్లతో కూడిన జాబితా రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా అందింది. వచ్చే నెల 30వ తేదీన ప్రస్తుత శివధర్ రెడ్డి డిజిపిగా పదవీ విరమణ చేయనుండడం తెలిసిందే. ఆయ న స్థానంలో కొత్త డిజిపి ఎంపికకు సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం యుపిఎస్‌సి తెలంగాణ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపిఎస్ అధికారుల జాబితాను తెప్పించుకుని అందులో నుంచి


>>2

## ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్ హాతం

### హార్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ స్థావరాలపై బంకర్‌బస్టర్ బాంబులతో దాడులు

**టెహ్రాన్ /జెరూసలెం /వాషింగ్టన్, మార్చి 18:** మద్యప్రాచ్యం మంటలు ఎక్కడా తగ్గుతున్న సూచనలు లేవు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్‌లు చేస్తున్న సంయుక్త దాడులు మరింత ఉగ్రరూపం దాల్చాయి. హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ జలసంధి సమీపంలోని ఇరాన్ క్షిపణి

>>2





## రోహిత్‌కు ఉత్తరాది మత్తు బంధం!

### కొత్త మలుపు తిరిగిన మొయినాబాద్ ఫాం హౌస్ కేసు
### పార్టీలో మూడు రకాల డ్రగ్స్ వినియోగం
### ఫామ్‌హౌస్ జప్తు కోసం రెవెన్యూకు పోలీసుల లేఖ

**హైదరాబాద్, (మొయినాబాద్) మార్చి 18, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసు కొత్త మలుపు తిరిగింది. రోహిత్ రెడ్డి నిర్వహించిన పార్టీలో మొత్తం మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ కాగా ఇందులో రోహిత్ రెడ్డి రెడ్డి రెండు రకాల మాదకద్రవ్యాల ను వాడగా, మిగతా వారు కూడా ఇదే తరహాలో వినియోగించినట్లు తేలింది. మరోవైపు ఫాం హౌస్ నిర్వాహకుడు పైలట్ రోహిత్ రె డ్డికి ఉత్తరాది డ్ర గ్స్ ముఠాలతో సంబంధాలున్నట్లు ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అరెస్టయిన వారిలో ఇద్దరు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు వుండడం, వీరికి ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లోని డ్రగ్స్ ముఠాలతో లింకులున్నట్లు వార్తలు వెలువడుతుండడం తో దీనిపై మరింత లోతుగా విచారించేందుకు సిట్ అధికారులు నిర్ణయించారు. ఈ కేసులో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి)తో పాటు ఢి ల్లీ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పోలీసులతో సిట్ అధికారులు సమాలోచనలు జరిపి వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు డ్రగ్స్ పార్టీ జరిగిన రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌ను జప్తు చేసేందుకు రెవెన్యూ శాఖకు పోలీసులు లేఖ రాశారు. మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో ఈ నెల 14వ తేదీ రాత్రి జరిగిన పార్టీలో పాల్గొన్న వారిలో ఆరుగురు డ్రగ్స్ వాడినట్లు ఇప్పటి కే తేలగా వీరంతా మూడు రకాల మాదకద్రవ్యాలు వినియోగించారని పోలీసుల విచారణలో నిర్ధారణ అయ్యింది. కొకైన్, ఎండిఎంఎ, మెతాంతిపెన్ డ్రగ్ వాడినట్లు పోలీసులు తేల్చారు. ఇందులో కొకైన్ ఘాటైన డ్రగ్ కాగా మిగతావి రసాయనాలతో తయారు చేసే ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్. రోహిత్ రెడ్డి కొకైన్‌తో పాటు ఎండిఎంఎ వాడినట్లు తేలగా, నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు తేలింది. మిగతా వారు రెండు రకాల సిం థటిక్ డ్రగ్స్ వాడారు. రోహిత్‌రెడ్డి, నమిత్‌శర్మ ఖరీదైన మద్యంతో పాటు డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ పార్టీకి కౌశిక్ రవి సిమ్లా ను ంచి కొకైన్ తెచ్చినట్లు పోలీసులు తేల్చడం తెలిసిందే. సింథటిక్ డ్రగ్స్‌ను

>>2






తమ డిమాండ్లను పరిష్కరించాలని బుధవారం భువనేశ్వర్‌లో ఆందోళన చేస్తున్న ఒడిశా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సభ్యులు

# పదవీ కాలం పొడిగింపు

>> విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయన సర్వీసును పొడిగించాలని డీవోపీటీని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాలు, కీలక ప్రాజెక్టుల అమలు దృష్ట్యా ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని భావించిన ప్రభుత్వం, గతంలోనే ఏడు నెలల పొడిగింపు కోరింది. దీంతో 7 నెలలు ఆయన సర్వీసును పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు వెలువరించింది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను రామకృష్ణారావు దిగ్విజయంగా అమలు చేస్తున్నారు. ప్రధానంగా యంత్రాగాన్ని గాడిలో పెట్టడం, తోటి సీనియర్ ఐఏఎస్‌లతో కోఆర్డినేట్ చేసుకుంటూ పనిచేయడమే కాకుండా, గత ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్, వివిధ ఆర్థిక సంస్థల వద్ద తీసుకున్న రుణాలను రీ షెడ్యూల్ చేయించడంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ నెల 31తో పదవీ కాలానికి సంబంధించి గడువు ముగుస్తుండటంతో మరోసారి పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డీవోపీటీకి లేఖ రాసింది. ఆ లేఖకు కేంద్రం సాకూలంగా స్పందించి అందుకు అంగీకారం తెలిపింది. దీంతో మరో 3 నెలల పాటు జూన్ నెలాఖరు వరకు రామకృష్ణా రావు సీఎస్ పదవిలో ఉండనున్నారు.

# 22న రైతు భరోసా

>> ఈ ఫ్యాక్టరి నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశామని, ఫ్యాక్టరి ప్రారంభోత్సవం సందర్భంగా 3 రోజుల పాటు వ్యవసాయ ప్రదర్శన కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనకు మంత్రులు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించామన్నారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసాపై కీలక ప్రకటన చేశారు. ఈనెల 22న రైతు భరోసా నిధులను సిఎం విడుదల చేస్తారని వెల్లడించారు. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు జమ చేయబోతున్నామని తెలిపారు. ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ రైతు సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోవద్దని సిఎం చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగ సంక్షేమమే మొదటి ప్రాధాన్యత అని చెప్పారు. ఎన్నికల్లో రాహుల్‌గాంధీ హామీ ఇచ్చినట్లు రుణమాఫీ చేస్తామని చెప్పినట్లు చేసి చూపించామన్నారు. మొక్క జొన్న కొనుగోళ్లపై ధర్నాలు చేయడం తేలికైన పని అని, కానీ ధర్నాలు చేస్తున్నవారే కేంద్రంలో అధికారంలో ఉన్నారని బిజెపి ప్రజాప్రతినిధులపై మంత్రి తుమ్మల విరుచుకుపడ్డారు.

# బిఆర్ఎస్ వాకౌట్

>> అంటున్నారని ఉంటే దానిని అసెంబ్లీలో టేబుల్ చేయండని కెటిఆర్ సవాల్ విసిరారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డిపిఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. డిపిఆర్ లేదు,నిధులు లేవు ఐనా ఇళ్లు కూల్చివేయడం ఎందుకనీ ఈ విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బిఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కెటిఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని ఆరోపించారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్‌డిఓ చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బిఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కెటిఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డిపిఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు.

మార్చి 11న కూడా అదే విషయాన్ని ఎడిబి మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గతంలో ఇదే అసెంబ్లీలో డిపిఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డిపిఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ మూసి ప్రాజెక్ట నిర్వాసితుల పక్షాన గళం విప్పగా ఆయనను కట్టడి చేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కొమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మలనాగేశ్వరావు ధీటుగా సమాధానాలు ఇచ్చారు.

# ముగిసిన ఇంటర్ వార్షిక పరీక్షలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 18:** తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా.. ఈ నెల 13తో ప్రధాన పరీక్షలు ముగిశాయి. ఇంటిగ్రేటెడ్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఇంటర్ వార్షిక పరీక్షలు ముగియడంతో ఈ నెల 4 నుంచే సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. మూడు విడతల్లో ఇంటర్ మూల్యాంకనం చేపట్టాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇప్పటికే రెండు విడతల స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభం కాగా ఈ నెల 20న మూడో విడత మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఈ నెల 15న మొదటి విడతలో ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, పొలిటికల్ సైన్స్ జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది.

# కొత్త డిజిపి కోసం 3 పేర్లు

>> ముగ్గురితో ఒక జాబితాను ఇటీవల ఖరారు చేయడం తెలిసిందే. వాస్తవానికి యుపిఎస్‌సి ఐదుగురి పేర్లతో కూడిన జాబితాను వారం రోజుల క్రితమే ఖరారు చేయడం విదితమే. ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ఈ జాబితాను ఖరారు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు సహా యుపిఎస్‌సికి చెందిన అధికారులు పాల్గొన్నారుఉజ మొదట ఐదుగురి పేర్లతో ఖరారు చేసిన జాబితాను ఆ తరువాత దీనిని ముగ్గురికి పరిమితం అయ్యింది. ఈ జాబితాలో 1991 బ్యాచ్ అధికారి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే (వి.పి ఆప్టే), (ఈయన కేంద్ర సర్వీసులో వున్నారు) ఇదే బ్యాచ్‌కు చెందిన రాష్ట్ర జైళ్ల శాఖ డి జి సౌమ్యా మిశ్రాల పేర్లు వున్నాయి. ఇందులో ఆనంద్‌కు 2028 జూన్ నెల వరకు సర్వీసు వుండగా ఆప్టేకు 2029 అక్టోబర్ నెల వరకు, సౌమ్యా మిశ్రాకు 2027 డిసెంబరు వరకు స ర్వీసు వుంది. ఈ ముగ్గురి నుంచే ఒకరిని డిజిపిగా ఎంపిక చేయాల్సి వుంది. సీనియారిటీ ప్రకారం ఆనంద్ ముందు వరుసలో వున్నారు. అయితే డిజిపి ఎంపిక పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి వుంది.

## సిఎం రేవంత్ ఉగాది శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి 18:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రేపటి నుంచి శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

## వారం - వర్జ్యం

19-03-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
● అమావాస్య ఉ.6.53, పాడ్యమి తె.4.51
ఉత్తరాభాద్ర తె.4.03
వర్జ్యం : ఉ.2.26-3.52
దు.ఉ.10.14-11.02,
మ.3.04-3.52
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** కీలక నిర్ణయాలలో నిదానం అవసరం. శ్రేయోభిలాషులతో సలహాలు సంప్రదింపులు జరుపుతారు. తద్వారా లాభపడతారు.

**వృషభం:** సకాలంలో పనులు పూర్తిచేయటానికి విఫలయత్నం చేస్తారు, ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**మిథునం:** విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వస్తు భద్రత పట్ల మెలుకువలు అవసరం. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి.

**కర్కాటకం:** కార్యాలయాలలో అధికారుల ప్రశంసలు పొందుతారు. దూరప్రాంతాల నుండి అనుకూలమైన సమాచారాన్ని అందుకుంటారు.

**సింహం:** మీ ప్రమేయం లేకుండానే వివాదాలలోకి లాగబడే సూచనలు ఉన్నాయి. జాగ్రత్తలు పాటించండి.

**కన్య:** కొత్త వ్యాపారాల ప్రయాణాలు ముమ్మరం చేస్తారు. పలుకుబడి నామమాత్రంగా పెరుగుతోంది. ఋణబాధలు తప్పవు.

**తుల:** స్థిరమైన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేరు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో మెలుకువ అవసరం.

**వృశ్చికం:** కుటుంబ కలహాలు మీ ప్రశాంతతకు భంగం కలిగించే సూచనలు ఉన్నాయి. ఇంటా బయటా కొంత అనుకూలం. వాహనసౌఖ్యం.

**ధనుస్సు:** దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నూతన అంశాలను కూడా పరిగణలోనికి తీసుకుంటారు.

**మకరం:** ఊహించని ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు. మిత్రత్వానికి దారి తీస్తాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కుంభం:** గతంలో మీతో శతృత్వం వహించినవారు ఇప్పుడు మీతో మిత్రత్వం వహించడానికి రాయబారం నడుపుతారు.

**మీనం:** పంతాలు పట్టింపులకు పోకుండా సామరస్యంగా పరిష్కరించుకుంటారు. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అన్‌పార్లమెంటరీగా మాట్లాడలేదు

## సిఎం చెప్పిందే ప్రస్తావించా..

## పార్టీ ఫిరాయింపులపై సభలో చర్చకు వీలుంది

## -సభలో మాజీ మంత్రి కెటిఆర్



**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** శాసనసభలో తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ భాష ఉపయోగించలేదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలనే తాను ప్రస్తావించానని, అవి రికార్డులో ఉంటే తాను చెప్పినవి కూడా రికార్డులో ఉండాలని పేర్కొన్నారు. సభలో మంగళవారం తాను మాట్లాడిన విషయాలపై వచ్చిన అభ్యంతరాలపై స్పందిస్తూ బుధవారం ఆయన మాట్లాడారు. తాను మాట్లాడిన వ్యాఖ్యల్లో అన్‌పార్లమెంటరీగా ఏం మాట్లాడానో ఎవరూ కోట్ చేయలేదని, తాను అన్‌పార్లమెంటరీగా మాట్లాడానని అనుకోవడం లేదని, అలాంటి మాటలు మాట్లాడి ఉంటే స్పికర్‌గా అప్పుడే ఆపేవారు కదా... అని అన్నారు. తన మాటలను రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తాను సిఎంలాగా భడివే అన్నానా?, బలి దేవత అన్నానా?, అలాంటి పదాలు తాను ఉపయోగించలేదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ గతంలో మాట్లాడిన మాటలనే తాను గుర్తు చేశానని చెప్పారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సరైనవైతే అవి రికార్డులో ఉంటే, అదే సందర్భంలో తాను చెప్పిన మాటలు కూడా రికార్డులో ఉండాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

సభలో చర్చలు రాజ్యాంగ పరిమితుల్లోనే జరుగుతాయని, ఇది శాసనసభగా చట్టాలు చేసే వేదిక అని గుర్తు చేశారు. శాసనసభ రాజ్యాంగ పరిధిలో పనిచేసే సంస్థ అని, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులపై కూడా ఈ సభలో చర్చలు జరిగిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఇటీవల బిసి రిజర్వేషన్ల విషయంలో కూడా కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ సభలో చర్చించామని ఆయన వివరించారు.

పార్టీ ఫిరాయింపుల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జాతీయ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను మాత్రమే తాను ప్రస్తావించానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరితే ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్ ఉండాలని రాహుల్‌గాంధి చెప్పిన విషయాన్ని మాత్రమేతాను ప్రస్తావించానని తెలిపారు.

అనర్హత పిటిషన్ల విషయంలో స్పికర్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నప్పటికీ, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని తాను కోరుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ మారిన వారిపై క్లిన్ చిట్ ఇవ్వడం సరైంది కాదని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఫిరాయింపుల తీర్పుపై సభలో చర్చించడం సరికాదు: మంత్రి శ్రీధర్‌బాబు**

పార్టి ఫిరాయింపుల ఆరోపణలపై శాసనసభలో ప్రస్తావించడం సరికాదని, ఈ అంశంపై సభలో మాట్లాడడానికి అవకాశం లేదని కెటిఆర్‌కు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్ ఇచ్చారు. స్పికర్ ఒక అప్పిలెట్ అథారిటీ అని ఆయన ఫిరాయింపుల ఆరోపణలు వచ్చిన ఎమ్మెల్యేల విషయంలో తీర్పు ఇచ్చారని స్పష్టం చేశారు. ఈ విషయంలో కెటిఆర్ చేసిన అన్‌పార్లమెంటరి వ్యాఖ్యలను సభ రికార్డులనుండి తొలగించాలని స్పికర్ ఎదుట ప్రతిపాదన ఉంచారు. పరిశీలించిన స్పికర్ కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

# రోహిత్‌కు ఉత్తరాది మత్తు బంధం!

>> నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్ నుంచి ఖరీదు చేశారు. వీటిని రోహిత్ రెడ్డి డ్రైవర్ కం పిఎ శరత్ కొన్నాడు.

**ఐదేళ్లుగా ఫాం హౌస్‌లో జరిగిన పార్టీలపై సిట్ ఆరా.. ఉత్తరాది డ్రగ్స్ స్మగ్లర్లతో లింకులపై వివరాల సేకరణ**

రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ సంచలనం రేపగా గడచిన ఐదేళ్ల కాలంలో ఇక్కడ జరిగిన అన్ని పార్టీలపై సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. గతంలో రోహిత్ రెడ్డి తాండూరు ఎంఎల్ఏగా వున్న సమయంలో తన పాం హౌస్‌లో అనేకసార్లు పార్టీలు నిర్వహించినట్లు సిట్‌కు ఆ ధారాలు లభించాయి. ఈ పార్టీలకు పలువురు ఎంపిలు, ఎంఎల్ఎలతో పాటు పలువురు సెలబ్రటీలు కూడా హాజరైనట్లు సిట్‌కు ఆధారాలు అందా యి. ఈ పార్టీలలో కొన్నింటిలో డ్రగ్స్ వాడివుంటారని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. తాజాగా డ్రగ్స్ వాడి పట్టుబడ్డ ఆరుగురిని మరోసారి పరీక్షించి వారు ఎంతకాలంగా మాదకద్రవ్యాలు వాడుతున్నారనే దానిపై వైద్యుల నుంచి నివేదిక కోరేందుకు సిట్ అధికారులు నిర్ణయించారు, రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన పార్టీలో ఆరుగురు డ్రగ్స్ వాడినట్లు తేలగా ఇందులో రోహిత్ రెడ్డితో పాటు అతని సోదరుడు రితేష్ రెడ్డి కూడా వుండ డం తెలిసిందే. మొదట వీరిద్దరికి రెండవసారి రక్త పరీక్షలు జరిపి ఎంతకాలంగా వీరు డ్రగ్స్ వాడుతున్నారో...? తేల్చేందుకు సిట్ అధికారులు సన న్నద్ధమవుతున్నారు. ఒకవేళ వీరు చాలా ఏళ్లుగా డ్రగ్స్‌కు బానిసలుగా వుంటే వీరికి డ్రగ్స్ సరఫరా చేసిన వారు ఎవరు...? వీరితో రోహిత్ రెడ్డికి వు న్న లింకులేమిటీ...? అనే అంశాలను నిగ్గు తేల్చాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఈ కేసులో ఈగల్, చేవెళ్ల పోలీసుల వద్ద వున్న సమాచార ం ప్రకారం రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన అనేక పార్టీల్లో డ్రగ్స్ వాడకం వుంది. దీనిపై పూర్తిస్థాయిలో ఆధారాలను సేకరించేందుకు సిట్ అధి కారులు రెడీ అవుతున్నారు. దీనిపై రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు, నమిత్ శర్మను కస్టడీలోకి తీసుకుని విచారిస్తే అన్ని విషయాలు వెలుగు చూసే వీలుంది.




బుధవారం కోల్‌కతాలో నిర్వహించిన యుద్ధ వ్యతిరేక ర్యాలీలో వామపక్ష ఫ్రంట్ కార్యకర్తలు

# ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్ హాతం

>> కేంద్రాలపై అతిపెద్ద బంకర్ బస్టర్‌బాంబులను ప్రయోగించారు. ఒక్కొకక్కటి 2200 కిలోల బరువుండే ఈ బాంబులతో ఆప్రాంతం మొత్తం హోరెత్తించారు. హార్మూజ్ జలసంధి రక్షణకు పునరుద్ధరణకు కలిసిరావాలన్న ట్రంప్ పిలుపునకు మిత్రదేశాలు కలిసిరాకపోవడం, నాటోకూటమి సైతం స్పందించకపోవడంతోట్రంప్ తానే నేరుగా రంగంలోకి దిగి బంకర్‌బస్టర్ బాంబులతో క్షిపణిస్థావరాల విధ్వంసం షురూచేసారు. ఇదిలా ఉంటే ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్‌ఖాతిబ్‌ను వైమానిక దాడుల్లో అంతంచేసామని ఇజ్రాయెల్‌రక్షణ మంత్రి ఇజ్రాయెల్‌కాట్జ్ వెల్లడించారు. ఇరాన్ సుప్రీం కమాండర్‌ను కూడా వెంటాడి హతమారుస్తామంటూ హెచ్చరికలుచేయడం ఇరాన్‌ను రెచ్చగొట్టినట్లయింది. ఇప్పటికే సెక్యూరిటీ చీఫ్ ఆలి లారిజాని తన కుమారుడితోసహా ఇజ్రాయెల్ దళాలు మట్టుబెట్టాయి. ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఖాతిబ్‌పై అమెరికా 2022నుంచి కూడా ఆంక్షలు విదించింది. ఇప్పటికే ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్‌పవర్‌ప్లాంట్‌ను ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసంచేసింది.

ఇరాన్‌లోని సౌత్‌పార్స్ గ్యాస్ క్షేత్రంపై వైమానిక దాడులతో టెహ్రాన్ మరింతగా ఆగ్రహించి గల్ఫ్‌దేశాల్లోని స్థావరాలపై క్షిపణి దాడులను పెంచింది. ఇజ్రాయెల్‌లోని బెన్‌గురియన్ ఎయిర్‌పోర్టుపై దాడులుచేసింది. మూడు ప్రైవేటు విమానాలు ధ్వంసం అయినట్లు ఇరాన్‌ప్రకటించింది. ఇంధన మౌలికవనరులపై దాడులను తీవ్రంగా వ్యతిరేకించిన ఇరాన్ అందుకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించింది. అలాగే ఖతార్,సౌదీ అరేబియా, యుఎఇల్లోని గ్యాస్‌క్షేత్రాలపై దాడులు చేసిన ఇరాన్ మరిన్ని దాడులు తప్పవని హెచ్చరించింది. గల్ఫ్‌లోని కీలక దేశం అయిన యుఎఇ తమపై ఇరాన్ ఈరోజు 13 క్షిపణులు, 27 డ్రోన్లుప్రయోగించిందని ప్రకటించారు.

**ఇజ్రాయెల్ దాడుల్లో ఇంటెలిజెన్స్ మంత్రి మృతి**

ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్‌ఖాతిబ్ మృతిచెందాని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌ప్రకటించారు. ఇందుకు మూల్యం చెల్లించుకోకతప్పదని ఆయన ఇజ్రాయెల్, అమెరికాలను హెచ్చరించారు. ఇస్మాయిల్‌ఖాతిబ్, ఆలి లారిజాని, అజీజ్ నసీర్‌జాదేలను హత్యచేయడం ఆయన్ను పిరికిపందల చర్యగా వర్ణించారు. షురా కార్యదర్శి, మిలిటరీ, బాసిజ్ కమాండర్ సోలెమానిలహత్యకు ఆయన ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

# బరాబర్.. మళ్లీ నేనే వస్తా..

>> చేశారని అనుకుంటున్నారు. నియంత పోకడలను అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి ప్రదర్శించారు. ప్రజలు బుద్ధిచెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఇప్పుడూ అదే తీరుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. నేను స్వశక్తితో ఎదిగిన వాడిని.. కష్టజీవని తెలిపారు. డిసెంబర్ 1, 2023 నుంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు 1 కోటి 6 లక్షల 56 వేల 674 రూపాయలు జీతభత్యాలు పొందారు. విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని గవర్నర్ ప్రసంగంలో వివరించారని చెప్పారు. సంక్షోభ సమయంలో దేశ ప్రధానిగా నెహ్రూ బాధ్యతలు చేపట్టారు ఆయన తీసుకున్న ప్రణాళికలతోనే ఇవాళ దేశం ఈ పరిస్థితుల్లో ఉంది మొదటి తరంలో నెహ్రూ ఇందిరా గాంధీ గొప్ప విధానాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక గతిని మార్చిన ఘనత పీవీ నరసింహారావుది 1990 నుంచి 2020 వరకు 30 ఏండ్లు పీవీ నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. భవిష్యత్‌లో ఏఐ సునామీ రాబోతుంది.. దీనిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను గవర్నర్ ప్రసంగంలో వివరించారని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను కనీసం చదివారా? చూశారా అని ప్రశ్నించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించకపోతే తరువాతి తరాలు మనల్ని క్షమించవు ఇది నవశకానికి నాంది పలుకాల్సిన సమయం. అధికారం కోల్పోయామన్న దుఃఖమే తప్ప ప్రభుత్వానికి సహకరించాలన్న ప్రధాన ప్రతిపక్షానికి ఆలోచన లేదు అని చెప్పారు. అందుకే ఎవరు అడ్డుపడ్డా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాం అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించుకున్నాం తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ గా విభజించుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలపై సభలో కేసీఆర్, కేటీఆర్ మాట్లాడిన మాటలను సభకు సిఎం వీడియోలను చూపిస్తూ వినిపించారు. వాళ్లు(బిఆర్ఎస్) అధికారంలో ఉన్నప్పుడు ఆక్రమణలను నిర్దాక్షిణ్యంగా కొట్టిపారేయాలని మాట్లాడారు..అప్పుడు సక్రమం అని చెప్పిన వాళ్లకు ఇప్పుడు అక్రమం ఎలా అయింది? మీరు మాట్లాడిన మాటలను ప్రజలు అప్పుడే మర్చిపోయారనుకున్నారా? మూసీ ఉప్పల్ భగాయత్ లో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చూసొద్దాం రండి.. ఎవరెవరు ఎక్కడ ఆక్రమించుకున్నారో ఒక నిజ నిర్ధారణ కమిటీ వేద్దాం అని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా ఈవీ వాహనాలు కొనుగోలు చేసేవారికి పన్ను మినహాయించాం.త్వరలో క్యూర్ పరిధిలోని ఆటోలను ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని చెప్పారు. మన నగరాన్ని మనం పరిరక్షించుకోకపోతే, చెరువులను పునరుద్ధరించుకోకపోతే భవిష్యత్ తరం మనల్ని క్షమించదు అని పేర్కొన్నారు. పారిశ్రామిక భూముల బదలాయింపులపై 2014 నుంచి ఇప్పటి వరకు హిల్ట్ పాలసీతో సహా ఎంక్వైరీకి సిద్ధం దీనిపై ఏ ఎంక్వయిరీ కావాలో ప్రతిపక్ష నాయకులు లేఖ ఇవ్వండి, టీడీఆర్ పాలసీపై కూడా ఎంక్వైరీకి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంక్వయిరీకి వెనకాడితే.. వెనక్కి తగ్గితే క్షమాపణ చెబుతాం అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు పంపించే హిల్ట్ పాలసీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలను సీఎం ఖండించారు. హిల్ట్ పాలసీపై ఏ దర్యాప్తుకైనా సిద్ధమని సభలో ప్రకటించారు. ప్రభుత్వం చేపట్టిన ఏ ప్రణాళికలోనైనా రాజకీయం, స్వార్థం, అధికారం కోల్పోయామనే బాధనే విపక్షాల మాటల్లో కనిపిస్తోందని ఆరోపించారు. ఎవరు కలిసి వచ్చినా.. రాకపోయినా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047లో తెలంగాణను మూడు భాగాలుగా విభజించామని తెలిపారు. ప్రస్తుతం పెట్టుబడిదారులు ఎక్కువగా హైదరాబాద్ వైపు చూస్తున్నారని, అందుకు తగ్గట్టుగానే అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీల్లో ఒకటి తప్పా మిగతావన్నీ అమలు చేస్తున్నట్లు వివరించారు. మహిళల పట్ల బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం గౌరవం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. సొంతింటి ఆడబిడ్డను బాధపెట్టిన వారు మహిళ గురించి ఎలా ఆలోచిస్తారని ఆయన ప్రశ్నించారు. సొంత ఆడబిడ్డను లిక్కర్ రాణి అని, సొంత పార్టీ నేతలతో తిట్టించారని ఆరోపించారు.గత ప్రభుత్వం పదేళ్ల పాటు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చాక 13 లక్షల కొత్త రేషన్‌కార్డులు ఇచ్చి, సన్నబియ్యం కూడా ఇస్తున్నామని గుర్తు చేశారు. రైతును రాజుగా చేసేందుకే రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌పై దృష్టి సారించామని వివరించారు. ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టామని తెలిపారు,చెరువుల పునరుద్ధరణ అందుకే : హైదరాబాద్ అర్బన్ ప్రాంతం క్యూర్‌ను ప్రక్షాళన చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాల్లోని పరిస్థితులు మనకు కనువిప్పు కావాలన్నారు. ముందుచూపులో భాగంగానే హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. చెరువులను కబ్జాల చెర నుంచి విడిపించి పునరుజ్జీవనం చేస్తున్నామని, బతుకమ్మకుంట, నల్లచెరువు, బుమ్‌రుఖ్‌ఉద్దౌలా చెరువులను పునరుద్ధరించామని ప్రకటించారు. బీజేపీ నేతలు సబర్మతి, గంగానది, యమున ప్రాజెక్టులను సమర్థించి మూసీ ప్రాజెక్టును ఎందుకు తప్పుపడుతున్నారని సీఎం ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ముంపు, కాలుష్యం సమస్యను పరిష్కరించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. అందులో భాగంగానే భారీ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు,అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీ లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు మెట్రో విస్తరణను పట్టించుకోలేదని విమర్శించారు. మెట్రోను విస్తరించేందుకు మేం ఎంతో కష్టపడుతున్నామని తెలిపారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటే.. బీఆర్ఎస్ వాళ్లు ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ ప్రకటించారని ముఖ్యమంత్రి తెలిపారు. నాలాలపై నిర్మాణాలను నిర్దాక్షి ణ్యంగా కూల్చాలని గతంలో కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. గతంలో వాళ్లు చెప్పిన మాటలనే ఇవాళ తప్పుపడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

## రోహిత్ సహా ముగ్గురు నిందితుల

# కస్టడీపై తీర్పు రిజర్వు

### మోయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అరెస్టయిన ముగ్గురు వ్యక్తుల కస్టడీ పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఈ నెల 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులతో పాటు చేవెళ్ల పోలీసులు రట్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా 11 మంది పట్టుబడగా ఇందులో రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్, ఢిల్లీకి చెందిన న మిత్ శర్మ, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవిలు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం విదితమే. అయితే పోలీసులు దాడిచేసిన సమయంలో రితేష్ రెడ్డికి చెందిన లై సెన్స్ రివాల్వర్‌ను నమిత్ శర్మ తీసుకుని పోలీసులను భయపెట్టేందుకు గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరపడం సంచలనం రేపింది. పోలీసుల పై కాల్పులు జరపాలని రోహిత్ రెడ్డి పురిగొల్పినట్లు వెల్లడయ్యింది. దీంతో రోహిత్ రెడ్డి తన ఫాం హౌస్‌లో అసాంఘీక కార్యకలాపాలకు స్థానం కల్పించినందుకు, తన లైసెన్స్ రివ్వార్‌ను మరో వ్యక్తికి ఇచ్చినందుకు రితేష్ రెడ్డిని, మరొకరి రివాల్వర్‌చేత పోలీసులపై కాల్పులు జరిపినందుకు నమిత్ శర్మను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సేవించిన ఎంపి మహేష్ కుమార్ యాదవ్ సహా అందరికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. కాగా పోలీసులు అరె స్టు చేసిన రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలు ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో వున్నారు. వీరిపై డ్రగ్స్ వాడడం, అక్రమంగా మాదకద్రవ్యాలు క లిగి వుండడంతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను మరింతగా విచారిం చేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని మొయినాబాద్ పోలీసులు రాజేంద్రనగర్‌లో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగి శాయి. ఈ ముగ్గురిని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసుల తరపున వాదించిన న్యాయవాది కోరగా నిందితుల తరపు న్యాయవాది అ భ్యంతరం తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. దీనిపై శుక్రవారం నాడు తీర్పు వెలువడనుంది.



దెబ్బలను చూయిస్తున్న విద్యార్థి

## విద్యార్థిని చితకబాదిన టీచర్

### గోట్లపల్లి మోడల్ స్కూల్‌లో ఘటన
### పోలీసులకు ఫిర్యాదు
### చేసిన బాధిత విద్యార్థి తండ్రి

పెద్దేముల్, మార్చి 18, ప్రభాతవార్త: హోంవర్క్ చేయలేదని ఓ విద్యార్థిని ఓ ఉపాధ్యాయుడు చితకబాదిన సంఘటన పెద్దేముల్ మండలం గొట్లపల్లి మాడల్ స్కూల్‌లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి తండ్రి వడ్డె సాయులు తెలిపిన వివరాల ప్రకారం..తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన తన కుమారుడు పెద్దేముల్ మండలం గొట్లపల్లి మాడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల నుంచి ఎందుకు హోంవర్క్ చేయడంలేదని ఓ ఉపాధ్యాయుడు విద్యార్థి కుడిచేతిపై, భుజంపై కొట్టాడని పేర్కొన్నారు. తన కొడుకుకు సర్ది, జ్వరంతో భాదపడుతున్నందున హోంవర్క్ చేయలేదని అన్నారు. తన కుమారుడిని కొట్టిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ఆర్‌టిసిలో 279.97 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం

### డిమాండ్ మేరకు అదనంగా కొత్త బస్సులు: పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 18:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 279.97 కోట్ల మంది మహిళలు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనమండలిలో బుధవారం ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశం ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా రాష్ట్రంలో మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, విజయశాంతి ప్రశ్నించారు. వారు అడిగిన ప్రశ్నలకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌సమాధానమిస్తూ.. మహాలక్ష్మి పథకం కింద 9 డిసెంబర్, 2023 నుండి ఫిబ్రవరి 28, 2026 వరకు ఆర్టీసీలో 279.97 కోట్ల మంది మహిళలు ఉచితం గా ప్రయాణించారని తెలిపారు. ఈ పథకం అమలు కింద 2024-25 సంవత్సరంలో మొత్తం రూ.3866.30 కోట్లను, 2025-26లో ఫిబ్రవరి 26 వరకు రూ. 2913.82 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందన్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను తీర్చడానికి అదనంగా కొత్త బస్సులు నడుపుతుందన్నారు. గతంలో ఆర్‌టీసీకి రూ. 664 కోట్ల బకాయిలు ఉండేవని, దానిని రూ. 300 కోట్లకు తగ్గించామన్నారు. రూ. 100 కోట్లతో బస్‌స్టేషన్‌లలో మౌలిక సదుపా యాలు కల్పిస్తున్నామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత 3038 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. తాము 2708 కొత్త బస్సులు కొనుగోలు చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్న మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని, 2013 ఆర్పీఎస్ బాండ్లు చెల్లించామని, దాని ద్వారా రూ. 280 కోట్ల భారం పడింద న్నారు. రాష్ట్రంలో కంప్యూటర్ ఆధారిత వాహన ఫిట్‌నెస్ పరీక్షల నిమిత్తం ఇప్పటి వరకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్)ను ఎన్నింటిని ఏర్పాటు చేశార న్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ కుర్మయ్య ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున 37 ఆటో మేటిక్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాల ని ప్రతిపాదించడ మైందని, సెప్టెంబర్ 30, 2024న తెలంగాణ ఆర్ అండ్ బి శాఖ జీవో నం 28 ద్వారా పరిపాలన అనుమతులు ఇవ్వడమైందని, ఈ ఏటీఎస్ ల ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంద న్నారు. ఇవి పూర్తిగా ప్రభుత్వ యాజమా న్యంలో నడుస్తాయని, అందులో ఎటువం టి ప్రైవేట్ యాజమాన్యం ఉండదన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పాత వాహనాలపై గ్రీన్ టాక్స్ రూ.68.11 కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.71.14 కోట్లు గ్రీన్ టాక్స్ ద్వారా వచ్చిన నిధులను ఈ శాఖ ఉపయోగించిన ప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం పన్ను మినహా యింపులు ఇవ్వడం జరుగుతుందన్నారు.



## నిండు గర్భిణి సమ్మక్కను గొంతు నులిమి హత్య

- ప్రేమ పేరుతో మోసం.. కుల వివక్షతో దారుణం
- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్షలు అమలుకు డిమాండ్

**పెంచికల్ పేట, మార్చి 18 ప్రభాతవార్త:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామంలో నిండు గర్భిణీ అయిన ఆదివాసి యువతీ ఆత్రం సమ్మక్క (25) ను దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. గత నాలుగేళ్లుగా ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన కేర్కరి జలపతి, ఏడు నెలల గర్భవతిగా ఉన్న సమ్మక్కను గొంతును నులిమి హత్య చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికులు ఆదివాసి సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం కేర్కరి జలపతి నాలుగేళ్ల క్రితం సమ్మక్కను ప్రేమ వివాహం చేసుకొని అనంతరం ఆమెను వేధింపులకు గురిచేసి ఇంటి నుంచి పంపించాడు. ఈ ఏడాది మళ్లీ పెళ్లి చేసుకుంటానని నమ్మించి సమ్మక్కను గర్భవతిని చేశాడు. అయితే పెళ్లి చేసుకోవాలని ఆమె ఒత్తిడి చేయడంతో కుల వివక్షతతో హత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై నిజ నిర్ధారణ కోసం ఆదివాసి గోండ్వానా కోయ సంక్షేమ సంఘం, ఆదివాసి మహిళా సంఘం నేతలు బుధవారం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితుడు జలపతి పై మాత్రమే కాకుండా అతనికి సహకరించిన కుటుంబ సభ్యులు ఇతరులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి, నిందితులను తక్షణం అరెస్టు చేయాలి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ జరపాలి, బాధిత కుటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి, 5 ఎకరాల భూమి ఇవ్వాలి, ఆదివాసి మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో కుల హత్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సంఘాలు కోరాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన న్యాయం కోసం శనివారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ కొమరం మాంతయ్య, గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య, ప్రధాన కార్యదర్శి మధుకర్, మహిళా నాయకులు పంద్రం పుష్పలత, తోటి శ్రీదేవి, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల వినోద, దుర్గం అనిత, షాహిన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**హత్య చేసిన నిందితుడు అరెస్ట్**




కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం సమ్మక్క (25)ను ప్రేమ పేరుతో మోసం చేసి గర్భవతిని చేసి, అనంతరం హత్య చేసిన నిందితుడు కేర్కరి జలపతిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జైహింద్పూర్ గ్రామానికి చెందిన కేర్కరి జలపతి (33) గత కొన్ని సంవత్సరాలుగా సమ్మక్కతో ప్రేమ సంబంధం కొనసాగిస్తూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భవతిగా మారింది. ఇటీవల సమ్మక్క పెళ్లి విషయమై జలపతిని ప్రశ్నించడంతో, ఆమెను తప్పించుకోవాలనే దురుద్దేశంతో హత్యకు పన్నాగం పన్నాడు. ఈనెల 14వ తేదీ సాయంత్రం సమ్మక్కను జైహింద్పూర్ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై దాడి చేసి, ముక్కు మూసి ఊపిరి ఆడనివ్వకుండా హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## రాష్ట్రంలో మైనార్టీలను అణగదొక్కిన కెసిఆర్

### మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే
### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ

గజ్వేల్, మార్చి 18 (ప్రభాతవార్త): రాష్ట్రంలో మైనార్టీలను మాజీ సిఎం కెసిఆర్ అణగదొక్కారని, ఆయన కామారెడ్డికి బదులుగా రాజాసింగ్‌పై పోటీ చేస్తే బాగుండేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్‌అలీ ఎద్దేవ చేశారు. బుధవారం గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మజీద్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ మతీన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు ఒరిగిందేమీలేదని, నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత వైఎస్‌ఆర్, కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. ఆ రిజర్వేషన్ ఫలాలు మైనార్టీలకు చేరగా, సిఎం రేవంత్‌రెడ్డి కృషి ఫలితంగా ప్రస్తుతం పరోక్షంగా 9 శాతం వరకు ప్రయోజనం జరుగుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయగా, పేదరిక నిర్మూలన, సబ్సిడీ ఆధారిత పథకాల వర్తింపు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, మైనార్టీ గురుకులాలు, షాదీముబారక్, పేద మైనార్టీలకు ఉన్నత చదువులు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతకు ముందు మజీద్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ మతీన్, మాజీ ఛైర్మన్ సాజిద్‌బేగ్‌ల ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మాజీ మంత్రి షబ్బీర్‌అలీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ చందన రవీందర్, జిల్లా కాంగ్రెష్ కమిటీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్, వైస్ ఛైర్మన్లు సర్దార్‌ఖాన్, ప్రభాకర్, నాచగిరి ఛైర్మన్ రవీందర్‌గుప్త, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పంచాయతీరాజ్ అభియాన్ సంఘటన జిల్లా అధ్యక్షుడు కడపల నర్సింహా, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



### ఉగాది శుభాకాంక్షలు తెలిపిన
## ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్,మార్చి18 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు..పరాభవ నామ తెలుగు సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ఆకాంక్షి ంచారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పే లా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆకాంక్షించారు.తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ ఉగాది సందర్భంగా వికారా బాద్ నియోజకవర్గం, వికారాబాద్ జిల్లాతో పాటుగా తెలుగు ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన తెలుగు సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండి రైతులు ఈ ఏడాదిలో ధనధాన్యాలతో తలతూగాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

## తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వరు..?

### బిజెపి ఎమ్మెల్యేలపై మంత్రి వాకిటి ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధుల కేటాయింపుల్లో తెలంగాణకు కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి మండిపడ్డఆరు. అన్ని రాష్ట్రాలకు కేటాయించిన మాదిరిగా తెలంగాణకు ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు అధిక నిధులు కేటాయించి తెలంగాణకు ఎందుకు కేటాయించడం లేదు? తెలంగాణ ఏం పాపం చేసింది? అని బిజెపి ఎమ్మెల్యేలను నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకు వస్తే తెలంగాణ ప్రభుత్వం కూడా సహకరిస్తుందని బిజెపి ప్రజాప్రతినిధులకు సూచించారు. చిన్ననాటి నుంచి తాను ఏ వృత్తిలో కష్టపడ్డానో.. ఆ మత్స్యశాఖను తనకు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు మత్స్యకారుడికి మత్స్య శాఖను ఇచ్చిన సందర్భం లేదని, కాంగ్రెస్ పార్టీ మత్స్యశాఖను తనకు ఇవ్వడం చారిత్రాత్మకమన్నారు. మూసి ప్రక్షాళన చేయడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని, పేదలు మురుగు నీటిలో జీవించొద్దనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేపడుతోందన్నారు.

## రెడ్లు బిసిల మధ్య వివాదం లేపిన కోమటిరెడ్డి

### నాయకుల చిట్‌చాట్
### బిసి నాయకత్వంను అవమాన పరచడమే రాష్ట్ర ఖనిజాబివృద్ధి సంస్థ ఛైర్మన్ అనిల్
### అంతర్గత ఐక్యత కాపాడటానికి ప్రతి ఒక్కరు బాధ్యతతో ఉండాలి: టిపిసిసి జనరల్ సెక్రటరీ సత్యంగౌడ్

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. బిసి నాయకత్వంను అవమానపరచడమే అంటూ బిసిలు నిరసన గళం విప్పుతున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి మాస్ లీడర్ అని ఆయనకు టిపిసి ఇస్తే వచ్చే ఎన్ని కల్లో 100 సీట్లు సాధిస్తామంటూ కొమటి రెడ్డి అనడం తో ఇపుడు కాంగ్రెస్ పార్టీలో రెడ్డి సామాజిక వర్గం బిసి సామాజిక వర్గం మధ్య ఒక వివాదానికి తెరలేపినట్లైంది. కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడు సామాజిక సమతుల్య తకు పెద్దపీట వేస్తోందని బిసినేత డి.శ్రీనివాస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే కాంగ్రెస్ గెలిచిందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థచైర్మన్ అనీల్ గత చరిత్రను గుర్తుచేస్తూ మంత్రిని నిందించారు.పార్టీ అంతర్గత ఐక్యతను కాపడటానికి బాధ్యత కలిగిన పదవిలో ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి పనిచేయాల్సిం దిపోయి బిసి వర్గాన్ని తక్కువ చేసి చూపడం ఆయన స్థాయికి తగదని టిపిసిసి జనరల్ సెక్రటరీ మాదు సత్యంగౌడ్ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న వేళ ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టాల్సిన అధికార పార్టీలో, ఉన్నట్టుండి పిసిసి మార్పు అంశం చర్చకు రావడం ఆసక్తిగా మారింది. దాంతో ప్రస్తుత టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ పరిస్థితి ఏంటి? అంటూ బిసి నేతలు కోమటిరెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. ఖనిజావృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ నేత ఈరవత్రి అనిల్ స్పందిస్తూ సొంత పార్టీపై కోమటిరెడ్డి వ్యాఖ్యలు దురదృష్టకరం అన్నారు. మంత్రి వ్యాఖ్యలు బిసి నాయకత్వా న్ని కించపర్చడమేనని ఆయన అభిప్రాయ పడ్డారు. బిసిల పట్ల ఎందుకంత వివక్ష అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నిన్ను మంత్రిని చేస్తే కీలకమైన హోదాలో ఉండి ఇలాంటి పిచ్చి పిచ్చి స్టేట్‌మెంట్లు ఇస్తూ పార్టీ పరువు తీస్తున్నారని సొంత పార్టీ మద్దతరులే సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో రేవంత్ రెడ్డిపైనే తీవ్ర ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి ఇప్పుడు ఆయన కేబినెట్ లోనే ఉంటూ బిసిలను అవమానించేలా మాట్లాడుతున్నారని మండిపడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతూ, ప్రజల్లో విశ్వాసాన్ని మరింతగా పెంపొందించు కుంటున్న ఈ కీలక సమయంలో, పార్టీ అంతర్గత ఐక్యత అత్యంత అవసరమని జనరల్ సెక్రటరీ మధు గౌడ్ పేర్కొన్నారు. టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం పార్టీకి దిశానిర్దేశం చేస్తోందని ఆయన అన్నారు.ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో పార్టీకి స్థిరత్వం, సమగ్రత అవసరమని పేర్కొంటూ, మహేష్ కుమార్ గౌడ్ గారు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలు మరింత సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఇది ఇలా ఉంటే ఆర్ అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వివరణ ఇస్తూ జగ్గారెడ్డి ఇఫ్తార్ విందు విజయవంతమైందనీ జగ్గారెడ్డిని అభినం దించానని, మహేష్‌గౌడ్‌ను ఇబ్బంది పెట్టాలని కాదని వివరణ ఇచ్చుకొన్నారు.

## ఢిల్లీలో ఎదురుపడిన రేవంత్‌రెడ్డి, రోజా

**హైదరాబాద్, మార్చి18 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా ఢిల్లీలో పార్లమెంట్ భవనలో ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారు షేక్ హ్యాండ్ ఇచ్చుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. అదే సమయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసేందుకు రోజా పార్లమెంటు భవనానికి వచ్చారు. ఈ సందర్భంగా ఇరువురు తారసపడ్డారు. రోజాను పలకరించిన రేవంత్ రెడ్డి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రేవంత్ రెడ్డితో వెంట ఉన్న నాయకులు పశ్నించగా, తాను పని మీద వచ్చానని ఆమె సమాధానం చెప్పారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని రోజా పలకరించారు.



### మట్టి పాత్రలను వాడండి
## ఆరోగ్యాన్ని కాపాడుకోండి: గుత్తా సుఖేందర్ రెడ్డి

### ఉగాది పండుగ సందర్భంగా మట్టి పాత్రలు అందజేసిన పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 18: మట్టి పాత్రలను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకుని కుల వృత్తిని ప్రోత్సహించాలని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ పురస్కరించుకొని “మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి కుల వృత్తులను ప్రోత్సహించండి“ నినాదంతో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు ఉగాది మట్టి పాత్రలను మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు.. అందులో ఉగాది పండగకి ఉపయోగపడే మట్టి కుండా, గ్లాస్‌లు, జగ్గు, బౌల్, షడ్రుచులు ఉండే మామిడి కాయలు, వేప పువ్వు, బెల్లం, చింతపండు, కారం వస్తువులు ఉగాది కిట్‌లో అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి, పర్యావరణాన్ని రక్షించడానికి మట్టి పాత్రలు ఉపయోగించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మన సంస్కృతి సంప్రదాయాలకు పండగలతో మట్టి పాత్రలు అనువైనవనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి, కుల వృత్తులను కాపాడడానికి ఆరోగ్యాలను కాపాడుకోవడానికి మట్టి పాత్రలు మంచివన్నారు. మట్టి పాత్రల వాడకం తరతరాల సంప్రదాయమని, దీని వల్ల ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని, ఉగాది పండుగ సందర్భంగా మట్టి పాత్రలు వాడాలని, కుల వృత్తులను కాపాడాలని, ఆరోగ్యాన్ని రక్షి ంచుకోవలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

## నిజామాబాద్‌లో మ్యూల్ ఖాతాదారుల అరెస్టు

### మూడు నెలల వ్యవధిలో రూ.31 కోట్ల లావాదేవీలు

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** విదేశాల్లో వుండే బడా సైబర్ నేరగాళ్ల కు సహకరించే క్రమంలో భారత్‌లో వారికి మ్యూల్ ఖాతాలను అంది స్తున్న వ్యక్తులపై సైబర్ క్రైంతో పాటు ఆయా జిల్లాల పోలీసుల దాడుల పరంసర కొనసాగుతూనే వుంది. నిజామాబాద్ పట్టణంలో ఐదుగురు వ్యక్తు లు తప్పుడు సర్టిఫికేట్లు, ఇతర పత్రాలు అందించి బ్యాంకుల్లో బిజినెస్ అకౌంట్ల ను తీసుకుని వాటిని సైబర్ నేరగాళ్లకు అందిస్తున్న వైనాన్ని స్థానిక పోలీసులు రట్టు చేశారు.

దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కమిషనర్ పోతురాజు సాయి చైతన్య బుధవారం మీడియాకు వెల్లడించా రు. బోధన్‌కు డ్రైవర్ చెందిన మహమ్మద్ అజర్(28), డెయిరీ ఫారం నిర్వాహకుడు శ్యామల నవీన్(30), ప్రైవేటు ఉద్యోగి ఖాసీం పటేల్(25), పళ్ల వ్యాపారం చేసే మహమ్మద్ మిన్ అహ్మద్(35), మొబైల్ షాప్ నిర్వాహకుడు సయ్యద్ హాఫీజ్(32)లు మూడు నెలల క్రితం నిజామాబాద్ జి ల్లాలోని పలుచోట్ల పలు బ్యాంకుల్లో తప్పుడు పత్రాలతో బిజినెస్ అకౌంట్లు తెరిచారు. ఈ ఖాతాల నుంచి మూడు నెలల వ్యవధిలో 31 కోట్ల రూపాయల సైబర్ నేరాలకు సంబంధించిన డబ్బుల లావాదేవీలు జరిగాయని తేలింది. కాగా ఈ తరహా మ్యూల్ ఖాతాలపై ఉక్కుపాదం మోపుతామని పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇటువంటి నేరగాళ్ల విషయంలో అన్నివర్గాల వారు అప్రమత్తంగా వుండాలని ఆయన కోరారు.

## సుఖసంతోషాలు వెల్లివిరియాలి

### ఉగాది శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి చీఫ్
### గాంధీభవన్‌లో పంచాగ శ్రవణం నేడు

**హైదరాబాద్, మార్చి 18,ప్రభాతవార్త:** తెలుగు ప్రజల నూతన సంవత్సర పండుగ ఉగాది సందర్బంగా రాష్ట్ర ప్రజలందరికీ టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరాభవ నామ సంవత్సరాది ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యాలు నింపాలని ఆకాంక్షి ంచారు... ఉగాది కొత్త ఆరంభాలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, ప్రతి కుటుంబం సుఖశాంతులతో, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని కోరుకున్నారు.

రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల సమిష్టి నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు ప్రతి వర్గానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రైతులు, మహిళలు, యువతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ వారి జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్య ్యమని స్పష్టం చేశారు. ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబమని, సమాజం లో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప సందర్భమని అన్నారు.

## ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేసిన పోలీసు శాఖ

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలకు పోలీసు శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు కచ్చితంగా పోలీసు శాఖ అనుమతులు తీసుకోవాలని, దీంతో పాటు తమ వద్ద పనిచేసే గార్డులు, ఇతర సిబ్బందికి సంబంధించిన గత చరిత్రను సమీప పోలీసు స్టేషన్ల నుంచి తీసుకోవాలని నిఘా విభాగం అదనపు డిజి విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సెక్యూరిటీ ఏజెన్సీలు తమ వద్ద పనిచేసే సిబ్బంది ఎలాంటి వారో తెలియకుండా వారిని విధుల్లో చేర్చుకోరాదని, ఇదే వి ధంగా వారిని నమ్మి మరోచోట డ్యూటీలో వుంచరాదని ఆయన తెలి పారు. దీనివల్ల ఆయా సంస్థల్లో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం వుందని ఆయన హెచ్చరించారు. సెక్యూరిటీ ఏజెన్సీలు కచ్చితంగా నిబంధనలను పాటించి ప్రజా భద్రత చట్టాన్ని అమలు చేయాలని, తమ వద్ద ప నిచేసేవారు మంచివారై వుండేలా చూడాలని ఆయన కోరారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వార్త

ఈ ప్రపంచం మనిషి అవసరాలను తీర్చగలదు కానీ కోర్కెలను ఎప్పటికీ తీర్చలేదు.

-మహాత్మాగాంధీ

# ఎల్‌నినో వణుకు!

ఆకాశంకేసి చూస్తే ఒక్కసారిగా మబ్బులు మింగేస్తున్నట్లుగా ఉన్నా నాలుగు రోజులు పోతేకానీ మన వాతావరణమేమిటో దాని సత్తా ఏమిటో కానీ తెలియదు. ఎల్‌నినో తడాఖా చూపించే రోజులు ముందున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోయాయి. మధ్యలో తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్షాలు తప్పవని వాతావరణ కేంద్రాలు ముందస్తుగానే హెచ్చరించడంతో రైతాంగం కాస్త మేలుకొందని చెప్పాలి. ద్రోణి ప్రభావంతో తెలంగాణలో కొన్నిప్రాంతాల్లో వడగండ్ల వానలు కురిసాయి. ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణం నమోదైంది. పగలు ఎండ కాస్తే రాత్రి వానలు పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో కాసేపు ఎండ, కాస్సేపు చినుకులతో హడావిడి చేసింది. ఇలాంటి వాతావరణాన్ని తెలుగు రాష్ట్రాలలో 'ఎండావాన కలిపి కురిస్తే' విచిత్రంగా భావిస్తారు. ఎండలు మండిపోయి మారిన వాతావరణం వల్ల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలేపడినా ఈసారి పంట ఉత్పత్తుల జాగ్రత్తల విషయంలో రైతు కాస్తంత ఒడ్డున పడ్డాడనే చెప్పాలి. అయినా కొన్ని ప్రాంతాల్లో సాగు ఉత్పత్తులకు ఇబ్బంది వచ్చింది. వాతావరణానికి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌లు జారీ అయ్యాయి. ఈదురుగాలులకు చెట్లు నేలవాలగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండే ఎండల సమయంలోనూ విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. ఎ.సిల వాడకం కారణంగా ఈ నెలలో ఇంతవరకు గరిష్టంగా 18,228 మెగావాట్ల డిమాండ్ రికార్డు అయింది. పశ్చిమాసియాలో ఒక తెలంగాణలోనే యుద్ధవాతావరణం కారణంగా ఎల్పీజీ వంట గ్యాస్‌కు కొరత ఏర్పడ్తుందన్న భయంతో విద్యుత్ గ్యాస్ స్టౌల వాడకం వల్ల కూడా విద్యుత్ వినియోగం పెరిగింది. అదే సమయంలోగ్యాస్ వినియోగం 17 శాతం తగ్గిపోవడాన్ని బట్టి గ్యాస్ కొరత పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రానురాను పెరిగే ఎండలు మరోపక్క ఎల్పీజీ గ్యాస్ కొరత ఎదురైతే విద్యుత్ వినియోగం బాగా పెరుగుతోంది. సాపేక్షంగా గత యేడాది ఇదే సమయపు లెక్కలు ఎలా ఉన్నా ముందుకనబడే పరిస్థితులు ప్రమాదాన్నే సూచిస్తున్నాయి. ఇక ఈ యేడాది ఎల్‌నినో ప్రభావం వలన అనావృష్టి పరిస్థితులకు అవకాశమున్నట్లు కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరికలు అటు రైతాంగం, ఇటు వ్యవసాయాధికారుల దృష్టికి వచ్చినవే. గత యేడాది రోహిణికార్తె నాటికే ఎండలు మండిపోయాయి. ముందు నుంచీ వేడిమి వాతావరణం కారణంగా తర్వాత తర్వాత అలవాటుపడిపోయారు. ఈసారి కూడా అలాంటి పరిస్థితులే తలెత్తనున్నాయి. రుతుపవన ప్రభావంతో కురిసే వర్షాలు కూడా ఆలస్యమయ్యే పరిస్థితి. ఈ యేడాది ద్వితీయార్థంలో ఎల్‌నినో భూ వాతావరణాన్ని వేడెక్కిస్తుందనే అంచనాలున్నట్లు ప్రయివేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. కానీ ప్రకృతితాపం ఈనాలుగు రోజులపాటు వర్షాలతో కాస్త ఉపశమనంగా అనిపించినా ఆ తర్వాత మండే ఎండలు గుబులు పుట్టిస్తాయనిపిస్తోంది. కారణం ఉష్ణమండలం పసిఫిక్ మహాసముద్రంలో గత నెలలోనే లానినో బలహీనపడింది. తటస్థ పరిస్థితులు ఏర్పడినట్లు కనపడినా ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో ఎల్‌నినో ప్రభావంతో వేడి వాతావరణం మరింతగా బలపడుతుంది. భూమధ్యరేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహా సముద్రంలో ఎల్‌నినో ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ఊపందుకునే సమయంలో వచ్చి వాతావరణ ప్రపంచ నెత్తిన పెద్దపిడుగు వేసేటట్లుంది. నైరుతి రుతుపవనాలు ఊపందుకుంటాయని భావించినా ఎల్‌నినో దక్షిణాది దేశాల ప్రతికూల ప్రభావాలు చూపుతుంది. ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా, భారత ఉపఖండ దేశాలలో వర్షపాతంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. జులై నెలలో ఎల్‌నినో తీవ్రత కనపడి కరువు పరిస్థితులు ఏర్పడాల్సి ఉండగా అంతకు ముందుగానే ఏర్పడ్తాయని ఆసియా, పసిఫిక్ క్లైమెంట్ సెంటర్ స్పష్టం చేస్తోంది. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో రెండూ విడివిడిగా కాకుండా ఒకేసారి మీదపడ్తున్నాయి. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా దేశాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. జులైనెలలో ఎల్‌నినో ఊపందుకుంటే సాగునీరు, తాగు నీటిఎద్దడి తలెత్తితే కరువు తాండవమాడుతుంది. పశు జీవాలకు నీటిఎద్దడి ఏర్పడితే వాటి ప్రాణాలకే అపాయం కలుగుతుంది. ఎక్కువ కాలం వాతావరణం ఇలాగే ఉంటే సాగుపై ప్రభావం ఉంటుంది. రాబోయే ప్రమాదకర పరిస్థితులను అంచనావేసుకుని రైతాంగానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఎందుకో ఈసారి 'ఎల్‌నినో' వేసవి సీజన్‌లో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలలేమి, భిన్న వాతావరణాలు గోచరిస్తాయని ముందుగానే అంచనా వేసారు. ఇటీవల దశాబ్దాలలో ఈసారి వచ్చేది 'సూపర్ ఎల్‌నినో'గా భావిస్తున్నారు. ప్రపంచమే మలమల మాడిపోయే పరిస్థితులు ఉత్పన్నమయ్యే ఛాన్స్ ఉంది. అసాధారణ రుతుపవనాలు చూస్తామని యూరోపియన్ సెంటర్ ఫుల్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్ పేర్కొంది. అయితే దీని చెడు ప్రభావమంతా భారతదేశం మీద ఎక్కువగా ఉంటుంది. మార్చి, మే నెలలలో సగటు కంటే అధిక భూ ఉపరితల ఉష్ణోగ్రతలు ఉంటాయని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరిస్తోంది. ఎల్‌నినో, లానినో ఏదైనా కాలానుగుణ ప్రత్యామ్నాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి వస్తుంది. అప్పుడే భారత్ సుభిక్షంగా ఉండగలదు.

మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.




లియో టాల్‌స్టాయ్

వ్యక్తిత్వాన్ని మలుచుకోవడానికి సమాజం ఎంత అవసరమో, ఊహాశక్తిని పరిపుష్టం చేసుకోవడానికి ఏకాంతం అంత అవసరం.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



### ఆచితూచి మాట్లాడాలి

ప్రసిద్ధ నటుడు హాస్య నటచక్రవర్తి రాజేంద్రప్రసాద్ దిగ్గజ నటులుకాంతారావు గారిని ప్రశంసిస్తూతమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, నటులు అయినటువంటి శ్రీ ఎం.జీ.ఆర్. గారిని తక్కువ చేసితప్పుగా మాట్లాడటం అత్యంత బాధాకరమైనవిషయం. రాజేంద్రప్రసాద్ఆతరువాత ఎం.జీ.ఆర్. అభిమానులకు, తమిళ ప్రజానీకానికి తమిళంలో క్షమాపణలు చెప్పినా, నోట జారిన మాట వెనక్కు రాదు కదా! ఒక సభలో మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడటం ప్రసంగీకుల ప్రధాన లక్షణం. సభలో ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో తెలుసుకోకపోతే ఇట్లాంటి దుస్సంఘటనలే ఎదురవుతాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సభలో మాట్లాడేటప్పుడు ఎంతో హుందాగా, సూటిగా, పొరపాట్లు దొర్లకుండా చూసుకుంటారు. మన తెలుగు నటులు కూడా రజనీకాంత్ గారిని అనుసరించి హుందాగా, హెచ్చులకు పోకుండా ఉండాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ఎపి విద్యావిధానంలో మార్పులు

ఇటీవల ఏపి విద్యాశాఖ భవిష్యత్ విద్య ప్రణాళికలో అకడమిక్ ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణులైన వారికి సూటిగా ఐటీఐలో ప్రవేశం కల్పించే వెసులుబాటు చేసే విధానం చాలా ఉపయోగకరం. 15 ఏళ్ల లోపే వారికి పని చేసే విద్యలో శిక్షణ పొందుతారు. దానిలో పని తీరుబట్టి ధ్రువపత్రాలు ఇస్తూ ,నేరుగా పదో తరగతి పరీక్షకు అవకాశం ఇస్తున్నారు. దానిలో ఉత్తీర్ణతఐతే వారు నేర్చుకున్న పనిని మరింత మెరుగుపరిచి ప్రైవేట్‌గా భృతికోసం పనిచేసి కొంతసంపాదనచేయవచ్చు. తదుపరి విద్య సాగించవచ్చు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### రైల్వే టికెట్స్‌లో వెసులుబాటు

రైల్వే ప్రయాణ టికెట్స్ తీసుకోవడం కొంతమందికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. సీజన్ టికెట్స్ పూర్వం లాగా రైల్వే స్టేషన్ బుకింగ్ కౌంటర్లో ప్రస్తుతం ఇవ్వడం లేదు. ఫోన్‌లో టికెట్ బుక్ చేయడం గ్రామీణ ప్రాంతాల వారికి నిరక్షరాస్యులకు, వృద్ధులకు వికలాంగులకు ఇబ్బంది కలుగుతుంది. రైల్వేటికెట్లు తీసుకోవడంలో రైల్వే శాఖ అధికారులుసహకరించాలి. వికలాంగులకు సీజన్‌టికెట్‌లో రాయితీ కల్పించాలి. ఆఫ్‌లైన్‌లో కూడా రైల్వే టికెట్స్ ఇవ్వాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు,వరంగల్ జిల్లా

### పంచాంగాలు కొంతమందికి బతుకుదెరువు

ఆకాశంలోని చుక్కలు, చేతిలోని గీతలు జీవితాలను మార్చవు. ఉగాది వచ్చిందంటే ఈసంవత్సరం ఏమిజరుగుతుందో, మన భవిష్యత్తు గురించి పంచాంగంలో ఏమివ్రాసివుందో అనుకుంటూ ఆదుర్దాగా కొంతమంది ఎదురుచూస్తుంటారు. ఈ బలహీనతలను ఆసరా చేసుకొని పంచాంగం పంతుళ్లు, ఏదో నోటికొచ్చింది చెప్పి సంభావనాలు మాత్రం భారీగా పుచ్చుకుంటారు. అధికారంలో ఉన్నవారికి వారి ఆస్థాన జ్యోతిష్కులు మరలా మీరే అధికారాన్ని చేపడతారని చెపుతారు. ప్రతిపక్షవారికి వారి ఆస్థాన జ్యోతిష్కులు మీరే అధికారంలోకి వస్తారని చెపుతారు. ఇక్కడే వారి అబద్దాల పంచాంగం బట్టబయలు అవుతుంది. పంచాంగం నిజమయితే ఇద్దరికి ఒకే ఫలితం చెప్పాలికదా ! కాబట్టి పంచాంగాలుబూటకం. మనజీవితాలకు పంచాగాలకు ఎలాంటి సంబంధంలేదు. ప్రపంచంలో జ్యోతిష్యం నిజమని ఇంతవరకు రుజువు కాలేదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### సామాజిక మాధ్యమాల ప్రభావం

పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావాన్ని తగ్గించేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇటీవల కీలక నిర్ణయాలుతీసుకున్నాయి. 16సంవత్సరాలలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలను ఉపయోగించకుండా నిషేధం విధించే దిశగా చర్యలు ప్రకటించడం చర్చకు దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే 13 సంవత్సరాల లోపు పిల్లల సామాజిక మాధ్యమ వినియోగాన్ని వచ్చే తొంభైరోజుల్లో నిషేధించనున్నట్లు ప్రకటించారు. ఈనిర్ణయం వెనకఉన్న ఉద్దేశం పిల్లలను డిజిటల్ ప్రమాదాల నుంచి రక్షించడం అనే విషయంపై సందేహం లేదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### 'ఎఐ' అంటే భయం

అమెరికా కంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటేనే భయం చాలా పెరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు, తెలివైన వాళ్ళు ,మోసగాళ్లు, అగ్రవర్ణాలు ఉన్న అద్భుతమైన ప్రదేశమే అమెరికా. అలాంటి వాతావరణంలో నిర్భయత్వానికి చోటు చాలా తక్కువ. ఎప్పుడు ఎవడు ఏ ఆయుధంతో ఎటాక్ చేస్తాడో అనే భయం ప్రతి వాళ్లలోనూ ఉంటుంది. అలా ఎటాక్ చేయడానికి, కుదిరితే చంపేయడానికి పెద్దకారణాలేమీ ఉండవు. ఆర్టిఫిషియల్‌కి ఆపోజిట్ నేచురల్, అన్ నేచురల్ నైనా భరిస్తామో కానీ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను భరించలేకపోతున్నాం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పర్యావరణ రక్షణకే మూసీ ప్రక్షాళన!

**నదితీరాల్లో అధిక నిర్మాణాలు లేదా పెద్ద వాణిజ్య ప్రాజెక్టులు చేపడితే ప్రకృతి వ్యవస్థకు నష్టం కలగవచ్చని వారు భావిస్తున్నారు. అందువల్ల దీర్ఘకాలిక పర్యావరణ రక్షణను ప్రాధాన్యంగా తీసుకునే స్థిరమైన ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ సవాళ్లున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ తెలంగాణలో అత్యంత ప్రతిష్ఠాత్మక పట్టణ మార్పు కార్యక్రమాలలో ఒకటిగా భావించబడుతోంది. ఇదిసమర్థవంతంగా అమలైతే కాలుష్యంతో నిండిన నదిని పునరుద్ధరించగలదు. పట్టణ, మౌలిక సదుపాయాలను మెరుగుపరచగలదు. కొత్త వినోదస్థలాలను సృష్టించగలదు. హైదరాబాద్ భవిష్యత్ రూపాన్ని మార్చగలదు. అందువల్ల మూసీనది కథ నగరపు గతపోరాటాలను, భవిష్యత్ తరాల ఆశలను ప్రతిబింబిస్తుందనీ, ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన నది పర్యావరణ పునరుద్ధరణకు, ఆధునిక పట్టణ అభివృద్ధికి ప్రతీకగా మారగలదని, ప్రపంచ దృష్టిని ఆకర్షించే అత్యంత ప్రతిష్ఠాత్మక చారిత్రక మార్పు అవుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.**

సురేష్ కశ్యప్

ఒకనాటి అఖండ భారతావనిలో నైజాం నవాబులు ఏలిన రాజ్యాలలో తెలంగాణ ప్రాంతం ఒకటి. సాయుధ పోరాటాలు బలహీన వర్గాల అణచివేతతోపాటు నాగరికాభివృద్ధితో ప్రపంచ పటంలోనే అత్యంత చారిత్రాత్మిక సంతరించుకున్న గడ్డమనది. కళలు, సంగీతం సంస్కృతి, నృత్యం, సొగసులు ఉప్పొంగే నగలు, ముత్యాలు, రత్నాలు, జలజలపారే మూసీ, జీవనదుల పరవళ్ళు జంట నగరాలకే భాగ్య రేఖలు. హైదరాబాద్ నగర చరిత్రలో మూసీ నది కథకు ఎంతో దగ్గర సంబంధం ఉంది. అభివృద్ధి అనేక సవాళ్లతో ముడిపడి ఉంది. చాలా సంవత్సరాల క్రితం ముసీనది ఇక్కడ నివసించే ప్రజలకు జీవనాధారంగా ఉండేది. ఈ నది స్వచ్ఛంగా ప్రవహిస్తూ వ్యవసాయం, దైనందిన జీవితం, వాణిజ్యానికి మద్దతు ఇచ్చేది. అయితే ఈ నది ఒక విషాదకరమైన ఘటన వల్ల కూడా ప్రసిద్ధి చెందింది, అది హైదరాబాద్ భవిష్యత్ ప్రణాళికలను మార్చేసింది. 1908 సంవత్సరంలో భారీ వర్షాల తరువాత మూసీ నది భయంకరమైన వరదలతో ఉప్పొంగి నగరంలో భారీ విధ్వంసాన్ని సృష్టించింది. ఇళ్లు, రహదారులు, ప్రజా భవనాలు దెబ్బతిన్నాయి. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విపత్తు అప్పటి హైదరాబాద్ రాష్ట్ర నిజాం పాలకులను తీవ్రంగా కదిలించింది. తద్వారా వరద నియంత్రణ, నీటి నిర్వహణపై వారు గంభీరంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి విపత్తులు మళ్లీ జరగకుండా ఉండేందుకు నది ఎగువ ప్రాంతంలో పెద్ద జలాశయాలను నిర్మించాలని పాలకులు ఆదేశించారు. దాని ఫలితంగా ఇరవయ్యవ శతాబ్ద ప్రారంభంలోనే రెండు ప్రధాన జలాశయాల ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించబడ్డాయి. ఈ జలాశయాలు వరద నియంత్రణలో సహాయపడటమే కాకుండా హైదరాబాద్ నగరానికి త్రాగునీటికి, సాగునీటికి ముఖ్య వనరులుగా మారాయి. అనేక దశాబ్దాలపాటుమూసీ నది ఎంతో స్వచ్ఛంగా ప్రవహించింది. అంతేకాకుండా ఈ జలాశయాలు నగరాన్ని వరదల నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషించాయి. స్వాతంత్రం తరువాత ముఖ్యంగా 1980 నుండి హైదరాబాద్ నగరం వేగంగా విస్తరించడం ప్రారంభమైంది. నగర జనాభా కూడా భారీగా పెరిగింది, పరిశ్రమలు, అనేకానేక వర్తక వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. దానితో మెట్రోపాలిటన్ ప్రాంతంలో కొత్త నివాస కాలనీలు ఏర్పడ్డాయి. ఈ వేగవంతమైన పట్టణీకరణతో ఒక తీవ్రమైన సమస్య కూడా ఉద్భవించింది. పరిశ్రమల వ్యర్థాలు, శుద్ధి చేయని మురుగు నీరు పెద్ద మొత్తంలో నదిలోకి చేరడం ప్రారంభమైంది. వందలాది కాలువలు మురుగు నీటిని నేరుగా మూసీ నదిలోకి తీసుకెళ్లడం మొదలుపెట్టాయి. కాలక్రమేణా నది తన సహజ ప్రవాహాన్ని కోల్పోయి తీవ్రంగా కాలుష్యానికి గురైంది. చాలామంది ప్రజలకు ఇది సహజ నది కాకుండా నగర మధ్యగా ప్రవహించే ఓపెన్ డ్రైనేజ్ కాలువలా కనిపించడం ప్రారంభమైంది. మూసీ నది కాలుష్యం పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలను సృష్టించింది. నీరు అసురక్షితంగా మారింది, పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించింది, నదిలోని జలచర జీవులు గణనీయంగా తగ్గిపోయాయి. భారీవర్షాల సమయంలో కాలుష్యంతోకూడిన నీరు నది తీరప్రాంతాల్లో ఉన్న తక్కువ ఎత్తైన ప్రాంతాలకు వరద ప్రమాదాన్ని పెంచింది. ఈ సమస్యల కారణంగా నగర ప్రణాళిక కర్తలువిధాన నిర్ణేతలు నదిని పునరుద్ధరించే



మార్గాలను వెతకడం ప్రారంభించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం మూసీనది పునరుజ్జీవనానికి చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రణాళికగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం నదిని శుభ్రపరచడమే కాకుండా మొత్తం నది తీర ప్రాంతాన్ని ఆధునికంగా ఆకర్షణీయమైనదిగ, పర్యావరణపరంగా స్థిరమైన పట్టణ ప్రాంతంగా మార్చడం. ఈ ప్రణాళికను అమలు చేయడానికి ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసింది. అనేక కారణాల వల్ల అది అనుకున్న స్థాయిలో ముందుకెళ్లలేదు. మూసి ప్రక్షాళన సాగలేదు. ఐతే తరువాత తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా రేవంత రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాడే ప్రజాపాలనగా తాను ప్రతిపాదించిన ఆరు గ్యారంటీలతో పాటే మూసీనది పునర్జీవం ప్రాజెక్టుకు శ్రీకారంచుట్టారు. మూసీ నది హైదరాబాద్ నగరంలో సుమారు 55 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం మొత్తం ప్రవాహాన్ని దశలవారీగా అభివృద్ధి చేయడం. మొదటి దశలో హిమాయతసాగర్ సమీపంనుంచి ప్రారంభమై అత్తాపూర్, నాంపల్లి, చాదర్‌ఘాట్, నాగోల్ వంటి ముఖ్య ప్రాంతాల వరకు విస్తరించే భాగాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళిక ఉంది. ఇందులో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు, నది తీరప్రాంతాలు బలోపేతంచేయడం, ల్యాండ్‌స్కేపింగ్, పార్కులువంటి సుందరీకరణ వాతావరణాన్నీ ఏర్పాట్లు చేయడం. ఈ ప్రాజెక్ట్‌లో అత్యంత ముఖ్యమైన అంశం అనేక సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించడం. ఈ కేంద్రాలు మురుగు నీటిని శుద్ధి చేసి తరువాతే నదిలోకి విడుదల చేయడాన్ని నిర్ధారిస్తాయి. అలాగే నదీతీరాల వెంట ఇంటర్‌సెప్టర్ డ్రైన్లు నిర్మించి నగర కాలువల నుంచి వచ్చే మురుగునీటిని పట్టుకుని శుద్ధికేంద్రాలకు మళ్లించి కాలుష్యాన్ని అక్కడే నియంత్రించడం ద్వారా నది పర్యావరణ తోపాటు, ప్రజా ఆరోగ్యాన్ని క్రమంగా పునరుద్ధరించాలనే లక్ష్యంఉంది. ఈ ప్రాజెక్ట్ పర్యావరణ పునరుద్ధరణతో పాటు హైదరాబాద్ నగర వినోదం, పర్యాటక అవకాశాలను కూడా పెంచగలదు. నది తీరాల్లో పార్కులు, నడక మార్గాలు, సైక్లింగ్ ట్రాకులు సాంస్కృతిక స్థలాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికఉంది. ఇవి ప్రజలకు విశ్రాంతి తీసుకోవడానికి, నది అందాలను ఆస్వాదించడానికి అనువైన ప్రదేశాలుగా మారవచ్చు. అదనంగా రహదారులు, వంతెనలను కూడా అభివృద్ధి చేసి నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మెరు గుపరచవచ్చు. అయితే ఈ ప్రాజెక్ట్‌పై చర్చలు, విమర్శలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా నదీ తీరప్రాంతాల్లో నివసించే ప్రజల పునరావాసం గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చాలా సంవత్సరాలుగా నది తీరాల్లో అనధికార నివాసాలు ఏర్పడ్డాయి. ఈ ప్రాజెక్ట్ అమలుకోసం వాటిని తొలగించే అవసరం రావచ్చు. నిరాశ్రయ కుటుంబాలకుప్రభుత్వం సరైనపరిహారం గృహ సదుపాయాలు కల్పించాలని విమర్శకులు డిమాండ్ చేస్తున్నారు. పర్యావరణ నిపుణులు అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణ మధ్య సమతుల్యత అవసరమని హెచ్చరిస్తున్నారు. నదీతీరాల్లో అధిక నిర్మాణాలు లేదా పెద్ద వాణిజ్య ప్రాజెక్టులు చేపడితే ప్రకృతి వ్యవస్థకు నష్టం కలగవచ్చని వారు భావిస్తున్నారు. అందువల్ల దీర్ఘకాలిక పర్యావరణ రక్షణను ప్రాధాన్యంగా తీసుకునే స్థిరమైన ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ సవాళ్లున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మక పట్టణ మార్పు కార్యక్రమాలలో ఒకటిగా భావించబడుతోంది. ఇది సమర్థవంతంగా అమలైతే కాలుష్యంతో నిండిన నదిని పునరుద్ధరించగలదు. పట్టణ, మౌలిక సదుపాయాలను మెరుగుపరచగలదు. కొత్త వినోద స్థలాలను సృష్టించగలదు. హైదరాబాద్ భవిష్యత్ రూపాన్ని మార్చగలదు. అందువల్ల మూసీనది కథ నగరపు గతపోరాటాలను, భవిష్యత్ తరాల ఆశలను ప్రతిబింబిస్తుందనీ, ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన నది పర్యావరణ పునరుద్ధరణకు, ఆధునిక పట్టణ అభివృద్ధికి ప్రతీకగా మారగలదని, ప్రపంచ దృష్టిని ఆకర్షించే అత్యంత ప్రతిష్టాత్మక చారిత్రక మార్పు అవుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ●

# రిజర్వేషన్లతో నష్టపోయేది ఒబిసిలు మాత్రమే!

సొప్పరి నరేందర్

దేశంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యుఎస్ ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ రిజర్వేషన్ ద్వారా సాధారణ వర్గాలకు చెందిన ఆర్థికంగా బలహీన కుటుంబాలకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం కోటా కల్పించబడింది. అయితే ఈ నిర్ణయంపై పలువర్గాలు ముఖ్యంగా ఒబిసి సమాజం చాలా నష్టపోయింది. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ లక్ష్యం ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం చేయడమే అయినా దీనివల్ల వెనుకబడిన ఒబిసి వర్గాలపై చాలా ప్రభావం చూయించింది. భారత రాజ్యాంగానికి 2019లో 103వ సవరణ చేస్తూ కేంద్రప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించింది. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి జాతీయ విద్యాసంస్థల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రభుత్వం వారి వార్షిక ఆదాయాన్ని 8 లక్షలుగా నిర్ణయించింది. ఇదంతా కూడా ఎలాంటి శాస్త్రీయతలేకుండా చట్టాలను అతిక్రమిస్తూ చేసిన సవరణ. ఈ సవరణన్యాయబద్ధతను సవాలు చేస్తూ జనహిత అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ కోర్టులో సవాలు చేసింది. కేవలం ఆర్థిక పరిస్థితి ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వొచ్చనేది రాజ్యాంగంలో ఎక్కడ లేదు. ఎం.ఆర్ బాలాజీ, ఇందిరా సహాని కేసులో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే తీర్పు ఉంది. ఆర్థికంగా వెనుకబడిన సమూహంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చోటు లేకపోవడం కులవివక్ష అంటూ ఈ స్వచ్ఛంద సంస్థ కోర్టును ఆశ్రయించింది. అయితే ఈ సవరణ సబబు అంటూ సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల బెంచ్ 3:2 తేడాతో ఆమోదం తెలుపుతూ తీర్పునిచ్చింది. కాకా కాలేల్కర్ కమిటీ, మండల్ కమిషన్, వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన బీసీ కమిషన్లు అన్నీ బీసీలు, ఓబీసీల జనాభా 52.55 శాతంగా నిర్ధారించాయి. చట్ట ప్రకారం జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల వివరాలు సేకరిస్తున్నారు. అందులో నిర్ధారించిన వారి జనాభాకు అనుగుణంగా వరుసగా 15 శాతం 7.5 శాతం




రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సమూహంలో వీళ్లను మినహా 77.5 శాతం, మిగిలిన 22.5వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఈచట్టాన్ని తీసుకొచ్చారు. ఈ 22.5 శాతంలో 1.5 శాతం ముస్లింలు ఉన్నారు. ఈ 15శాతం ముస్లింలలో 2019 నుంచి ఇప్పటి వరకు 0.5 శాతం మంది కూడా విద్యా, ఉద్యోగావకాశాలు పొందలేకపోయారు. అంటే 7.5 శాతం మందికి ఈడబ్ల్యుఎస్ నుంచి ముస్లింలని మినహాయిస్తే 10శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సబబే అంటూ ఈ న్యాయమూర్తులు అన్యాయమైన తీర్పునిచ్చారు. ఈ ఏడున్నర శాతం ఈడబ్ల్యూఎస్ వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారు అంటే 8లక్షల లోపు ఆదాయం ఉన్నవాళ్లు రెండున్నర శాతానికి మించి ఉండరు. దీనివల్ల మూడు శాతం వారికి పదిశాతం రిజర్వేషన్లు అదనంగా దోచి పెట్టడమే. కులాల వారీగా బీసీల లెక్కింపునకు పార్లమెంటులో హామీ ఇచ్చి వెనక్కితగ్గిన కేంద్ర ప్రభుత్వం. ఇప్పుడు ఎలాంటి అధికారిక లెక్కలు లేకుండా ప్రజల్లో చైతన్యం పెరగాలి. ఆధిపత్య కులాలకు ఆస్తులతో పాటు విద్యా, ఉద్యోగాలు కూడా దోచి పెట్టే ప్రయత్నం చేస్తున్నది. నిజానికి 50శాతం ఓపెన్ కోటాలో పోటీపడాల్సిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఇప్పుడు 40శాతం కోటాలోనే పోటీపడా ల్సి ఉంటుంది. జనాభాలో 55 శాతంగా ఉన్న ఓబీసీలకు కేవలం వారి జనాభాలో సగంమందికి 27 శాతం రిజర్వే షన్లు అమలుజేస్తున్నారు. అదీ క్రీమిలేయర్ లాంటి షరతుల మధ్య 1993 నుంచి ఇప్పటివరకు రిజర్వేషన్లు గంపగుత్తగా 50 శాతానికి మించకూడదంటూ ఎం.ఆర్.బాలాజీ, ఇందిరా సహానీల కేసులో సుప్రీం కోర్టు తీర్పులిచ్చింది. క్రీమీలేయర్ అమలుకారణంగా మిగిలిపోయిన ఉద్యోగాలను ఓపెన్ కోటాలోకి మళ్లించి బీసీలకు అన్యాయంచేశారు. ఉద్యోగాల అమలు అంతా ఆధిపత్య కులాల చేతులోనే ఉంది కాబట్టి 1993 నుంచి ఇప్పటి వరకు దాదాపు ముప్పై ఏండ్లుగా రైల్వేల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మరోవైపు సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా ఇచ్చే రిజర్వేషన్లకు భిన్నంగా కేవలం ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కొంతమంది నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్ల రిజర్వేషన్ విధానాన్ని సమగ్రంగా పునఃపరిశీలించి అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ●

# యువశక్తే దేశాభివృద్ధికి గొప్పబలం

మేకిరి దామోదర్

మనిషి ఈ సమాజానికి కేంద్రబిందువు. సమాజం అనే నిర్మాణం మనుషుల సంబంధాలు, నైతిక విలువలు, పరస్పర గౌరవం, బాధ్యతలపై నిలబడి ఉంటుంది. కానీ నేటి పరిస్థితులను గమనిస్తే, మనిషిని స్వార్థం, అధికారం, అవినీతి, ఆధిపత్యం వంటి దుష్ప్రవర్తనలు క్యాన్సర్‌లా పట్టి పీడిస్తున్నాయి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సామూహిక ప్రయోజనాలను త్యజించే ధోరణి పెరుగుతుండటం సమాజ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ స్థాయిలోనే ఆధిపత్య పోరాటాలు, యుద్ధాలు, రాజకీయ ద్వేషాలు విస్తరిస్తున్నాయి. ఒక దేశం మరొక దేశంపై ఆధిపత్యం సాధించాలనే ఆశతో జరిగే ఘర్షణలు లక్షలాది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. అధికార సామ్రాజ్యకాంక్ష చివరికి స్మశాన వాటికలకే దారి తీస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రపంచంలోనూ, దేశంలోనూ, రాష్ట్రాల్లోనూ అశాంతి వాతావరణంలో జీవనం ఎంతకాలం కొనసాగుతుంది? మానవీయత లేని పాలనను సమాజం నిజంగా కోరుకుంటుందా అనే విషయంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. మనిషి ఎంతగా దిగజారాడంటే, తాను సృష్టించలేని సహజ సంపదలను కూడా నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేస్తున్నాడు. ప్రకృతి ఇచ్చిన వనరులను సంరక్షించాల్సిన బాధ్యత మనిషిపైనే ఉన్నప్పటికీ, అభివృద్ధి పేరిట అడవులు నరికివేత, నదుల కాలుష్యం, భూమి దోపిడీ వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ఇది నిజంగా అభివృద్ధి నమూనా అనుకోవాలా? మనిషి తాను కూర్చున్న కొమ్మనే తానే నరుకుతున్నట్లుగా ఈ ధోరణి కనిపిస్తోంది. మనిషి సంఘజీవి అన్న భావనను మరచిపోయి, తానే సర్వస్వమనే అహంకారంతో విర్రవీగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీనివల్ల కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. డబ్బు కోసం, ఆస్తికోసం, బీమాడబ్బుల కోసం కూడా ప్రాణాలను తీసే అమానవీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తన్ను కన్న తల్లిదండ్రులను, తాను కన్న పిల్లలను, భార్యను, భర్తను, అన్నదమ్ములను హత్య చేసే ఘటనలు వెలుగులోకి రావడం సమాజాన్ని కలవరపెడుతోంది. ఒకప్పుడు విలువలతో నిలిచిన భారతీయ కుటుంబ వ్యవస్థలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరం. మానవ సంబంధాలలో చాలా సమస్యలకు మూలం అపార్థాలే. వినేది సగం, అర్థం చేసుకునేది పావువంతు, ఆలోచించేది సున్నాకానీ స్పందన మాత్రం రెండువందల శాతం అనే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సందర్భాల్లో అనుబంధాలు ఎలా నిలుస్తాయి? సహనం, పరస్పర గౌరవం, సంభాషణ అనే విలువలు తగ్గిపోవడం వల్లే ఈ విభేదాలు పెరుగుతున్నాయి. ఇక సమాజంలో మరో బాధాకర అంశం పరువు హత్యలు. ప్రేమించిన యువజంటలను కులం, మతం పేరుతో అడ్డుకోవడం, వారి ప్రాణాలపై దాడులు జరగడం అమానవీయ చర్య. నిజమైన ప్రేమను అర్థం చేసుకునే పరిణతి సమాజంలో పెరగాలి. కుటుంబాలు కూడా సహనం, అవగాహనతో వ్యవహరించాలి. పాలన సౌలభ్యం కోసం ప్రజలు ఇచ్చే ఓటుతో ఏర్పడిన పార్లమెంట్, రాష్ట్ర చట్టసభలు ప్రజాసమస్యల పరిష్కారానికి వేదిక కావాలి. కానీఅక్కడ కూడా పాలక-ప్రతిపక్ష నాయకులు పరస్పరం అనైతికంగా తిట్టుకుంటూ, రాజకీయ వైరం పెంచుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజల సమస్యలపై గంభీరమైన చర్చలు జరగాల్సిన చోట రాజకీయ ఆరోపణలు, విమర్శలు మాత్రమే వినిపిస్తుంటాయి. మరోవైపు కార్పొరేట్ సంస్థల ఆదాయాలు, కొందరు రాజకీయ నాయకుల సంపదలు భారీగా పెరుగుతుంటే, సాధారణ ప్రజల జీవితం మాత్రం కష్టసాధ్యంగా మారుతోంది. దేశం, రాష్ట్రాలు అప్పుల భారంతో కుంగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలో నైతిక విలువలు తగ్గిపోవడం సహజమే. ప్రజాస్వామ్యంలో మీడియాను నాలుగో స్థంభంగా పరిగణిస్తారు. పాలకులను ప్రశ్నించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ కొన్నిసార్లు మీడియా స్వేచ్ఛ కూడా ఒత్తిళ్లకులోనై నిజాలను చెప్పడంలో వెనకబడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల గొంతును వినిపించాలి, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడతూ, పాలకుల వైఫల్యాలను ఎత్తిచూపడం ప్రజాస్వామ్యానికి మంచిది. ప్రజల్లో కులం, మతం పేరుతో విభేదాలు రెచ్చగొట్టడం కూడా రాజకీయాల్లో సాధారణంగా మారింది. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ప్రజలను విడదీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజలను ఏకం చేయాల్సిన రాజకీయాలు విభజన వైపు నడుస్తున్నాయి. మన దేశపాలన వ్యవస్థలో చట్టసభ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, పత్రికాస్వేచ్ఛ అనే నాలుగు ప్రధాన స్థంభాలు ఉన్నాయి. ఈ వ్యవస్థలు నైతిక విలువలను కాపాడుతూ తమబాధ్యతలను నిజాయితీగా నిర్వహించినప్పుడే సమాజంలో న్యాయం, సమానత్వం, శాంతి నిలుస్తాయి. కానీ ఈ వ్యవస్థల్లో అవినీతి, స్వార్థం పెరిగితే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతుంది. సమాజంపై ప్రభావం చూపే మరో ముఖ్యరంగం సినిమా పరిశ్రమ, బుల్లితెర. వినోదంతో పాటు సామాజిక బాధ్యతను కూడా ఈ రంగాలు గుర్తించాలి. సమాజంలో మంచి విలువలను పెంపొందించే కంటెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. భారతదేశం యువ జనాభా అధికంగా ఉన్న దేశం. యువశక్తి సరైన దిశలో నడిస్తే దేశ అభివృద్ధికి అది గొప్ప బలం. కానీ నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు సరిపడా కల్పించలేకపోతే యువత నిరుత్సాహానికి గురవుతుంది. యువశక్తిని సృజనాత్మక దిశగా మలచడం ప్రభుత్వాల ముఖ్యబాధ్యత. సమాజ నిర్మాణం తరగతి గదిలో ప్రారంభమవుతుందని అంటారు. గురువు-శిష్య సంబంధం ఒకప్పుడు అత్యంత పవిత్రమైనది. కానీ నేడు ఆ బంధంలో కూడా విభేదాలుకనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పరస్పరం గౌరవం కోల్పోతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులన్నింటినీ చూస్తే సమాజం ఎటువైపు వెళ్తోంది అనే ప్రశ్న కలుగుతుంది. మనిషితనం క్రమంగా కనుమరుగవుతున్నట్లుగా అనిపిస్తోంది. పరస్పర గౌరవం, సహనం, నిజాయితీ, మానవీయ భావాలు మళ్లీ బలపడితేనే సమాజం సుస్థిరంగా ముందుకు సాగుతుంది. అప్పుడు మాత్రమే మనిషి నిజమైన మనిషిగా మారగలడు. ●

# 74 మంది ఎమ్మెల్యేలకు షాక్

## - టిక్కెట్లు నిరాకరించిన తృణమూల్ కాంగ్రెస్

## - సువేందుతో మమత ఢీ!

**కోల్‌కతా, మార్చి 18:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ 74 మంది ఎమ్మెల్యేలకు షాకిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో వారికి టికెట్లు నిరాకరించారు. 291 మందితో ప్రకటించిన జంబో జాబితాలో వారికిచోటు లభించలేదు. భవానీపుర్‌లో అసెంబ్లీ ప్రతిపక్షనేత సువేందు అధికారితో మమతా బెనర్జీ తలపడనున్నారు. కాళీఘాట్‌లోని తన నివాసంలో ఆమె అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు.



ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి, పాత కొత్తల కలయికకు, సంస్థాపరమైన సమతుల్యతకు, బిజెపి దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి మమత ప్రాధాన్యమిచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. మొత్తం 294 స్థానాల్లో 291 చోట్ల తాము పోటీచేస్తున్నామని, మిగిలిన 3 సీట్లను డార్జిలింగ్ హిల్స్ లోని భారతీయ గూర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చాకు కేటాయించామని తెలిపారు. పార్టీ కున్న 224 మంది ఎమ్మెల్యేల్లో 135 మందికి మళ్లీ టికెట్లు దక్కాయి. 15 మంది సీట్లు మారాయి. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో తనను ఓడించిన సువేందు అధి కారిపైనే మమత మళ్లీ పోటీకి దిగారు. అయితే ఈసారి వారిద్దరూ భవానీపుర్‌లో తల పడనున్నారు. నందిగ్రామ్‌లో పవిత్రకర్‌కు టికెట్టు ఇచ్చారు. అక్కడ సువేందు అధికారే పోటీ చేస్తున్నారు. టికెట్లు దక్కిన వారిలో యువ నేతలు, వృత్తి నిపుణులు, ప్రము ఖులు ఉన్నారు. ఈసారి సెలబ్రిటీలకంటే బలమైన అభ్యర్థులకే పార్టీ ప్రాధాన్య మిచ్చింది. రాజ్‌గంజ్ నుంచి ఒలింపియన్, ఆసియా క్రీడల బంగారు పతక విజేత స్వప్న బర్మన్, తుఫాన్‌గంజ్ నుంచి మాజీ క్రికెటర్ శివ్‌శంకర్ పాల్ బరిలో నిలిచారు. 291 మంది అభ్యర్థుల్లో 239 మంది పురుషులు, 52 మంది మహిళలు ఉన్నారు. 149 మంది జనరల్, ఒబిసి వర్గాలకు చెందినవారు. 78 మంది ఎస్సీలు, 17 మంది ఎస్టీలున్నారు. 11 అన్‌రిజర్వ్‌డ్ సీట్లలో ఎస్సీలను మమత బరిలో దించారు.

### వలసదారుల కోసం ట్రంప్ సర్కార్ బంపర్ ఆఫర్!

# గౌరవంగా వెళ్లిపోండి.. లేదంటే అరెస్టుచేసి మేమే పంపిస్తాం..

**వాషింగ్టన్, మార్చి 18:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులను దేశం నుంచి పంపించేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త వ్యూహాన్ని ప్రకటించింది. బలవంతంగా కాకుండా, వారంతట వారే స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లేవారికి భారీ ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఇలా వెళ్లేవారికి 2,600 డాలర్లు (సుమారు రూ. 2.40 లక్షలు) ఎగ్జిట్ బోనస్‌గా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ నగదు ప్రోత్సాహకంతో పాటు, వారి స్వదేశాలకు వెళ్లేందుకు అయ్యే విమాన ప్రయాణ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించనుంది. ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే వారు సీబీపీ హోమ్ అనే ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా నమోదు చేసుకున్న వారిని బలవంతపు బహిష్కరణ జాబితా నుంచి తొలగిస్తారు. ఈ కొత్త విధానం వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా భారీ ఆదా అవుతుందని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. ఒక వలసదారుడిని బలవంతంగా అరెస్ట్ చేసి, దేశం నుంచి పంపడానికి సుమారు 18,245 డాలర్లు ఖర్చవుతుండగా, ఈ స్వచ్ఛంద పథకానికి కేవలం 5,100 డాలర్లతోనే పని పూర్తవుతుందని తెలిపింది. ఇది అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును ఆదా చేస్తుందని వివరించింది. అయితే, ఈ అవకాశాన్ని వినియోగించుకోని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. గౌరవంగా వెళ్లిపోండి, లేదంటే మేమే పట్టుకుని అరెస్ట్ చేస్తాం. అప్పుడు మళ్లీ అమెరికాలో అడుగుపెట్టలేరు అని సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోమ్ స్పష్టం చేశారు. గతంలో 1,000 డాలర్లుగా ఉన్న ఈ బోనస్‌ను, ట్రంప్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 2,600 డాలర్లకు పెంచింది. ఇప్పటివరకు ఈ విధానంలో సుమారు 22 లక్షల మంది అమెరికాను వీడినట్లు గణాంకాలు చెబుతున్నాయి.



# కీలక రంగాలకు రూ.54,926కోట్లు

- 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కులకు రూ.33,660 కోట్లు
- పత్తి రైతులకు కనీస మద్దతు ధర కోసం రూ.11,712 కోట్లు
- కేబినెట్ వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, మార్చి 18:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన మంత్రివర్గం సమావేశంలో పలు కీలక రంగాలకు రూ. 54,926 కోట్ల కేటాయింపులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన ప్రతిపాదనల వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా 100 ప్లగ్అండ్‌ప్లే పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసేందుకు రూ.33,660 కోట్ల కేటాయింపులతో భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకానికి మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని వెలికితీయడం లక్ష్యమని వివరించారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం (ఎన్ఐసిడిపి) కింద అభివృద్ధి చేసిన పారిశ్రామిక స్మార్ట్ సిటీల విజయం ఆధారంగా రాష్ట్రాలు, ప్రైవేటు సంస్థల భాగస్వామనయంతో 'భవ్య' పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. భవ్య పథకం భారీ ఎత్తున ఉద్యోగాల కల్పనకు దోహదపడుతుందని, తయారీ, లాజిస్టిక్స్, సేవల రంగాలలో గణనీయమైన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తుందని, అలాగే భారీ పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. కేంద్ర కేబినెట్ పత్తి రైతులకు గణనీయమైన నిధులను ఆమోదించింది. పడిపోతున్న మార్కెట్ ధరల నుండి పత్తి సాగుదారులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ, 2023-24 సీజన్‌కు గాను పత్తికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కింద రూ.11,712 కోట్లను బుధవారం నాడు మంత్రివర్గం ఆమోదించింది. దీనివల్ల సుమారు 7.25 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. లక్షలాది మంది రైతులకు, అనుబంధ కార్మికులకు మద్దతు ఇస్తుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో కీలకమైన జాతీయ రహదారి (ఎన్‌హెచ్-927)లో బారాబంకి నుంచి బహ్రాయిచ్ వరకు దాదాపు 101.515 కి.మీ. మేర రూ.6,969 కోట్లతో రోడ్డు విస్తరణ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ జాతీయ రహదారి పనులను హైబ్రిడ్ మోడల్‌లో అభివృద్ధి చేయనున్నారు. దేశవ్యాప్తంగా చిన్న జల విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి రూ.2,585 కోట్లు ప్రోత్సాహకం కింద అందించడానికి చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేయబోయే విద్యుత్ ప్రాజెక్టుల (1-25 మెగావాట్ల సామర్థ్యం)కు ప్రాజెక్టు వ్యయంలో 20 నుంచి 30శాతం కేంద్ర ఆర్థిక సహాయం అందించనుంది.



# ముంచుకొస్తున్న ఎరువుల సంక్షోభం

### ఎరువుల కర్మాగారాలలో ఎల్ఎన్‌జి కొరత నివారణకు కేంద్రం చర్యలు

### గ్యాస్ కొనుగోలుకు రూ.600 కోట్లు కేటాయింపు

### పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

**న్యూఢిల్లీ, మార్చి 18:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్ఎన్‌జి కొరత ఏర్పడింది. పరోక్షంగా ఎరువుల ఉత్పత్తిపైనా ప్రభావం చూపుతోంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితులు మరింత ముదిరితే, పరిస్థితి చేయిదాటిపోతుందని కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఒక వైపు వంటగ్యాస్ కొరత తీర్చడంతోపాటు, ఎరువుల ఉత్పత్తి కర్మాగారాలకు గ్యాస్ కొరత ఎదుర్కోకుండా, ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగేలా చర్యలకు కేంద్రం శ్రీకారం చుట్టింది. అవసరమైతే తక్షణమే గ్యాస్‌ను కొనుగోలు చేసేందుకు వీలుగా, ప్రభుత్వం ఎల్ఎన్‌జి కోసం సుమారు రూ.600 కోట్ల నిధులు కేటాయించింది. ఎరువుల ఉత్పత్తికి గ్యాస్ చాలా కీలకం. గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడితే, అది వ్యవసాయంపై, రైతులపై నేరుగా ప్రభావం చూపుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆకస్మిక కొరతలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ నిధిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు కీలకమైన సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధి చుట్టూ అనిశ్చితిని పెంచాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు ఈ మార్గం చాలా కీలకమైనది. అక్కడ ఏ చిన్న అంతరాయం కలిగినా గ్యాస్ సరఫరాపై గణనీయమైన ప్రభావం పడవచ్చు. ఈ ఉద్రిక్తత ఎక్కువ కాలం కొనసాగితే, గ్యాస్ లభ్యత 70శాతం నుండి 50-60శాతానికి పడిపోవచ్చు. తత్ఫలితంగా, ధరలు విపరీతంగా పెరిగి, భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలపై ప్రత్యక్ష ప్రభావం పడవచ్చు. ఇంధన రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆసియాలో ఎల్ఎన్‌జి ధరలు 40శాతం వరకు పెరగవచ్చు. దీనివల్ల గ్యాస్ కొనుగోలు మరింత భారంగా మారడంతో పాటు, ఉత్పత్తి వ్యయాలు కూడా పెరుగుతాయి. అయితే, ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం నిధులను సిద్ధం చేస్తోంది. దీంతో సరఫరాలను స్థిరీకరించడానికి స్పాట్ మార్కెట్ నుండి తక్షణమే గ్యాస్ కొనుగోలు చేయడానికి వీలవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం, భారతదేశంలోని యూరియా ప్లాంట్లు తమ గ్యాస్ అవసరాలలో అధిక భాగాన్ని దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా తీర్చుకుంటుంది. ఒక చిన్న భాగాన్ని స్పాట్ మార్కెట్ నుండి కొనుగోలు చేస్తున్నాయి. సరఫరా కొరత ఏర్పడితే, ఉత్పత్తి ప్రభావితం కావచ్చు. ప్లాంట్ల మూసివేతను నివారించడానికి, నిరంతరాయ ఉత్పత్తిని నిర్ధారించడానికి ప్రభు త్వం ఇప్పుడు స్పాట్ మార్కెట్ నుండి మరింత గ్యాస్‌ను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతోంది. దీని వల్ల రైతులకు ఎరువులు సకాలంలో అందించడానికి వీలు కలుగు తుంది. ఖరీఫ్ సీజన్‌లో ఎరువులకు డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. ఈ సమయంలో, దేశానికి ప్రతి సంవత్సరం లక్షల టన్నుల యూరియా అవసరం అవుతుంది. గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, ఉత్పత్తి తగ్గి, దిగుమతులపై ఆధారపడటం పెరగ వచ్చు. ప్రభుత్వం ఈ పరిస్థితిని నివా రించాలనుకుంటోంది.

### మంటల్లో పశ్చిమాసియా

# మొజ్తాబా ఎక్కడున్నా అంతం చేస్తాం: ఇజ్రాయెల్



**జెరూసలెం, మార్చి 18:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ఎక్కడ ఉన్నా వెంబడించి అంతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తమ దేశానికి ముప్పుగా ఉన్న వారు ఎప్పుడూ తమ టార్గెట్‌లోనే ఉంటారని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించింది. అయితే ప్రస్తుతం ఖమేనీ ఎక్కడున్నారనే దానిపై తమ వద్ద సమాచారం లేదని మీడియాకు ఐడిఎఫ్ ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ సమాధానం ఇచ్చారు. ఆయన ఎక్కడున్నారన్న దానిపై మా వద్ద ప్రస్తుతం సమాచారం లేదు. కానీ మా దేశానికి ముప్పుగా పరిణమించిన వారిని వెంబడించడం మాత్రం ఆపం. మాకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు మా నుంచి తప్పించుకోలేరు. వారిని తరిమి, తరిమి అంతం చేస్తాం. ఎప్పుడు ఎక్కడ అనేది ఇప్పుడే ఖచ్చితంగా చెప్పలేం. మా టార్గెట్ మిస్ కాదు అని డెఫ్రిన్ అన్నారు. మరోవైపు, దాడుల్లో గాయపడిన ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించడాన్ని ఇరాన్ ఖండించింది. ఇదొక కొత్త తరహా మానసిక యుద్ధం. ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, షెల్టర్లలో దాక్కోవాల్సిన అవసరం లేదు. వారు ప్రజల మధ్యే ఉంటారు అని రష్యాలో ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలీ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సొల్మనీ ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారు. తమ దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న లారిజానీ మృతిని ఇరాన్ కూడా ధృవీకరించింది. ఈ దాడి జరిగినప్పుడు ఆయన కుమార్తె ఇంటివద్ద ఉన్నారు. ఈ ఘటనలో ఆయనతో పాటుకుమారుడు, సహాయకులు ప్రాణాలు కోల్పోయారని సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ వెల్లడించింది.

# హార్ముజ్ సమీపంలో ఇరాన్ భూగర్భ క్షిపణి కేంద్రాలు ధ్వంసం

### బంకర్‌బస్టర్ బాంబులతో అమెరికా భీభత్సం



**వాషింగ్టన్, మార్చి 18:** మధ్య ప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలముకున్నాయి. ఇరాన్ లక్ష్యంగా అమెరికా బలగాలు బుధవారం భారీ వైమానిక దాడులకు దిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హార్మ్యూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న భూగర్భ క్షిపణి స్థావరాలను ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో సుమారు 2,268 కిలోల బరువుండే అత్యంత శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులను ఉపయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ సెంట్‌కామ్ ధ్రువీకరించింది. ఈ బాంబులు భూగర్భంలోని కాంక్రీట్ కట్టడాలను ఛేదించుకుని వెళ్లి, అక్కడ దాచి ఉంచిన నౌకా విధ్వంసక క్షిపణులను పూర్తిగా నాశనం చేశాయని తెలిపింది. అంతర్జాతీయ నౌకాయానానికి ఈ క్షిపణుల నుంచి ముప్పు పొంచి ఉందన్న కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ విషయంలో మిత్రదేశాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. మాకు ఎవరి సహాయం అవసరం లేదు, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కోగలం" అని ఆయన స్పష్టం చేశారు. ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనడానికి నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా ఉన్న జలసంధి మార్చి మొదటి వారం నుంచే దాదాపు మూతపడింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమన్నాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌లోని రామత్ గన్ నగరంపై క్షిపణి దాడులు చేయగా, ఇద్దరు పౌరులు మరణించారు. మరోవైపు, ఇరాన్ నుంచి వస్తున్న డ్రోన్లు, క్షిపణులను యూఏఈ, కువైట్, బహ్రెయిన్ తమ రక్షణ వ్యవస్థలతో సమర్థవంతంగా కూల్చివేస్తున్నాయి. ఇరాన్ అణు కార్యకలాపాలను వేగవంతం చేయవచ్చన్న ఆందోళనల నడుమ అమెరికా తన దాడులను అణు ప్లాంట్ల సమీపంలోని క్షిపణి కేంద్రాలపైకి మళ్లించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.

# ఎల్‌పిజి ఎటిఎం వచ్చేసింది!

## - పైలట్ ప్రాజెక్టుగా గురుగ్రామ్‌లో బిపిసిఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు

## - తొలుత నగరాల్లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా అందుబాటులోకి




**న్యూఢిల్లీ, మార్చి 18 :** అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా ఎల్‌పిజి కొరత ఏర్పడింది. కేంద్రం రంగంలోకి దిగి ఇరాన్‌తో చర్చలు జరిపి, హోర్ముజ్ జలసంధిలో చిక్కుకున్న ఎల్‌పిజి, చమురు నౌకలను సురక్షితంగా భారత్‌కు తీసుకొస్తోంది. ఇప్పటికే రెండు నౌకలు రాగా, మరో 22 నౌకలు హోర్ముజ్ జలసంధి నుంచి బయలుదేరాయని కేంద్రం వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఎల్‌పిజి గ్యాస్ ఎటిఎం సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) ఆధ్వర్యంలో గురుగ్రామ్ నివాసితుల కోసం ఎల్‌పిజి గ్యాస్ ఎటిఎంను ప్రారంభించింది. ఇది దేశంలోనే మొట్టమొదటి ఎల్‌పిజి గ్యాస్ ఏటిఎమ్. ఈ ఎటిఎం అందుబాటులోకి రావడంతో గ్యాస్ అయిపోయినప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం తప్పింది. ఇప్పుడు కేవలం 2 నుండి 3 నిమిషాల్లోనే నింపిన సిలిండర్‌ను పొందవచ్చు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా, సోహ్నాలోని సెక్టార్ 22, సెంట్రల్ పార్క్ ఫ్లవర్ వ్యాలీలో ఈ స్మార్ట్ వెండింగ్ మెషీన్‌ను ఏర్పాటు చేసింది. ఈ యంత్రం పూర్తిగా ఆటోమేటెడ్, కాంటాక్ట్‌లెస్ (స్పర్శరహితం). వినియోగదారులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ చేసి, ఓటిపి ద్వారా ధ్రువీకరించుకోవాలి. ఆ తర్వాత వారు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఏదైనా యుపిఐని ఉపయోగించి డిజిటల్ చెల్లింపు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, నింపిన సిలిండర్ యంత్రం నుండి బయటకు వస్తుంది. ఖాళీ సిలిండర్ లోపల నిల్వ చేయబడుతుంది. ఇది 24 గంటలూ అందుబాటులో ఉండటం. అంటే మీరు ఇకపై గ్యాస్ ఏజెన్సీ డెలివరీ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదు. మీరు ఎప్పుడైనా వెళ్లి కేవలం కొన్ని నిమిషాల్లో కొత్త సిలిండర్‌ను పొందవచ్చు. ఈ యంత్రం ఒకేసారి 10 సిలిండర్లను నిల్వ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, తొలి దశలో నగరాల్లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఎల్‌పిజి ఎటిఎంలు అందుబాటులోకి రావచ్చు.

# సిఎం పదవి ఆఫర్ చేసినా మా అధినేత తిరస్కరించారు

### టివికె విజయ్ పార్టీనేత అధవ్ అర్జున



**చెన్నై మార్చి 18:** టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడులో ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని చెప్పిన టీవీకే నేత అధవ్ అర్జున ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు చెప్పిన అర్జున అది ఏ పార్టీయో వెల్లడించలేదు. ఆయన వ్యాఖ్యల్ని బట్టి, అది జాతీయ పార్టీ అని స్పష్టమవుతోంది. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఆ పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు ఉన్న ఫాలోయింగ్ తప్పకుండా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఆయన పార్టీ అధికారంలోకి వస్తుందా రాదా అంటే ఇప్పుడే చెప్పలేం. కానీ, ఓటర్లను ప్రభావితం చేయగలదు. అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నది ఒక ప్రచారం. ఇటీవల పలు సందర్భా కాంగ్రెస్ నేతలు విజయ్ పట్ల సానుకూలంగా మాట్లాడారు. ఇదే సమయంలో బీజేపీ నేతలు కూడా విజయ్‌ను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారని ప్రచారం మొదలైంది. మొదట ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. ఇదే అంశంపై టీవీకే నేత ఆదవ్ అర్జున మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ విజయ్‌కు సీఎం పదవి ఆఫర్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు.. మొదట 50 సీట్ల నుంచి మొదలై 90 సీట్లు, ఆపై సగం సీట్ల వరకు ఇచ్చేందుక సిద్ధమైనట్లు తెలిపారు. అయితే, సీఎం పదవి కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని చెప్పారు. ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించారని అర్జున అన్నారు. అది ఏ పార్టీయో చెప్పకపోయినప్పటికీ బిజెపి అని కొందరు టీవీకే నేతలు అంటున్నారు. విజయ్ కూడా ఈ ఎన్నికల వరకు తమ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. విజయ్ పార్టీతో తమ పార్టీ చర్చలు జరపడం లేదని ఏఐఏడీఎంకే ఇటీవల స్పష్టం చేసింది. బీజేపీ మాత్రం అధికార డీఎంకేను ఓడించాలంటే పొత్తు అవసరం అని భావిస్తోంది.

# ఇదిగో మళ్లీ చెపుతున్నా.. నేను బతికే ఉన్నా..

### ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారితో ప్రధాని నెతన్యాహు



**టెల్ అవీవ్, మార్చి 18:** ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తన మరణంపై కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి మరో వీడియోతో ఘాటు జవాబిచ్చారు. తాను బతికే ఉన్నానని, ఆరో గ్యంగా ఉన్నానని స్పష్టం చేస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. ఇజ్రాయెల్‌లోని అమె రికా రాయబారి మైక్ హకబీతో కలిసి ఆయన ఈ వీడియోలో కనిపించారు. ఈ పరిణామంతో నెతన్యాహు ఆరోగ్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తీవ్ర ప్రచారానికి తెరపడినట్లయింది. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నెతన్యాహు వరుసగా ఏడు కేబినెట్ సమావేశాలకు హాజరుకాలేదని, ఆయన తీవ్రంగా గాయపడ్డారని లేదా మరణించారని ఆన్‌లైన్‌లో విస్తృతంగా వదంతులు వ్యాపించాయి. గతంలో ఆయన కార్యాలయం విడుదల చేసిన వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సృష్టించిన డీప్‌ఫేక్ అని, ఒక వీడియోలో ఆయనకు ఆరు వేళ్లు ఉన్నాయని కూడా ప్రచారం చేశారు. ఈ పుకాం ఈ వీడియో సంభాషణలో, హకబీ తన పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ, "మీరు క్షేమంగా ఉన్నారో లేదో కనుక్కోవాలని డొనాల్డ్ ట్రంప్ నన్ను పంపారు" అని అన్నారు. దీనికి నెతన్యాహు వెంటనే స్పందిస్తూ, అవును మైక్, నేను బతికే ఉన్నానని బదులిచ్చి, ఆయనతో కరచాలనం చేశారు. ఇది మార్ఫింగ్ చేసిన వీడియో లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సృష్టించినది కాదని చెప్పే ప్రయత్నంలో, తన చేతికి ఐదు వేళ్లు ఉన్నాయని చూపిస్తూ చమత్కరించారు. నెతన్యాహు తన చేతిలో పంచ్ కార్డ్ చూపిస్తూ ఇరాన్‌పై తమ వైఖరిని స్పష్టం చేశారు. "ఇది ఒక పంచ్ కార్డ్. ఈ రోజు ఈ కార్డుపై ఉన్న ఇద్దరి పేర్లను చెరిపేశాను. ఈ బ్యాచ్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారో చూడండి. మేం వాళ్లను తుడిచిపెట్టేస్తున్నామని తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. దీనికి హకబీ హాస్యంగా, మంచి విషయం ఏంటంటే ఈ పంచ్ కార్డులో నా పేరు లేదు నెతన్యాహు నవ్వుతూ, మీరు మంచి వాళ్ల జాబితాలో ఉన్నారని బదులిచ్చారు. అణు ఆయుధాలను అభివృద్ధి చేసి, ఇజ్రాయెల్‌ను నాశనం చేశాక అమెరికాలోని ప్రతి నగరంపై దాడి చేయాలనుకుంటున్న ఉన్మాదులను ఏరివేయడంలో అమెరికా దళాలు చేస్తున్నది అద్భుతం. వారితో కలిసి నిలబడటం మాకు గర్వకారణమని నెతన్యాహు అన్నారు. హకబీ కూడా తన ఎక్స్ ఖాతాలో, ఈ రోజు నేను ఇజ్రాయెల్ ప్రధానితో సమావేశమయ్యాను.




## ఎమిరేట్స్‌నుంచి గుజరాత్‌కు చేరిన జగ్‌లాడ్కి చమురునౌక

## 80,886 మెట్రిక్ టన్నుల ముడిచమురు నిల్వలతో రాక

**అహ్మదాబాద్, మార్చి 18:** భారత జెండా కలిగిన జగ్ లాడ్కి అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను ఫుజైరా పోర్టులో లోడ్ చేశారు. జగ్ లాడ్కి మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. మార్చి 14న ఫుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. జగ్ లాడ్కి అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది.

## నాలుగంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం

## తొమ్మిది మందిమృతి, మరో ముగ్గురికి గాయాలు

**న్యూఢిల్లీ, మార్చి 18:** ఢిల్లీలోని రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు జరిగిన అగ్నిప్రమాదంలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భవనం బేస్మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్‌లో బట్టల దుకాణంతో పాటు కాస్మెటిక్స్ షోరూం కూడా ఉన్నది. అయితే బిల్డింగ్‌లోని టాప్ రెండు ఫ్లోర్లలో ఆ ఇంటి యజమానులు ఉంటున్నారు. అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రవేశ్, కమాల్, ఆశు, లాడో, హిమాన్షి, దీపికతో పాటు ముగ్గురు మైనర్ బాలికలు ఉన్నారు. అనిల్, సచిన్‌తో పాటు మరో రెండు ఏళ్ల అమ్మాయి గాయపడ్డారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది. పాలంకు చెందిన పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీ అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బిల్డింగ్ ఓనర్‌ను రాజేంద్ర కశ్యప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులు బిల్డింగ్‌లోని రెండో, మూడో ఫ్లోర్లలో నివసిస్తున్నారు. 20 ఫైర్ టెండర్లు, 11 సీఏటీఎస్ అంబులెన్సులు, బీఎస్ఈఎస్ , ఎయిర్ ఫోర్స్ పోలీసు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఫోరెన్సిక్ బృందం చేరుకున్నది. స్థానిక పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

## ఉత్తరకొరియా ఎన్నికల్లో మళ్లీ కిమ్‌దే రాజ్యం.. 99.93% ఓట్లతో అనూహ్య విజయం

**ప్యాంగ్యాంగ్, మార్చి 18:** ఉత్తర కొరియాలో ఇటీవల జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు ప్రపంచదేశాలను నివ్వెరపోయేలాచేసాయి. దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలోని వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా ఏకంగా 99.93 ఓట్లతో మెగా విజయం నమోదు చేసింది. ఈ విజయంతో కిమ్ వరుసగా మూడో సారి అధికార పగ్గాలు చేపట్టారు. ఉత్తర కొరియాలో ఎన్నికల ప్రక్రియ ఎంత సులువో, ఎంత పారదర్శకమో ఈ ఫలితాలే చెబుతున్నాయి. బ్యాలెట్ పేపర్‌పై కేవలం అధికార పార్టీ అభ్యర్థి పేరు మాత్రమే ఉంటుంది. ఓటర్లు వచ్చి, ఆ పేరుకు మద్దతుగా ఓటు వేసి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడమే. ఒకవేళ ఎవరికైనా అభ్యర్థి నచ్చకపోతే, పేరును కొట్టివేసే విశాల హృదయం కూడా ఎన్నికల సంఘం కల్పించింది. అయితే, అలా చేసిన వారిని దేశద్రోహులుగా పరిగణిస్తారు. వారి భవిష్యత్తు ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో, ప్రజలు నాయకుడిపై ఉన్న విశ్వాసంతో పోలింగ్‌లో పాల్గొన్నారు.

### దివంగత మాజీ శాసనసభ్యులకు
## సభ సంతాపం

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త :** ఇటీవల కన్నుమూసిన మాజీ శాసన సభ్యులకు శాసనసభ సంతాపం తెలిపింది. సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. దివంగత మాజీ శాసనసభ్యులు సిహెచ్. రామిరెడ్డి (మంథని), సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి (చార్మినార్), కె. రాములు (ఇబ్రహీంపట్నం) మృతికి సంతాపంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభలో సంతాప సందేశాలను చదివి వినిపించారు. వారి సేవలను కొనియాడారు.

### వాయిదా తీర్మానాల తిరస్కరణ

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త :** బిఆర్ఎస్, సిపిఐ, బిజెపి ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు. మొక్కజొన్నకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ మంత్రి కెటిఆర్ ఇచ్చిన, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్ బకాయిలపై బిజెపి సభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రతిపాదించిన, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలపై సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

### యాసంగిలో ఇబ్బందులు లేకుండా
# యూరియా సరఫరా: తుమ్మల

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 18:** రాష్ట్రంలో యాసంగిలో యూరియా సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా రాష్ట్రంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న అంశంపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానమిస్తూ.. ఈ యాసంగిలో గత యాసంగి సీజన్ కంటే 30 వేల టన్నులు అధికంగా యూరియాను రైతులు కొనుగోలు చేశారని మంత్రి సభలో చెప్పారు. గత యాసంగిలో 10.24 లక్షల మెట్రిక్ టన్నులు రైతులు కొనుగోలు చేస్తే ఈ యాసంగిలో మార్చి 18 నాటికే రైతులు 10.73 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారన్నారు. రైతులు క్యూలైన్లలో నిలబడే పరిస్థితి రాకూడదనే యూరియా యాప్‌ని తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. యూరియా యాప్ ద్వారా రైతులకు అవసరమైనంత మేర, కోరుకున్న సమయంలో వారికి అందుబాటులో ఉండే డీలర్ నుండే యూరియా కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. భారత దేశంలోనే ఇటువంటి పద్దతిని అవలంబించి రైతులకు సౌకర్యవంతముగా యూరియా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. గత వానాకాలంలో ముందస్తు నిల్వల ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం రూ.1100 కోట్లతో మార్క్ ఫెడ్‌ను సిద్ధంగా ఉంచినప్పటికీ అంతర్జాతీయంగా ఏర్పడిన పరిస్థితుల మూలంగా రామగుండం కర్మాగారం, నాగార్జున ఫర్టిలైజర్స్ ఉత్పత్తిలో ఏర్పడిన అవాంతరాల వల్ల ఏప్రిల్, మే, జూన్ లలో అనుకున్నంత మేర యూరియా సరఫరా కాలేదని మంత్రి తుమ్మల సభకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరము కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, రాష్ట్రానికి కేటాయించిన దానికంటే ఎక్కువ ఎరువులను తెప్పించడం జరిగిందన్నారు. 2024 ఖరీఫ్ కంటే 15వేల టన్నులు అధికంగా ఈ ఖరీఫ్ లో రైతులకు అందించడం జరిగిందని, అంతే గాక గత ఏడాది యాసంగి మొత్తంలో వాడిన దానికంటే ఇప్పటికే 30 వేల టన్నులు ఎక్కువ రైతులకు సరఫరా చేయగలిగామన్నారు. రైతులకు సౌకర్యవంతంగా ఎరువుల సరఫరా కోసం నూతనంగా ఫెర్టిలైజర్ యాప్ తీసుకువచ్చి ప్రయోగాత్మకంగా పరిశీలించడం జరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు, ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా మొత్తం 20.74 లక్షల మంది రైతులు 88.35 లక్షల యూరియా సంచులను కొనుగోలు చేశారు. 17,926 మంది కౌలు రైతులు 23,087 మంది ఎస్ఓఎఫ్ రైతులు కూడా యాప్ ద్వారా ఎరువులను కొనుగోలు చేశారన్నారు. ప్రతిపక్షాలు యాప్‌పై రైతాంగాన్ని ఎంతగానో ఆందోళనకు గురిచేసినప్పటికీ, బుకింగ్ విధానం ద్వారా రైతులు యూరియాను కొనుగోలు చేస్తున్న తీరు చూస్తే, ఈ విధానాన్ని రైతులే స్వాగతిస్తున్నారని స్పష్టమవుతోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరాను సమయానికి అందించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటూ, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా నిర్వహిస్తోందన్నారు. భవిష్యత్తులోనూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరింత సమర్థవంతమైన విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాసనమండలిలో స్పష్టం చేశారు.

### ప్రచార ఆర్భాటాల ప్రభుత్వం కాదు
## ప్రజల జీవన స్థితిగతులు మార్చుతాం
### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మార్చి 18,ప్రభాతవార్త:** ప్రచార ఆర్భాటాల ప్రభుత్వం మాది కాదని, మురికి కూపంలో జీవిస్తున్న ప్రజల జీవన స్థితి గతులను మార్చాలని ప్రభుత్వం సంకల్పించిందని సామాజిక బాధ్యతతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడి ప్రజల జీవితాలు మారవద్దని మీరు కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి జరగవద్దని మీరు చెబుతున్నారా అని నిలదీశారు ప్రతిదానికి అడ్డుపడుతున్నారని ఆవేదన చెందారు. 'పేదవాళ్లు పేదవాళ్లుగానే ఉండాలని కోరుకుంటున్నారా? మురికి కూపంలో ఉండేవారు అక్కడే ఉండాలని కోరుకుంటున్నారా' అని విపక్ష సభ్యులను ప్రశ్నించారు. మూసీ నిర్వాసితులకు అదే ప్రాంతంలో అపార్ట్‌మెంట్స్ కట్టి పునరావాసం కల్పిస్తామని సిఎం రేవంత్ రెడ్డి పలుమార్లు స్పష్టం చేశారన్నారు. మా ప్రభుత్వం సామాజిక బాధ్యతతో ముందుకు వెళ్తోంది మూసీ నిర్వాసితుల పిల్లల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఆ ప్రాంతంలోనే నిర్మిస్తాం మెరుగైన ఆసుపత్రులు అక్కడే నిర్మిస్తామని తెలిపారు. మూసీ ప్రక్షాళన ఒక మహా యజ్ఞం ప్రతి చోట ఎస్టీపీలు ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేసిన తర్వాతే నదిలోకి నీటిని వదులుతామని చెప్పారు. బిఆర్ఎస్ నేతల మాదిరిగా మేం ప్రచార ఆర్భాటం చేయం మూసి డెవలప్మెంట్ ప్రాజెక్టు వివరాలన్నీ వెబ్సైట్లో ఉన్నాయనీ అన్నారు.

### నర్మెట్టలో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరి
## వేగంగా నిర్మించిన ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త :** దేశంలోనే తొలిసారిగా గంటకు 120 టన్నుల ఆయిల్‌ఫామ్ గెలల క్రషింగ్ సామర్థ్యంతో ఫామ్‌ాయిల్ ఫ్యాక్టరిని తొలిసారిగా సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. గంటకు 30 టన్నుల గెలల క్రషింగ్ సామర్థం, గెలల పరిమాణం పెరుగుతున్న కొద్దీ క్రషింగ్ సామర్థ్యాన్ని గంటకు 120 టన్నులకు పెంచుకునేలా ఫ్యాక్టరిని నిర్మించారు. నర్మెట శివారులో రూ.300 కోట్లతో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలి రిఫైన్డ్ పామాయిల్ ఫ్యాక్టరీని నిర్మించింది. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి ఈ ఫ్యాక్టరిని నిర్మించారు. ఈ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో నూనె ఉత్పత్తి చేయడంతోపాటు రిఫైనరీని పెట్టి తుది ఉత్పత్తి ఇక్కడి నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపేలా ఏర్పాట్లు చేశారు. ఆయిల్‌పామ్ పండ్ల గుజ్జు నుంచి ముడి నూనె తీసి రిఫైన్డ్ చేసి పామాయిల్‌ను ప్యాకెట్స్ రూపంలో తేనున్నారు. 10 కోట్ల లీటర్ల నిలువ సామర్థంతో నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేశారు. ఆయిల్‌పామ్ గెలల నుంచి వెలువడే బయోమాస్ వ్యర్థాలతో 4 మెగావాట్ల సెల్ఫ్ జనరేషన్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒక్క యూనిట్‌కు రూ.1.50 మాత్రమే ఖర్చుతో విద్యుత్తు ఉత్పత్తి కానుండటంతో భారం తప్పనుంది. వాడిన నీటిని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా రీ సైకిల్ చేసే పద్ధతి అందుబాటులో ఉంది. 22న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరిని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

# ఆసుపత్రులకు అధునాతన పరికరాలు సమకూర్చుతాం

- **8 టెస్లా మిషన్‌లు కొనుగోలు చేస్తాం**
- **48డెంటల్ సర్జన్, 1623 సివిల్ అసిస్టెంట్ సర్జన్, 607 అసిస్టెంట్ పోస్టులు ఏప్రిల్‌లో భర్తీచేస్తాం**
- **మంత్రి దామోదర రాజనర్సింహా**

**హైదరాబాద్, మార్చి 18,ప్రభాతవార్త:** ఆసుపత్రుల పడకల సామర్థ్యంకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరిపి అధునాతన పరికారలను అందుబాటులో తీసుకొస్తామని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన సభ్యుడు గనివోళ్ళ మధుసూధన్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ 1.5 టెస్లా ఎంఆర్ఎ మిషన్‌లు నాలుగు ఉస్మానియా, గాంధీ ఎంజిఎం రిమ్స్ ఆదిలాబాద్‌లోఉన్నాయనీ తెలిపారు. సిటి స్కాన్ మిషన్‌లు 39 వెంటిలెటర్లు 1770,ఎక్స్ రే మిషన్స్ 195 ఉన్నాయనీ ఆయన వివరించారు. కొత్తగా ఎనిమిది టెస్లామిషన్(3)లు నిజామాబాద్ సిద్దిపేట,సూర్యపేట నల్గొండ, మహబూబ్‌నగర్, నీలోఫర్, ఉస్మానియా హాస్పిటల్, గాంధీ హాస్పిటల్ కోసం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కామారెడ్డి, నిర్మల్, జయశంకర్‌భూపాలపల్లి, ఆసిఫాబాద్, వికరాబాద్, గాంధీ ఉస్మానియా ఆసుపత్రులకు ఏడు స్లైస్ సిటిస్కాన్(128) మిషన్‌లు, జిజిహెచ్ ములుగు స్లైస్ సిటి స్కాన్ మిషన్ (16) కొనుగోలు చేయబోతున్నామని తెలిపారు. 485 వెంటిలేటర్లు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. జిల్లా ఆసుపత్రులలో 1217 మందిని కాంట్రాక్టు పద్దతిలో నియమించామని, సిఎఎస్ స్పెషలిస్టు 565 టివివిపి కాంట్రాక్టు పద్దతిలో నియమించామని తెలిపారు, సివిల్ అసిస్టెంట్ సర్జనహ్‌జిడిఎంఒ టివివిపి రెగ్యులర్‌గా 422 మందిని నియమించామనితెలిపారు. డిఎంఇలో 607 ప్రొఫెసర్‌లు,అసిస్టెంట్ స్పెషలిస్టులు, 1623 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టుల టివివిపిలు, డెంటల్ అసిస్టెంట్ సర్జన్‌లు టివివిపి 48 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వాటిని ఏప్రిల్‌లో భర్తీ చేస్తామని చెప్పారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్దపెద్ద అధునాతన పరికరాలు సమకూర్చడంతో పాటు బెసిక్ వైద్య పరికరాలు అందుబాటులో పెట్టాలని సూచించారు. వంద పడకల సామర్థ్యం కలిగిన ఆసుపత్రికి కోటి యాబైలక్షల విలువగల 13పరికరాలు,350పడకలు కలిగిన ఆసుపత్రికి 14 అధునాత పరికరాలు ఐదుకోట్లతో కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు తయారించామని చెప్పారు. జిజిహెచ్ లో 21 డిపార్టుమెంట్లు ఉంటే 16 అధునాత పరికారలు 36కోట్లతో, 28 నుంచి30 డిపార్టుమెంట్లు ఉంటే 50కోట్లతో పరికరాలు సమకూర్చుతామని ఉస్మానియాకు కరీంనగర్‌కు అదనపు ఎంఐఆర్ సమకూర్చుతామని చెప్పారు.

## మూసీ డిపిఆర్ సిద్ధం
## ప్రభావితమయ్యేవి 1435 నిర్మాణాలు
### శాసనసభవ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు సంబంధించి ఫస్ట్‌ఫేజ్ డిపిఆర్ సిద్దమైందనీ దీని అంచనా వ్యయం రూ. 6,500 నుంచి రూ. 7,000 కోట్ల వరకు ఉంటుందని ప్రశ్నోతర్తరా సమయంలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మెయిన్‌హార్ట్ సంస్థపై భారత ప్రభుత్వం ఏలాంటి నిషేధం విధించలేదని ఫిబ్రవరి 5న డిపిఆర్ ఇచ్చారని మంత్రి కెటిఆర్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. మెయిన్ హార్ట్ కంపెనీ అనేక పనులు చేసిందని చెప్పుకొచ్చారు. హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 9.2కిమి ఉస్మాన్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 11.8కి.మి చేపడుతున్నట్లు తెలిపారు. మూసీ పునర్నిర్మాణంలో భాగంగా ప్రాథమికంగా 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ నిర్మాణాల విలువ మదింపు ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. బఫర్ జోన్లో ఉన్న వారికి ప్రభుత్వం తరపున టిడిఆర్ ఇస్తాం. 2013 భూసేకరణ చట్టం ప్రకారమే బాధితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పిస్తామనీ మంత్రి స్పష్టం వివరించారు.బఫర్ జోన్ విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలనే తాము అనుసరిస్తున్నామని శ్రీధర్ బాబు సభలో తెలిపారు. "మేము కొత్తగా బఫర్ జోన్ను నిర్ణయించలేదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెంబర్ 16 ప్రకారమే ప్రస్తుతం బఫర్ జోన్ కొనసాగుతోంది" అని ఆయన వివరించారు. ఈ సందర్భంగా డిపిఆర్ తయారీపై బిఆర్ఎస్ నేత కేటీఆర్ చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. కెటిఆర్ ఆరోపిస్తున్నట్లు డిపిఆర్ రెండు నెలల్లో పూర్తి కాలేదు. 2024 డిసెంబర్ లో మెయిన్ హార్ట్ సంస్థకు బాధ్యతలు అప్పగించగా, 2026 ఫిబ్రవరిలో ఆ సంస్థ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అంటే శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తర్వాతే ఈ నివేదిక సిద్ధమైంది" అని ఆయన స్పష్టం చేశారు.

# మాలల 'చలో అసెంబ్లీ'ని అడ్డుకున్న పోలీసులు

**అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలింపు**

**సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 'చలో అసెంబ్లీ' పాదయాత్రకు బయలు దేరిన అనేక మంది మాలలను బుధవారం పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. అంతకు ముందు ద నేషనల్ అంబేద్కర్ సేన, మాల సంఘాల జెఎసి నాయకులు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, అనంతరం వారు అక్కడ నుంచి చలో అసెంబ్లీ పాదయాత్రకు పూనుకున్నారు. ఈ సందర్భంగా వారు వర్గీకరణ, రోస్టర్ విధానాన్ని రద్దుచేయాలని, వర్గీకరణతో మాలలకు విద్యా, ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని, సిఎం రేవంత్‌రెడ్డి డౌన్, డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అసెంబ్లీ వైపు వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. అంతకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో నేషనల్ అంబేద్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆశాస్త్రీయంగా చేసిన వర్గీకరణ వల్ల రాష్ట్రంలోని 40 లక్షల మంది మాలలకు, మిగిలిన 57 కులాలకు విద్యా, ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. తక్షణమే వర్గీకరణ, రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన ఎన్నికల్లో బిజెపికి ఓట్లు వేయాలని పెద్ద ఎత్తున ప్రచారం చేసిన మంద కృష్ణమాదిగను సిఎం రేవంత్‌రెడ్డి నెత్తిన పెట్టుకున్నారని, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేసి, ఓట్లు వేయించి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన మాలలను అణగదొక్కుతున్నారని వారు ఆరోపించారు. మాలలకు అన్యాయం చేస్తూ సిఎం తీసుకువచ్చిన జివో నెంబరు 99ని, రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, చేవేళ్లలో చేసిన డిక్లరేషన్‌ను అమలు చేయాలని, మాలలకు జరుగుతున్న అన్యాయాలపై అసెంబ్లీలో చర్చించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మాల ప్రజా ప్రతినిధులు అసెంబ్లీ, శాసన మండలిలో గళం విప్పాలని, లేకపోతే వారి నియోజక వర్గాల్లో మాలల అడ్డుకుంటారని హెచ్చరించారు. అలాగే అసెంబ్లీలో సిఎం చర్చించకపోతే వచ్చే పరిషత్, కార్పోరేషన్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని వారు హెచ్చరించారు.



ప్రెస్‌క్లబ్ ఎదుట మాల నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

### హ్యామ్‌మోడల్‌లో అద్భుతమైన
## రోడ్లు నిర్మిస్తాం: కోమటిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 18,ప్రభాతవార్త:** హ్యామ్ మోడల్‌లో 2028 జూన్ నాటికి దేశంలో రోడ్లు అంటే అందరూ తెలంగాణా వైపుకు తిరిగి చేసేలా నిర్మిస్తామని తెలంగాణ రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి కోమటిరెడ్డి ప్రతిపక్ష శాసన సభ్యులకు సమాధానమిస్తూ తాము పునరుద్ధరిస్తున్న అభివృద్ధి పనులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధన్యవాదాలు తెలపాలని సూచించారు. సాధారణ బడ్జెట్ తక్కువగా ఉంది, దీనికి తోడు తమ శాఖకు ఉన్న 4,600 కోట్ల బకాయిలను కొద్ది కొద్దిగా చెల్లిస్తూ వస్తున్నామన్నారు. కొంచెం ఆలస్యమైనా సరే కానీ ఎవరూ ఉహించనంత నాణ్యమైన రోడ్లను నిర్మించి తీరుతామన్నారు. జనగామతో పాటు శాసన సభ్యులు హరీష్ రావు సూచించిన సిద్దిపేట రింగు రోడ్డుతో పాటు గజ్వేల్ రింగురోడ్లు పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో నిరక్ష్యం చేసినా తాము వాటిని పూర్తి చేస్తామన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా రోడ్ల మీద ప్రత్యేక దృష్టి సారించామని, ఈ ప్రణాళికలకు సంబంధించి టెక్నికల్ ఎవల్యూషన్ పూర్తి అయిపోయిందని, అవి రాగానే ఫైనాన్స్ బిడ్ ఓపెన్ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. తప్పకుండా ప్రతీ రోడ్డు మండల కేంద్రానికి అనుసంధానం చేసేలా, సిఆర్‌ఎంలో 35 కోట్లు కేటాయించామన్నారు. సిద్దిపేట, జనగామ రోడ్డుతో పాటు మధ్యలో దుబ్బాక లింక్ రోడ్లు సైతం ఇందులో భాగమేనని ఆయన అన్నారు. ఈ పనులకు సంబంధించిన ప్రైస్ బిడ్ ఈ నెలాఖరులోగా తెరుస్తామని చెప్పారు. ఏప్రిల్ అన్ని మొదలు పెట్టి రోడ్లు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. 4 వేల కోట్లు ప్రొవిజన్‌లో ఉందనీఅవి కూడా ఇందులో వినియోగిస్తామన్నారు.

### 2003 డిఎస్‌సి వారికి
## పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలి

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**

**రాష్ట్రంలో పారాక్వాట్ గడ్డి మందును నిషేధించాలి: డా. బల్మూర్ వెంకట్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 18:** తెలంగాణ శాసనమండలి బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం ప్రత్యేక ప్రస్తావనలు (స్పెషల్ మెన్షన్లకు)కు అవకాశం కల్పిస్తూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. దీంతో 20 మంది ఎమ్మెల్సీలు వివిధ అంశాలపై స్పెషల్ మెన్షన్స్ సభ దృష్టికి తీసుకొచ్చారు. నల్గొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 2003 డిఎస్‌సి ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) అమలు చేసేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నోటిపికేషన్‌లో పాత పెన్షన్‌లో ప్రస్తావన ఉంటే ఉద్యోగి పాత పెన్షన్‌కు అర్హుడని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులను అమలు చేయడం లేదన్నారు. ఇటీవల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వారికి పాత పెన్షన్ వర్తింపచేయాలని తీర్పు ఇచ్చినప్పటికీ.. ఆ తీర్పును అమలు చేయడం లేదన్నారు. కాబట్టి 2003 డిఎస్‌సి వారికి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. కొన్ని రాష్ట్రాల్లో నిర్ణయం తీసుకున్నారని అలాగే తెలంగాణ రాష్ట్రంలోనూ ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు.

**పారాక్వాట్ గడ్డి మందును నిషేధించాలి: డా.బల్మూర్ వెంకట్**

గడ్డి, కలుపు మందు పారాక్వాట్ ప్రజల ప్రాణాలను తీస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ ఆవేదన వ్యక్తం చేశారు. శాసన మండలిలో బుధవారం ప్రత్యేక ప్రస్తావన చేస్తూ కొండగట్టు ప్రాంతానికి చెందిన కొందరు డాక్టర్లు పారాక్వాట్ మందును బ్యాన్ చేయాలని, దాని వల్ల జరిగే ప్రాణనష్టాన్ని వివరిస్తూ లేఖ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏటా 5వేల మంది ఈ మందుకు బలవుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. విరుగుడు లేని ఈ మందు తాగిన వంద మందిలో 98 మంది చనిపోయే అవకాశం ఉంటుందని, ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. విరుగుడులేని ఈ మందుపై ప్రజల్లోనూ అంతగా అవగాహన లేకోవడం, క్షణికావేశంలో కొందరు ఆత్మహత్య కోసం సేవించడం, మరికొందరు హత్యలకు ఉపయోగించడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

**రైతాంగాన్ని ఆదుకోండి: మల్క కొమరయ్య**

తెలంగాణ రైతులను అన్నిరకాలుగా ఆదుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలి సమావేశాలలో భాగంగా బుధవారం స్పెషల్ మెన్షన్స్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు కాబట్టి వారికి ప్రభుత్వం తరపున ఇవ్వాల్సిన అన్ని ప్రోత్సహకాలు ఇవ్వాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందన్నారు. ప్రధానంగా తెలంగాణలోని రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఫసల్ భీమా యోజన పథకాన్ని వర్తింపజేయాలన్నారు. రైతులకు ఇచ్చే లోన్స్ విషయంలో ఉన్న ఇబ్బందులను కూడా తొలగించాలని కోరారు.

## తండ్రి, కూతురు సజీవ దహనం

**కడిపికొండలో దారుణం, అల్లుడే కారణమా అని అనుమానం**



**హన్మకొండ బ్యూరో, మార్చి 18 ప్రభాతవార్త:** కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో జరిగిన తండ్రి కూతుళ్ళ సజీవ దహన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. హైదరాబాదులో ఉండే రాజశ్రీప్రవీణ్ దంపతులు రెండు రోజుల క్రితమే కడిపికొండకు వచ్చినట్లు తెలిసింది. వీరికి ఇద్దరు సంతానం కాగా కూతురి అన్నప్రాసన కార్యక్ర మం కోసం వచ్చినట్లు సమాచారం. మంగళవారం కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ఏమైందో ఏమో కానీ తెల్లవారుజామున ఇంట్లో నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే రాజశేఖర్, కూతురు రాజశ్రీ మంటల్లో కాలిపోయారు. అల్లుడే కారణమా! కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడే ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చుని అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. సుత్తితో మామను, భార్యను హత్య చేసిన అనంతరం, దానిని అగ్నిప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితుడు పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలుస్తోంది. సీఐ కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలంలో కీలక ఆధారాలను సేకరించారు.

# మొక్కజొన్నలకు బోనస్ క్వింటాల్‌కు 500 చెల్లించండి

**కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరణ చేయాలి**

**యూరియా యాప్‌తో బాధలు తొలగించండి**

**ఎర్రజొన్న సిండికేటు వ్యాపారులను కట్టడి చేయండి: వేముల ప్రశాంతరెడ్డి**

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** మొక్కజొన్నను రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేయాలని మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ చెల్లించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఎర్రజొన్న వ్యాపారులు సిండికేటుగా వ్యవహరించడంతో రైతులు దోపిడికి గురవుతున్నారని ఆయన అన్నారు. జీరో అవర్ లో ఆయన మాట్లాడుతూ ఎర్రజొన్నలకు క్వింటాళుకు రూ.3850 ధర చెల్లించాల్సి ఉండగా సిండికేటుగా వ్యాపారులు మారి ధరను క్వింటాల్‌కు 3300 ధరను చెల్లిస్తున్నారని ఆవేదన చెందారు. ఎకరాకు పదివేల రూపాయలు రైతులు సిండికేట్ వల్ల నష్టపోతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ సర్కారు యూరియా యాప్ పేరుతో రైతులను వేధిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతుల దగ్గర స్మార్ట్‌ఫోన్‌లు లేవని, ఇక స్మార్ట్ ఫోన్‌లు ఉన్న 50 శాతం మందిలో కూడా 50 శాతం మందికి యాప్‌ను ఎలా ఉపయోగించాలో తెలియదని అన్నారు. ఇలా మొత్తంగా 75 శాతం మంది రైతులు యూరియా యాప్‌తో ఇబ్బందులు పడుతున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. వారంతా మీ సేవా కేంద్రాలకు పోయి యూరియా బుక్ చేయించుకోవాల్సి వస్తున్నదని తెలిపారు. ఆ తర్వాత మరో రోజు వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇలా రెండు రోజులు సమయం రైతుకు వృథా అవుతున్నదని చెప్పారు. ఇక ఒక దఫాలో 5 బస్తాల కంటే ఎక్కువ యూరియా ఇవ్వడం లేదని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దాంతో మూడు నాలుగు ఎకరాల్లో మక్క పంట వేసిన రైతు మూడు దఫాల్లో రెండేసి రోజుల చొప్పున మొత్తం ఆరు రోజులు యూరియా కోసం తిరగాల్సి వస్తున్నదని చెప్పారు. మండలానికి ఒక్క కేంద్రంలో మాత్రమే యురియా ఇస్తుండటంతో చాలా గ్రామాల రైతులు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తుందని అన్నారు. కాబట్టి మండలానికి ఒక్కచోట మాత్రమే కాకుండా ఎక్కువచోట్ల యూరియా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. దఫాకు 5 బస్తాలను ఎత్తేసి, రైతు వేసిన పంటకు ఎంత యూరియా అవసరమో ఒకేసారి ఇవ్వాలన్నారు.

**మాస్టర్‌ప్లాన్ కన్వర్జేషన్ చేపట్టండి: సబిత**

2007 మాస్టర్‌ప్లాన్ గ్రీన్ జోన్,ఓపెన్‌జోన్ కారణంగా మహేశ్వరం నియోజకవర్గంలో అనేక మంది ఇబ్బంది పడుతున్నారని 2000 కుటుంబాలు గ్రామపంచాయతీ అనుమతితో ఇళ్ళుకట్టు కొన్నాయని హెచ్ఎండిఏ అనుమతి ఇవ్వాలని కోరారు. వెయ్యి ఓపెన్ ప్లాట్ కలిగిన వారు నిర్మాణంకు అనుమతులు పొందడంలేదని చెప్పారు.

**మొక్కజొన్నకు ఎంఎస్‌పి రూ.2400 లభించడం లేదు: కడియం శ్రీహరి**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడున్నరలక్షల ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్నకు ఎంఎస్‌పి లభించడంలేదని క్వింటాల్‌కు 1600 మాత్రమే ధర కడుతున్నారని స్టేషన్ ఘనపురం ఎంఎల్‌ఏ కడియం శ్రీహరి అన్నారు. గతంలో ప్రభుత్వం సేకరణ చేసేదని రాష్ట్రంలో పదిలక్షల మంది రైతుల ప్రయోజనం కోసం వెంటనే సేకరణ చేపట్టాలని కోరారు.

**ఫ్లైఓవర్ నిర్మాణాలు నత్తనడ: వేముల వీరేశం**

విజయవాడ-హైదరాబాద్ రోడ్‌లపై ఫ్లైఓవర్ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. ఆర్‌అండ్‌బి ఎన్‌హెచ్ అధికారులు శ్రద్ధ వహించి వేగం చేయాలని కోరారు.

### మహేష్ కుమార్‌గౌడ్‌కు కోమటిరెడ్డి
## బహిరంగ క్షమాపణ చెప్పాలి

**లేకపోతే ఆయన ఇంటిని ముట్టడిస్తాం: జాజుల హెచ్చరిక**

**సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి టిపిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్‌గౌడ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని బిసి జెఎసి ఛైర్మన్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో రెండు లక్షల మంది బిసిలతో ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్ష పదవిలో బిసి సామజిక వర్గానికి చెందిన బి. మహేష్ కుమార్‌గౌడ్‌ను తొలగించి, కాంగ్రెస్ నాయకుడైన జగ్గారెడ్డిని నియమిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు వస్తాయని ప్రగల్బాలు పలికి మహేష్ కుమార్‌గౌడ్‌ను కోమటిరెడ్డి అవమాన పరిచారని ఆరోపించారు. కోమటిరెడ్డి ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, తాగి నోరు తిరగ కుండా మాట్లాడుతున్నారని, బిఆర్ఎస్ నేత టి. హరీష్‌రావు చెప్పిన విధంగా అసెంబ్లీలో నిజంగా బ్రీతింగ్ టెస్ట్ చేయాలని కోరారు. కాంట్రాక్టులు చేపట్టి కోట్లాది రూపాయలు దోచుకున్నారన్నారు. నల్లగొండ జిల్లాలో చాలా మంది రెడ్లు ఉన్నారని, రెడ్ల ఆదిపత్యం కోసం డాక్టర్ చెరుకు సుధాకర్‌ను చంపుతా నని బెదిరిస్తున్నారని, అలాగే అనేక మంది దళితులపైన దాడులు చేయిం చారని, మైనార్టిలపై బుల్డోజర్లుతో దాడి చేయించారని ఇలా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిలపై దాడులు చేస్తూ, అవమానాలకు గురిచేస్తున్నా రని ఆరోపిం చారు. కోమటిరెడి వ్యాఖ్యల వెనుక సిఎం హస్తంపై అనుమానం వ్యక్తం చేశారు.

### కూరగాయల సాగుకు తెలంగాణ
## ప్రభుత్వ తోడ్పాటు: కోదండరెడ్డి

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగును భారీగా పెంపొందించేందుకు ప్రభుత్వ పూర్తిస్థాయి తోడ్పాటు అందిస్తోందని రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అన్నారు. రైతులు తమ ఉత్పత్తులకు మేలైన గిట్టుబాటు ధరలు పొందేందుకు వారికి అందుబాటులోని గ్రామాల్లో మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ మేరకు కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల నుండి ఎంపిక చేసిన 150 మంది కూరగాయల రైతులకు బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులే క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలని, కూరగాయలు విస్తీర్ణం పెంపు బాధ్యతలు రైతులు తమ భుజస్కందాలపై వేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ప్రత్యేకించి కూరగాయల పంటల సాగు విస్తీర్ణం, కూరగాయల స్వయం సమృద్ధికి కావలసిన సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉందన్నారు. ఉపాధిహామీ పనులు వ్యవసాయంతో అనుసంధానం చేయాలని ఎప్పటి నుంచో తాము కోరుతున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో కూడిన చిన్న యంత్రాలు రైతులు సులభంగా వాడుకొని సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. రైతుల ఆదాయాల పెంపుకు ఉద్యాన పంటల సాగు ఆశాజనకంగా ఉంటుందన్నారు. రైతు ఉత్పత్తి ఆర్గనైజేషన్లు తమ ఉద్యాన ఉత్పత్తులను విదేశాలకు సైతం ఎగుమతి చేయడం అభినందనీయమని తెలిపారు. ఉద్యాన ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్చలు జరుపుతున్నామని, తద్వారా కోతనంతర పంట నష్టం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. సాలీనా వర్షపాతం తెలంగాణలో 900 మిల్లీమీటర్లు ఉందని, ఈ వాతావరణం కూరగాయల సాగుకు అత్యంత అనుకూలమని తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం విసి డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉద్యాన సాంకేతిక సమాచారం మార్పిడికి ప్రధాన కేంద్రాలుగా భవిష్యత్తులో ఎదుగుతాయని ఆయన తెలిపారు. అనంతరం రైతులకు క్షేత్ర పర్యటన నిర్వహించి, సాంకేతికతలను ప్రత్యక్షంగా చూపించారు. రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్




### మూసీ ప్రాజెక్టులో కేటీఆర్
## గల్లంతు అవుతారన్న భయం
### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మూసి నది ప్రక్షాళన పూర్తి అయితే ఆప్రాజెక్టులో కేటీఆర్ గల్లంతు అవుతారని భయపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనవాస్ అన్నారు. ఈమేరకు బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ" చిట్ చాట్ పేరిట చెత్త మాటలు మాట్లాడుతున్నారు. ఐఏఎస్, ఐపిఎస్ అధికారలను కేటీఆర్ భయపెడుతున్నారు. బ్యూరోక్రసిని పట్టుకొని మీ పేర్లు పింక్ బుక్, రెడ్ బుక్ లో నోట్ చేసుకుంటున్నామని భయపెడుతున్నారు. కుటుంబ గొడవల ఫ్రస్టేషన్ అధికారులపై తీస్తున్నారు. రెండు సంవత్సరాల్లో ఏ ఒక్క అధికారికి ఇబ్బంది కలుగకుండా వారి సూచనలు తీసుకుంటూ ముందుకు పోతున్నాం. డ్రగ్స్ కేసులో ఇరుకున్న పైలెట్ రోహిత్ రెడ్డిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి డ్రగ్స్ పరీక్షలకు నమూనాలు ఇవ్వడానికి సిద్ధం కావాలి.

### అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
### నాయని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే



స్క్రిప్టు రాసుకొచ్చి పెయిడ్ ఆర్టిస్టులా కేటీఆర్ అసెంబ్లీ సమావేశాల మొదటీ రోజు మాట్లాడారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ "అబద్ధాలతో, అహంకారంతో మాట్లాడుతున్న వారిని రాష్ట్ర బహిష్కరణ చేయాలి. అసెంబ్లీలో అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. తక్షణమే కేటీఆర్ రాజీనామా చేయాలి. డ్రగ్ టెస్టింగ్ చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయి. అసెంబ్లీ నుంచి బహిష్కరించాలని సీఎం ను కోరతాం.. లేదంటే క్యాన్సర్‌లా వ్యాపిస్తారు .బీఆర్ఎస్ హయంలో వరంగల్, హన్మకొండలో భూ కబ్జాలు అధికంగా జరిగాయి. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కడుత్తామంటే జాగా లేకుండా చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కార్పొరేటర్లను మర్డర్ చేయించిన ఘనత మీది. మీరు గుండాయిజం గురించి మాట్లాడుతున్నారా? సీఎం రేవంత్ రెడ్డి దయవల్ల మీరు ఇంకా బయట తిరుగుతున్నారు. యూట్యూబ్ ఛానెళ్లు పెట్టుకొని, స్క్రిప్ట్ రాసుకొచ్చి చదువుతున్నారు. మహిళా సంఘాలకు నాలుగు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టారు"అని మండిపడ్డారు.



### నాఆరోపణలు తప్పయితే దేనికైనా రెడీ
### బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ పోలీసులపై తాను చేస్తున్న ఆరోపణలు తప్పయితే తాను దేనికైనా రెడీ అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. ఈమేరకు అసెంబ్లీ మీడియా పాయింట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ " నేను చెప్పింది చెప్పినట్టు వక్రీకరించకుండా రాస్తే కరీంనగర్ యువతకు లాభం అవుతుంది. కరీంనగర్ సిపి ఫైరింగ్ పై శ్రీధర్ బాబు విచారణ చేయిస్తామన్నారు. నేను ఆరోపణలు చేసిన తర్వాత సిపి ప్రెస్‌కు ఆరోజు నేను సెలవులో ఉన్నాను అని ఒక లెటర్ రిలీజ్ చేశారు. రాజ్యాంగాన్ని, భద్రతను కాపాడిన పోలీసులు ఇలా చేస్తే ఎలా? సిపికి సెలవు ఇచ్చేది డీజీపీ, కానీ ఇక్కడ సీపీకి సెలవు ఐజీ ఎలా ఇస్తారు? ఫైరింగ్ జరిగిన ప్రదేశంలో ప్యాచ్ వర్క్ కూడా చేశారు. ఇది నిజం కదా? కేసులు మా మీద పెట్టడం కాదు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోండి. కాలయాపన చేస్తే నష్టపోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోం మంత్రి కూడా ఈవిషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలి. పీకల్లోతు మందు తాగి కరీంనగర్‌లో పోలీసులు జల్సాలు చేస్తున్నారు. కరీంనగర్ సిపిపై 30వ తేదీ వరకూ చర్యలు తీసుకుపోతే మరిన్ని విషయాలు బయటికి వస్తాయి. దొంగ ఆఫీసర్ల మీద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి. నాకు పోలీసు వ్యవస్థపై గౌరవం ఉంది. నేను తప్పు మాట్లాడితే, అబద్ధమైతే అసెంబ్లీ ముందు ముక్కు నెలకు రాస్తాను "అని కౌశిక్‌రెడ్డి అన్నారు.

# కొత్త బడ్జెట్‌పై రుణ భారం

### లక్ష్యాన్ని దాటిన సేకరణ
### రూ.85,840 కోట్లకు చేరిన మొత్తం
### ఆదాయ, వ్యయం మధ్య అంతరం
### వార్షిక లక్ష్యంలో
### రూ.60 వేల కోట్లు తక్కువ
### 2026-27 అంచనా బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో రుణాలు కీలకంగా మారాయి. ఆదాయ, వ్యయాల మధ్య అంతరం ఏటా పెరుగుతుండటంతో రుణాలపైనే రాష్ట్ర ఖజానా ఆధారపడాల్సిన పరిస్థితి తప్పడం లేదు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రుణాల ద్వారానే నడిపించాల్సి వస్తోంది. దీంతో బడ్జెట్‌లో పేర్కొన్న రుణాల లక్ష్యాలను దాటుతున్నాయి. మార్కెట్ రుణాలు బడ్జెట్ అంచనాను 53 శాతానికి పైగా దాటాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు, మార్కెట్ రుణాలు మాత్రమే మొత్తం రాబడిలో దాదాపు 34 శాతం వాటా కలిగి ఉన్నాయి. మార్చి మొదటి వారం వరకు మార్కెట్ రుణాలు మాత్రమే వార్షిక ఆమోదం కంటే దాదాపు 53 శాతం ఎక్కువగా ఉన్నాయి, తుది రుణాలు దాదాపు 60 శాతానికి చేరుకుంటాయని అంచనా. మొత్తంగా 2025-26 అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న రుణాల లక్ష్యాలను ఇప్పటికే భారీగా 158.93 శాతానికి చేరాయి. ఆర్థిక శాఖ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లెక్కలను చూస్తే ఆదాయ, వ్యయం మధ్య అంతరం పెరుగుతున్నట్లు డేటా చూపిస్తోంది. ఇది రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు సంబంధించి 2056-27 వార్షిక అంచనా బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌లో రూ.54,009 కోట్ల మేర రుణం తీసుకోనున్నట్లు పేర్కొంది. అయితే తీసుకున్న రుణాలు ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బిఎం) ను అధిగమించాయి. దీంతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుండి ఎఫ్ఆర్‌బిఎంకు మించి అదనపు రుణాన్ని సేకరించేందుకు అనుమతి తీసుకోవడంతో ఇప్పటివరకు సేకరించిన రుణాలు 158.93 శాతం చొప్పున రూ.85,840 కోట్లకు చేరాయి. ఈ విధంగా బడ్జెట్ అంచనాల కంటే దాదాపు రూ.29 వేల కోట్లకుపైగా అదనపు అప్పులు సేకరించింది. కాగా జనవరి చివరి వరకు అధికారిక గణాంకాల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ఆదాయంలో గణనీయమైన భాగం ఆదాయ ఉత్పత్తి ద్వారా కాకుండా రుణాల ద్వారానే వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి పది నెలల్లో రాష్ట్రం మొత్తం రూ.2,07,558 కోట్ల వసూళ్లను నివేదించింది. ఇందులో పన్ను ఆదాయం రూ.1,26,293 కోట్లు కాగా, ఎక్కువగా రుణాలు తీసుకున్న మూలధన వసూళ్ల రూ.69,148 కోట్లు. వాస్తవానికి, ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో దాదాపు రూ.70,000 కోట్లు అప్పుల ద్వారా వచ్చాయి. ఈ రుణాలు వివిధ కార్పొరేషన్లు మరియు అనుబంధ సంస్థల ద్వారా సేకరించిన దాదాపు రూ.80,000 కోట్ల ఆఫ్‌బడ్జెట్ రుణాలకు అదనంగా ఉన్నాయి. ఆదాయ ఉత్పత్తి మరియు వ్యయ నిబద్ధతల మధ్య పెరుగుతున్న అంతరాన్ని ఈ సంఖ్యలు హైలైట్ చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో రూ.2,29,720 కోట్ల ఆదాయ వసూళ్లను అంచనా వేసింది. అయితే, జనవరి నాటికి, లక్ష్యంలో దాదాపు 60.23 శాతం అంటే రూ.1,38,371 కోట్లు మాత్రమే నెరవేరాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆదాయ వసూళ్ల అంచనాలు ఏదైనా సూచన అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఆదాయ వసూళ్ల రూ.1.7 లక్షల కోట్లకు చేరుకుంటాయని అధికారులు భావిస్తున్నారు, ఇది ఇప్పటికీ వార్షిక లక్ష్యానికి దాదాపు రూ.60,000 కోట్లు తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ఈ నెల 20వ తేదీన శాసనసభలో ప్రవేపెడుతున్న దృష్ట్యా దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# నెలాఖరునాటికి లక్ష ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తాం

### జూన్ నాటికి 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
### అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్లు ఇస్తాం
### శాసనమండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 18:** మార్చి నెలాఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తామని రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ నాటికి 3 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, అలాగే అర్హులైన ప్రతి జర్నలిస్టుకి అక్రెడిషన్ కార్డును ఇస్తామని శాసనమండలి ప్రశ్నోత్తరాల సందర్భంగా మంత్రి పొంగులేటి తెలిపారు. బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతోపాటు, జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన ఇళ్లు ఎన్ని ఉన్నాయని, జిల్లాల వారీగా వివరాలను చెప్పాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరీ వెంకట్ నర్సింగ్‌రావు, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ప్రశ్నించారు. ఇందుకు రెవిన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానమిస్తూ.. పేదవాడి ఆత్మ గౌరవానికి చిహ్నంగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం ఒకసారి చేసే కార్యక్రమం కాదని, అది ప్రతి సంవత్సరం కొనసాగించే శాశ్వత ప్రక్రియగా ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మాయ మాటలు చెప్పబోదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ఆచరణలో చూపిస్తుందన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో పట్టణ ప్రాంతాలలోని ప్రతీ వార్డులో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని చెప్పారు. నెలాఖరు నాటికి ఇప్పటికే పూర్తి చేసిన సుమారు లక్ష ఇళ్లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నామన్నారు. ఇప్పటికే మొదటి విడతలో ఇళ్ల మంజూరు జరగగా, మిగిలిన మూడు విడతలను కూడా దశలవారీగా పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలోని మారుమూల గిరిజన తండాలు, గూడాల్లో గతంలో ప్రారంభమై వివిధ స్థాయిలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లకు ఫ్లెక్సిబిలిటీ ఇచ్చి, లబ్ధిదారులకు అనుకూలంగా మార్పులు చేపడతామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి వివక్ష ఉండదని, కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అత్యంత పేదలకే ప్రాధాన్యం ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నాటికి సుమారు లక్ష ఇళ్లు పూర్తి కానున్నాయన్నారు. జూన్, జులై నాటికి మొదటి విడతలో మంజూరైన మూడు లక్షల ఇళ్లలో మెజారిటీ పూర్తి అవుతాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని, పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రస్తుతం వాళ్ళు నివసిస్తున్న ప్రాంతానికి ఒకటి, రెండు కిలోమీటర్ల పరిధిలోనే ఇండ్ల నిర్మాణాలు చేపట్టడానికి కార్యాచరణ రుపొందిస్తున్నామన్నారు. గతంలో దూర ప్రాంతాల్లో నిర్మించిన 2బిహెచ్‌కే ఇళ్లను లబ్ధిదారులు ఉపయోగించలేకపోయిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొంగులేటి సభకు తెలిపారు. అలాగే 2 బిహెచ్‌కె పథకంలో పెండింగ్ బిల్లులలో 99 శాతం ఇప్పటికే చెల్లించామని, మిగిలిన వాటిని కూడా త్వరలో క్లియర్ చేస్తామన్నారు. వివిధ దశల్లో ఆగిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు అందజేయడానికి ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నారా? అని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ప్రశ్నించారు. ఇందుకు పొంగులేటి సమాధానమిస్తూ.. మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు రూ. లక్ష ఆర్థికసాయం చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 671 మంది జర్నలిస్టులకి ఆర్థికసాయం చేసినట్టు తెలిపారు. జర్నలిస్టులకి ఇళ్ల మంజూరు విషయం లోనూ మార్చి 8 మహిళాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఇళ్ల సమస్యపై మాట్లాడారని త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులను జారీ చేస్తామన్నారు. డెస్క్ జర్నలిస్టులకు ఎవరికీ అన్యాయం జరగదని.. కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి సభ దృష్టికి తీసుకొచ్చారు.

# తెలంగాణకు కేంద్రం ఇచ్చింది గుండు సున్నా

### బిజెఎల్‌పి నేత ఏలేటికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు కేంద్రం ఏం గుండు సున్నా తప్ప ఏమీ ఇవ్వడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు ఇచ్చిందంటూ బిజెపి చేస్తున్న యాగి కోడి గుడ్డు మీద వెంట్రుకలు లెక్కపెట్టినట్టుగా ఉందన్నారు. ప్రత్యేకంగా తెలంగాణకు ఏమైనా నిధులు తెచ్చారా... అని బిజెపిని నిలదీశారు. రెండేళ్లుగా కేంద్రం తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుండి ఎనిమిది మంది ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారని, తెలంగాణకు ఏం తెచ్చారు..? అని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం సభలో బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు మంత్రి పొన్నం గట్టిగా కౌంటర్ ఇచ్చారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు కేంద్రం ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదు అని నిలదీశారు. రాష్ట్రానికి రావాల్సిన అనేక అంశాల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, పెండింగ్ ప్రాజెక్టులు ఇలా అనేక అంశాల్లో నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని బిజెపి జాతీయ నేతలు అంటుంటే రాష్ట్ర నేతలు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం కాదా..?, తెలంగాణకు నిధులు ఎందుకు కేటాయించరు..?, ఎందుకు ఈ వివక్ష అని నిలదీశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ దగ్గర నుండి రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉందని, బిజెపి తెలంగాణ నేతలు ఢిల్లీ వెళ్ళి ఆ బిల్లును ఆమోదింపజేయాలని సవాల్ విసిరారు.

రాష్ట్రానికి లాభం జరిగే విధంగా బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కొట్లాడితే నిర్మల్ ప్రజలు కూడా సంతోషిస్తారని హితవు పలికారు. 317 జీవోతో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చైర్మన్‌గా దామోదర రాజనర్సింహా, సభ్యులుగా తాము ఉన్నామని గుర్తు చేశారు.

### యూరియా యాప్‌తో రైతులకు ఇబ్బందులు
### మాజి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** కాంగ్రెస్ సర్కారు యూరియా యాప్ పేరుతో రైతులను వేధిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను మంగళవారం అసెంబ్లీలో ఆయన వివరించారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతుల దగ్గర స్మార్ట్‌ఫోన్‌లు లేవని, ఇక స్మార్ట్ ఫోన్‌లు ఉన్న 50 శాతం మందిలో కూడా 50 శాతం మందికి యాప్‌ను ఎలా ఉపయోగించాలో తెలియదని అన్నారు. మొత్తంగా 75 శాతం మంది రైతులు యూరియా యాప్‌తో ఇబ్బందులు పడుతున్నారని వేముల చెప్పారు. మీ సేవా కేంద్రాలకు పోయి యూరియా బుక్ చేయించుకోవాల్సి వస్తున్నదని తెలిపారు. మరో రోజు వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇలా రెండు రోజులు సమయం రైతుకు వృథా అవుతున్నదని చెప్పారు. ఇక ఒక దఫాలో 5 బస్తాల కంటే ఎక్కువ యూరియా ఇవ్వడంలేదని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దాంతో మూడు నాలుగు ఎకరాల్లో మక్క పంట వేసిన రైతు మూడు దఫాల్లో రెండేసి రోజుల చొప్పున మొత్తం ఆరు రోజులు యూరియా కోసం తిరగాల్సి వస్తున్నదని చెప్పారు. మండలానికి ఒక్క కేంద్రంలో మాత్రమే యురియా ఇస్తుండటంతో చాలా గ్రామాల రైతులు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కువచోట్ల యూరియా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. దఫాకు 5 బస్తాల పరిమితిని ఎత్తేసి, రైతు వేసిన పంటకు ఎంత యూరియా అవసరమో అంతా ఒకేసారి ఇవ్వాలన్నారు.

### గ్యారంటీల అమలులో అన్నీ అబద్ధాలు
## పూర్తిగా అసత్యాలతో గవర్నర్ ప్రసంగం
### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:పేదలు, రైతులు, కార్మికులకు సంబంధించిన ఏ అంశంపైనా గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావన లేదని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా అసత్యాలతో ఉందని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం అమలు చేయని పథకాలు అమలు చేసినట్లు, ఆరు గ్యారెంటీలు ఒకటి నెరవేర్చకుండా అమలు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మేరకు గవర్నర్ ప్రసంగంపై బుధవారం శాసనసభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరుగుతున్నా, అప్పులు పెరిగిపోతున్నా వాటిని ఏవిధంగా తగ్గించాలి, ఆదాయ వనరులు ఎక్కడ సృష్టించుకోవాలనే విషయాలు లేకపోవడం బాధకరమన్నారు. ముఖ్యమంత్రి విజన్ 2047 కాదు ప్రస్తుతం 1947 మాదిరిగా తెలంగాణ పరిస్థితి ఉందన్నారు. రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిందని, దానిని ఏవిధంగా కోలుకోవాలనే ఆలోచించాల్సిన పాలకులు ట్రిబుట్ ఆర్ ట్యాక్స్ చెల్లింపులపై ఫోకస్ పెడతున్నారని ఎద్దేవా చేశారు. రైతుల ఆత్మహత్యలు జరుగుతున్న వారి ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకుండా యమ పాశంలా తయారైందన్నారు. కౌలు రైతులు పరిస్థితి దారుణంగా ఉందని, పత్తి, యూరియా కొనుగోలు చేసేందుకు కొత్తగా యాప్‌లు తీసుకరావడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యకు 8 శాతం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిసిందని, గత పాలకులు 12 శాతం కేటాయింపులు చేసేవారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 2245 బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరో ఉండటం దేనికి సంకేతమన్నారు. భూమాత పోర్టల్‌లో నిషేదిత భూముల సంఖ్య పెరుగుతుందని, దరణిలో పోర్టల్ 64 లక్షల ఉంటే ఇప్పుడు కోటి వరకు చేరిందని, దానిని పట్టాభూములుగా రైతులు మార్చుకునేందుకు అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయం మరిచిపోయారని, మంత్రివర్గంలో కూడా బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదని, ఉన్నవారికి సరైన పోర్టుపోలియోలు కూడా సక్రమంగా లేవన్నారు. వైద్య రంగంలో కుంటుపడిందని, ఆసుపత్రిలో వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది నియామకాలు లేకపోవడం పేదలు ప్రైవేటు ఆసుపత్రులు బాట పట్టే పరిస్థితి నెలకొందన్నారు. 317 జీవో కూడా సక్రమంగా అమలు చేయడం లేదని, ఉద్యోగులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు.

### కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య గవర్నర్
## సంధానకర్తగా వ్యవహరించాలి
### సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:గవర్నర్ ప్రసంగం ప్రజలు ఆశించిన విధంగా లేదని, పేద, మధ్యతరగతి ప్రజలు కొత్త పథకాలు ప్రవేశపెడతారని ఆశిస్తే వాటి ఊసే లేకపోవడం బాధాకరమని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, దక్షిణాది రాష్ట్రాలను చిన్న చూపు చూస్తుందని ఆరోపించారు.

కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి నిధులు కేటాయించేలా చూడాలని గవర్నర్‌ను కోరారు. రాష్ట్రం ఎప్పుడు లేని విధంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, వాటి నుంచి బయట పడేలా గవర్నర్ చొరవ చూపాలన్నారు. తమ పార్టీ గవర్నర్ వ్యవస్థకు వ్యతిరేకమని, ఈ మధ్య కాలంలో గవర్నర్లు రాష్ట్రాల మధ్య వివాదాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి, జెన్‌కో, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, నిరక్ష్యం చేస్తే రాజకీయ పరమైన ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించారు. ఫోర్త్ సిటి, హిల్ట్ పాలసి వంటివి సక్రమంగా అమలుకాకపోతే ప్రభుత్వానికి చాలా ఇబ్బందులు వస్తాయన్నారు. వెలుగమట్ల సమస్యపై కొందరు కమ్యూనిస్టులు ఎక్కడ అంటూ విమర్శలు చేస్తున్నారని, పేదలకు సమస్యలు వస్తే తాము ఎంతో అవసరమో దేశమంతా గుర్తించిందన్నారు. కమ్యూనిస్టులు లేరని అనే వారికి ఇది చెంప పెట్టులాంటిదని వ్యాఖ్యానించారు.

### రూ.6.50 కోట్లు తో రాష్ట్రంలో అథ్లెటిక్ ట్రాక్

హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: రాష్ట్రంలో అత్యాధునికి సింథటిక్ ట్రాక్ రాబోతోంది. రాష్ట్రంలోని జమ్మికుంటలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ అభివృద్ధికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ట్రాక్ ఏర్పాటు నిమిత్తం రూ.6.50 కోట్ల మంజూరు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో అనుమతిస్తూ అ శాఖ అండర్ సెక్రటరీ చంచల్ రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సింథటిక్ ట్రాక్ ను నిర్మించి సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కాగా జమ్మికుంటలో స్టేడియాన్ని నిర్మిస్తామని కేంద్రం ఇటీవల ప్రకటించింది.

### త్వరలో సింగరేణి ఓపెన్ కాస్ట్ గని ప్రారంభం
### అటవీ అనుమతులకై సర్కార్ లేఖ


హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: సింగరేణి కాలరీస్ కంపెనీ మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ (ఆర్‌కేపీ) ఓపెన్‌కాస్ట్ గనిలో ఫేజ్ 2ను త్వరలో ప్రారంభించనుంది. ఆర్‌కేపీ ఫేజ్ 2లో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టడం ద్వారా బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో పాటు, ఇదే సమయంలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. త్వరలో ప్రారంభానికి సిద్దమవుతున్న ఆర్‌కేపీ ఫేజ్ 2 ఓపెన్‌కాస్ట్ గని కోసం అటవీ అనుమతి పొందవలసి ఉందని సింగరేణి అధికారవర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ఆర్‌కేపీ ఓపెన్‌కాస్ట్ గని ఉంది. రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో ఫేజ్ 2ని సింగరేణి కాలరీస్ మంజూరు చేసింది. కొత్తగా మంజూరైన ఓపెన్‌కాస్ట్ గనికి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అటవీ అధికారులకు ప్రతిపాదనలు పంపించిందినట్లు సమాచారం. ముఖ్యంగా, అటవీ అనుమతి పొందడానికి జిల్లా అటవీ అధికారులు పర్యావరణ మంత్రిత్వ శాఖకు ఒక నివేదికను పంపాల్సి ఉంటుంది. అయితే, ఓపెన్‌కాస్ట్ గనులతో పోలిస్తే భూగర్భ గనులు ఎక్కువ ఉద్యోగాలను సృష్టిస్తాయి.

ఓపెన్‌కాస్ట్ గనులలో బొగ్గు తవ్వకంలో యంత్రాల వాడకం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు, భూగర్భ బొగ్గు గనిలో బొగ్గు తవ్వకం మానవ శ్రమతో జరుగుతుంది. అందువల్ల ఉద్యోగవకాశాలకు ఎక్కువ వీలుంటుంది. కాగా చాలా కాలంగా సింగరేణి మంచిర్యాల జిల్లాలో కొత్త గనులను ప్రారంభించాలని యోచిస్తోంది. అయితే సింగరేణి తన ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ప్రస్తుత కార్మికులను తొలగిస్తూ, యంత్రాలను వినియోగించి, మైనింగ్ కార్యకలాపాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తున్న తరుణంలో, ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా ఉద్యోగాల కల్పనపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# ఇంటి స్థలం కోసం అక్కను చంపిన తమ్ముడు

- 60 గజాలపై కన్నేసిన సోదరుడు
- తన వాటా కోసం ఒత్తిడి చేసిన అక్క
- స్నేహితులతో కలిసి హత్య చేసిన వైనం
- బాటసింగారంలో ఘటన

**అబ్దుల్లాపూర్‌మెట్ 18, మార్చ్,ప్రభాతవార్త :** ఇద్దరూ కలిసి కొనుగోలు చేసిన 120 గజాల ఇంటి స్థలంపై కన్నేసిన ఓ వ్యక్తి సొంత అక్కని అతి కిరాతకంగా హత్య చేసి తన అక్క అదృశ్యమైందంటూ పోలీసులుకు ఫిర్యాదు చేసిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 28న అదృశ్యమైతే మార్చి 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసిన హంతకుడి ప్రవర్తనపై అనుమానంతో విచారించిన పోలీసులకు హత్య బాగోతం తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లీలాదేవి (40) భర్త చనిపోవడంతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో తన సోదరుడు పప్పురాం కుమావత్‌తో కలిసి బాటసింగారంలోనే వేర్వేరుగా నివాసముంటున్నారు. కాగా ఇద్దరూ కలిసి బాటసింగారంలో 120 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేయగా, లీలాదేవి తన తమ్ముడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించింది. గత కొన్ని రోజులుగా ప్లాట్‌లో తన వాటా ఇవ్వాలంటూ లీలాదేవి తన తమ్ముడిపై ఒత్తిడి తీసుకువస్తుండగా, తన సోదరికి ప్లాటు ఇవ్వడం ఇష్టం లేని పప్పురాం సోదరిని ఎలాగైనా హంతం చేయాలని పన్నాగం వేసుకుని బాటసింగారంలోనే నివాసముండే మరో ఇద్దరు వ్యక్తులైన రాకేష్ కుమావత్, సునీల్‌కుమార్‌లతో కలిసి హత్యకు కుట్ర చేశారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 28వ తేదీన లీలావతిని నిందితుడి ఇంట్లోనే హత్య చేసి మార్చి 2వ తేదీన మృతదేహాన్ని వారి కారులో సమీపంలోని మజీద్‌పూర్ గ్రామంలో ఉన్న పెద్దచెరువు వద్దకు తీసుకువెళ్లి మృతదేహం నుంచి రెండు కాళ్లను వేరు చేశారు. మృతదేహాన్ని సంచిలో పెట్టి చెరువు తూము బాగంలో కాళ్లను ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి చెరువులో పడేశారు. ఈ మేరకు మొదట మిస్సింగ్ కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా మహిళ హత్య కేసుగా నమోదు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ప్లాటు కోసమే హత్య చేశారా లేక ఇంకా ఏమైనా కారణాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలసులు తెలిపారు.



లీలాదేవి (ఫైల్‌ఫొటో)

### అకాల వర్షాలతో రాష్ట్రంలో
## తగ్గిన విద్యుత్ వినియోగం
### 17,242 మెగావాట్లకు పడిపోయిన డిమాండ్

హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: మార్చిలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు కావడంవతో పాటు, అందుకు తగినట్లు ఎండలు, వేడి మంట పెడుతుండగా, అదే స్థాయిలో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. అయితే గత మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు పడుతుండటంతో గరిష్ట ఉష్ణోగ్రతల్లో తగ్గుదల నమోదైంది. దీంతో విద్యుత్ వినియోగంలో కూడా తగ్గుదల చోటు చేసుకుంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఒక్కసారిగా వాతావరణం మారి, విద్యుత్తు వినియోగానికి సంబంధించి గరిష్ఠ డిమాండ్‌లో మార్పు చోటు చేసుకుంది. రాష్ట్రంలోనే గరిష్ఠంగా ఈ నెల 13న ఒక్క రోజునే 18,228 మెగావాట్ల డిమాండ్ చోటు చేసుకుంది. అయితే తదుపరి గ్రేటర్ పరిసరాలతో పాటు, రాష్ట్రంలోని ఆదిలాబాద్, మెదక్, నిర్మల్, యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సంగారెడ్డి, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి తదిర జిల్లాల్లో వర్షాలు పడటంతో వాతావరణం మారి ఎండల నుండి కొంత ఉపశమనం లభించింది. దీంతో గత నాలుగు రోజులుగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం తగ్గుముఖం పట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 14వ తేదీన గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 17,703 మెగావాట్లు ఉండగా, 15వ తేదీన అది మరింత తగ్గి 17,060 మెగావాట్లకు తగ్గింది. ఇలా క్రమేపీ ఈ నెల 16వ తేదీన విద్యుత్తు వినియోగం 17,224 మెగావాట్లు జరగ్గా, 17వ తేదీన 17,242 మెగావాట్లుకు పడిపోయింది.

# స్లోవేనియా పెట్టుబడులకు తెలంగాణ అద్భుత వేదిక: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు ఉన్న తెలంగాణా పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రమని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బుధవారం శాసన సభ కమిటీ హాలులో తనను కలిసిన స్లోవేనియా ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. మధ్య యూరప్ దేశమైన స్లోవేనియా యూరప్‌లోని సంపన్న దేశాలలో ఒకటి. భారత్‌లో ఆ దేశపు రాయబారి టోమజ్ మెన్సిన్ ఆధ్వర్యంలో విచ్చేసిన వాణిజ్య, పారిశ్రామిక బృందానికి శ్రీధర్ బాబు స్వాగతం పలుకుతూ లైఫ్ సైన్సెస్, ఆటోమొబైల్, ఐటి రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణా మెరుగైన అవకాశాలు కల్పిస్తోందని వివరించారు. యూరోపియన్ యూనియన్‌తో ఇటీవల జనవరిలో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల ఇక్కడి నుంచి యూరప్ దేశాలకు ఎగుమతి చేసే 99.95 శాతం ఉత్పత్తులపై సుంకాలు చెల్లించనవసం లేదని శ్రీధర్ బాబు గుర్తు చేసారు. తెలంగాణాలో ఫార్మా, జీవ విజ్ఞాన రంగాలు, వాహనాల విడిభాగాల ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పరంగా అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. స్లోవేనియా ఆటో మొబైల్ దిగ్గజాలైన ఫోక్స్ వాగన్, కియా, హ్యుండాయ్, సిట్రోయెన్, స్టెల్లాంటిస్ బ్రాండ్ వాహనాలకు ఒరిజనల్ విడిభాగాలను అందిస్తుందన్నారు. ఔషధ, బయోటెక్నాలజీ రంగాల్లో కూడా స్లోవేనియా గణనీయమైన ప్రగతి సాధించింది. యూరప్ లోని ఔషధ, లైఫ్ సైన్సెస్ ఉత్పత్తుల్లో 14 శాతం అక్కడి నుంచి యూరప్ దేశాలకు సరఫరా అవుతున్న విషయం తెలిసిందేనని శ్రీధర్ బాబు ప్రశంసించారు. ఫార్మా, బయోటెక్నాలజి రంగాల్లో తెలంగాణా దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నందున ఇక్కడి మౌలిక సదుపాయాలు, సంస్థలతో సహకారం కలిసి వస్తాయని ఆయన సూచించారు. ఐటి అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్‌లో తెలంగాణాలో అపారమైన అవకాశాలున్నాయని ఆయన తెలిపారు.

సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, తెలంగాణా పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, స్లోవేనియా ప్రతినిధులు ఆసిఫ్ ఇక్బాల్, సుజిత్ నాయర్, కీర్తి చిలుకూరి తదితరులు పాల్గొన్నారు.



# బిజెపిలో చేరిన కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపి

**గువాహతి, మార్చి 18:** ఎన్నికల వేళ అస్సాంలో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. ప్రస్తుత ఎంపి ప్రద్యుత్ బోర్డోలోయి కాంగ్రెస్‌కు రాజీనామాచేసి భారతీయ జనతాపార్టీలోచేరారు. ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ, రాష్ట్ర బిజెపి అద్యక్షుడు దిలీప్ సైకియాల సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రెరెండుసార్లుఎంపిగా నాగాంవ్ నియోజకవర్గంనుంచి పోటీచేసారు. రాష్ట్ర కేబినెట్ మంత్రిగా కూడా పనిచేసారు. పార్టీనాయకుల నుంచి పదేపదే తనను పక్కన పెట్టడం, అగౌరవ పరచడం వంటి వాటితో విసిగిపోయానని అందువల్లనే దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న బంధాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో తెంచుకున్నానన్నారు. అనేక అంశాల్లో పార్టీ తనను అవమానించిందని అస్సాం కాంగ్రెస్‌లో మరింతగా అవమానాలు ఎదురయ్యాయన్నారు. ప్రద్యుత్‌తో పాటు అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా కూడా ఇటీవలే పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. ఎఐసిసి అధ్యక్షుడికి ప్రద్యుత్ తన రాజీనామాలేఖను పంపించారు. పార్టీ అన్ని పదవులనుంచి ప్రాథమిక సభ్యత్వం నుంచి కూడా వైదొలుగుతున్నట్లుప్రకటించారు. రాష్ట్ర చీఫ్ గౌరవ్ గగోయ్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జితేంద్రసింగ్‌లు బోర్డోలోయిని ఢిల్లీలో కలిసి బుజ్జగింపు ప్రయత్నాలుచేసిన ఆయన వినలేదు. విద్యార్థికాలంనుంచి కూడా బోర్డోలోయి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా మార్గెరిటా నియోజక వర్గం నుంచి గెలిచారు. ఆయన కుమారుడు ప్రతీక్ బోర్డోలోయి మార్గరెటియా నుంచే ఇపుడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ప్రద్యుత్‌తోపాటే ఎపిసిసి నాయకుడు నబజ్యోతి తాలూక్‌దార్‌కూడా కాంగ్రెస్‌కు రాజీనామాచేసారు.

# ఎస్సీ ఎస్టీల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

## ప్రజా సంఘాల జెసి నేతల డిమాండ్



ధర్నా నుద్దేసించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ కే.లక్ష్మీనారాయణ

**ధర్నాచౌక్, మార్చి 18, ప్రభాతవార్త:** ఎస్సీ ఎస్టీల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఎస్సీ ఎస్టీ ప్రజా సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఎస్సీ ఎస్టీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వివిధ ప్రజాసంఘాల నేతలు, మేధావులు హాజరై మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి ఒక్క పథకం కూడా అమలుచేయలేదని ఆరోపించారు. ఎస్సీల సంక్షేమానికి 2026-27 ఎస్సీ జనాభా 18 శాతం ప్రకారం నిధులు కేటాయించాలని, గత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయకుండా మిగిలిపోయిన 26వేల కోట్లును క్యారీ ఫార్వర్డ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు పథకాలు అమలుచేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని, ఎస్సీ ఎస్టీలపై దౌర్జన్యాలు జరుగుతున్నా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కుల దురహంకార హత్యలు చేసిన నిందితులలో ఎంతమందికి శిక్షలు పడ్డాయో అసెంబ్లీలో చర్చించాలని, 445 కోట్ల కులాంతర జంటలకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ కే.లక్ష్మీనారాయణ, భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్వయ్య, డి.బి.ఎఫ్ రాష్ట్ర వ్యస్థాపకులు కొరి వినయ్‌కుమార్, డి.బి.ఎస్.యు రాష్ట్ర అద్యక్ష కార్యదర్శులు అమృత నరసింహా, శివలింగం, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్, ఓయూ జేఏసీ వ్యవస్థాపకులు మందాల భాస్కర్ న్యాయవాదులు రాహుల్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిసిల సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయించండి : మాజీ మంత్రి తలసాని

**- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి**

**- అప్పా జంక్షన్-మన్నెగూడ రహదారిపై వంతెనలు నిర్మించండి: ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:** శాసనసభ బడ్జెట్ సమావేశాల మూడోరోజు జిరో అవర్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులు పలు కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బిసిల సంక్షేమానికి నిధుల కేటాయింపు అంశాన్ని బిఆర్ఎస్ సభ్యుడు, మాజి మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం జనాభాలో 50 శాతం ఉన్న బిసిల సంక్షేమానికి ఈ బడ్జెట్ లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల జిరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండు బడ్జెట్‌లు అయిపోయాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 10 వేల కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే బిసి విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జ్యోతిరావు పూలే ఓవర్సీస్ కార్యక్రమాన్ని కెసిఆర్ తీసుకొచ్చారని, ఆ పథకం క్రింద అర్హులైన విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టి బిసి వర్గాలను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో బిల్లు పెడితే చట్టబద్దత రాదని, కేంద్ర ప్రభుత్వం 9 వ షెడ్యూల్‌లో చేరిస్తేనే చట్టబద్దత వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లిఖార్జునఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు హాజరుకాకపోవడం బిసిల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బిసి సమస్యలపై కాంగ్రెస్ పార్టీలోని బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మాజిమంత్రి తలసాని వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్‌బాబు గట్టిగా సమాధానమిచ్చారు. బిసిల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బిసిల సంక్షేమానికి ఏం చేయకపోవడంతోనే తలసాని ఇటువైపు (అధికారం) నుండి అటు వైపు (ప్రతిపక్షం)కు వెళ్లారని కౌంటర్ ఇచ్చారు.

**ఎమ్మెల్యే కాలె యాదయ్య వ్యాఖ్యలతో సభలో నవ్వులు..**

అప్పా జంక్షన్ -మన్నెగూడ జాతీయ రహదారి పరిధిలో తన నియోజకవర్గంలో పలు గ్రామాల పరిధిలో బ్రిడ్జిలు అసంపూర్తిగా మిగిలిపోయాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పలు బ్రిడ్జిల నిర్మాణం పూర్తయిందని, మరో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు అడిగితే ఆర్థిక శాఖ విడుదల చేయడం లేదని వ్యాఖ్యానించారు. దీంతో అన్నీ గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని చెప్పండని కాలె యాదయ్యనుద్దేశించి బిఆర్ఎస్ సభ్యులు పెద్ద పెట్టున అనడంతో సభలో నవ్వులు విరిశాయి.

**మాజి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి...**

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మొయినాబాద్ ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులో మాజి ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోహిత్‌రెడ్డికి అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి మాట్లాడుతూ... సింగూరు డ్యాం నుండి సాగునీటిని విడుదల చేయాల్సి ఉండగా అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించడం సమంజసం కాదన్నారు. వెంటనే సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పత్తి, సోయాబిన్ పంటలకు కూడా సన్న ధాన్యం మాదిరిగానే రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు.

**జీఓ118ని పునరుద్ధరించండి...**

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎల్‌బినగర్ నియోజకవర్గ పరిధిలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్ జివో 118 ని ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసిందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. రెగ్యులరైజేషన్ జివోను పునరుద్దరించి అవసరమైతే సిఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టుకోవాలని ప్రభుత్వానికి హితవు చెప్పారు. ఈ అంశంపై మంత్రి పొంగులేటి సమాధానమిస్తూ జివో 118ని తాత్కాలికంగానే నిలుపుదల చేశామని, త్వరలోనే పునరుద్దరిస్తామని సభకు తెలిపారు.

**కరింనగర్ సిపిపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సంచలన ఆరోపణలు...**

కరింనగర్ సిపి గౌస్ ఆలంపై శాసనసభలో ఎమ్మెల్యే కౌషిక్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. అనేక అక్రమాలకు సిపి పాల్పడుతున్నారని, ఆయన కుటుంబ సభ్యులు ఎకె 47, తదితర ఆయుధాలతో ఫైరింగ్ నేర్చుకుంటున్నారని ఆరోపించారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న సిపిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ... రాజకీయాల్లో ఓపిక ఎంతో అవసరమని కౌశిక్‌రెడ్డికి సూచించారు. ఆరోపణలపై విచారణ జరిపిస్తామని, సిఎస్, డిజిపికి ఆదేశాలు ఇచ్చి వాస్తవాలు తెలుసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.

# ఉగాది పండగకు సెలవు ఇవ్వాలి

## బిజెపి టీచర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొంజర్ల శ్రీనివాస్

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త** తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ పేపర్ వాల్యుయేషన్ మూల్యాంకనం క్యాంపులను ఉగాది రోజున సైతం యధావిధిగా నడిపిస్తున్నట్టు లెక్చరర్స్‌కి ఉత్తర్వులు పాస్ చేయడం ఏమిటని బిజెపి టీచర్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొంజర్ల శ్రీనివాస్ మండిపడ్డారు. మూల్యాంకనము మధ్యాహ్నం ఒంటిగంట నుండి ప్రారంభిస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారని, గురువారం తెలుగు నూతన సంవత్సరం ఉగాది రోజు సెలవు ఇవ్వకుండా మూల్యాంకణమును కొనసాగించడం హిందూ జాతిపై, పండుగలపై జరుగుతున్న దాడి అని చెప్పకనే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తుందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి హిందూ పండుగల పైన ఎంతటి ద్వేషం ఉన్నదో ఈ ఒక్క చర్యతో అర్థమవుతుందన్నారు. తెలుగు ప్రజలు వైభవంగా జరుపుకునే తెలుగు నూతన సంవత్సరాన్ని అడ్డుకుంటున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి అధ్యాపకులందరూ తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అధ్యాపక మిత్రులందరూ స్వచ్ఛందంగా మూల్యంకణాన్ని బహిష్కరించాలన్నారు. వాల్యుయేషన్ క్యాంపులకు హాలిడే ఇవ్వని పక్షంలో తర్వాతే రోజు జరగబోయే రంజాన్ పండుగ రోజు కూడా వాల్యుయేషన్ క్యాంపులను యధావిధిగా నడిపించాలని డిమాండ్ చేశారు. లేకపోతే వాల్యుయేషన్ క్యాంపులు, ఆఫ్ ఇంటర్మీడియట్ ఆఫీసును ముట్టడించడం జరుగుతుందన్నారు.

# ప్రత్యక్ష పన్నురాబడులు రూ.22.80 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, మార్చి 18:** భారత్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 7.19శాతం పెరిగాయి. రూ.22.80 లక్షలకోట్లు వరకూ వసూలయినట్లు ఐటిశాఖ బుధవారం ప్రకటించింది. ఈ మొత్తంలో కార్పొరేట్ పన్ను రూ.10.91 లక్షలకోట్లు, కార్పొరేటేతర పన్నుల రాబడులు రూ.11.32 లక్షలకోట్లు, సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను రూ.55,717 కోట్లు వసూలు చేసినట్లు తెలిపింది. ఎస్టీటీ వసూళ్లు రూ.53,095కోట్ల నుంచి రూ.55,717 కోట్లకు పెరిగాయి. ఇతర పన్నులు మాత్రం సుమారు రూ.365 కోట్లు తగ్గి రూ.3400కోట్లు రాబడులు వచ్చినట్లు తేలింది. ముందస్తు పన్నుల వసూళ్లు కూడా 6.42శాతంపెరిగి రూ.11.13 లక్షల కోట్లు వసూలు చేసారు. రీఫండ్స్ కూడా ఈ కాలంలో రూ.4.35 లక్షల కోట్ల వరకూ ఉన్నాయి. రీఫండ్స్ సర్దుబాట్లకు ముందు స్థూల రాబడులు రూ.27.15 లక్షలకోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే 4.86శాతం పెరిగాయి. అయితే మధ్యతరగతి ప్రజానీకానికి రూ.12 లక్షల వరకూ వార్షికాదాయ పరిమితి, వేతన జీవులకు రూ.12.75 లక్షల వరకూ వార్షికాదాయ పరిమితులు విధించడంతో వ్యక్తిగత ఆదాయపు పన్ను కొంతమేర తగ్గింది. జనవరి వరకూ కార్పొరేట్ పన్నువసూళ్లు రూ.8.63 లక్షలకోట్లుగా ఉన్నాయని గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన పన్నులకంటే 12.41శాతం పెరిగినట్లు ఐటి శాఖ ప్రకటించింది.

# మూసీ పునరుజ్జీవంపై బిఆర్ఎస్ బురద చల్లడం ఆపాలి: మంత్రి శ్రీధర్ బాబు


**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వైఖరి మొదటి నుంచీ మేం బురద చల్లుతాం...మీరు తూడ్చుకోండి అన్నట్టుగా ఉంటోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అసహనం వ్యక్తం చేసారు. బుధవారం నాడు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో కెటిఆర్ చేసిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. మూసి పునరుజ్జీవన ప్రాజెక్టు మొదటి దశ డిపిఆర్‌లో రూ.6,500 నుంచి రూ.7,000 కోట్లు వ్యయం అవుతుందని తాము స్పష్టంగా చెప్పామని అన్నారు. కెటిఆర్ మాత్రం లక్షన్నర కోట్ల కుంభకోణం అని అవాస్తవాలతో బురద చల్లుతున్నారని ఆక్షేపించారు. తాము పారదర్శకంగా ప్రతిదీ ప్రజల ముందు పెడుతున్నామని, ఇందులో దాపరికాలేవీ లేవని శ్రీధర్ బాబు వెల్లడించారు. మూసి కాలుష్యం అనేది జంట నగరాలకు సంబంధించిన ప్రధాన సమస్య. దీని కోసం తాము చేస్తున్న ప్రతి ప్రయత్నానికి అడ్డుగోడ కట్టాలని బిఆర్ఎస్ పార్టీ సంకుచిత ఆరోపణలు చేస్తుందని తిప్పికొట్టారు. మూసికి రెండు వైపులా 50 మీటర్ల బఫర్ జోన్‌గా గుర్తిస్తూ 2016 లో అప్పటి ప్రభుత్వం జిఓ ఇచ్చింది నిజం కాదా అని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. ఇప్పుడేమో ఇళ్లెలా తొలగిస్తారని అడుగుతున్నరని రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని అన్నారు. పేదలకు పునరావాసం కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తామని ఆయన వివరించారు. ఆ పార్టీకి ప్రజల మేలు గురించి అవసరం లేదు. మేం ఏ సంకల్పం మొదలు పెట్టినా అభాండాలు వేయడం అలవాటై పోయిందని విమర్శించారు. ప్రజల మేలు కంటే రాజకీయ ఆరోపణలకే బీఆర్ఎస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. మూసీ ప్రాజెక్టు కోసం డిపిఆర్ రూపొందించిన మెయిన్ హార్ట్ అనే సింగపూర్ ఇంజనీరింగ్ సంస్థకు ఇటువంటి పనుల్లో అనుభవం ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. డిపిఆర్ రెండు నెలల్లో తయారు చేసిన ఆరోపణలు శుద్ధ అబద్ధాలని అన్నారు. ఏడాది సమయం పట్టిందని తెలిపారు. రుణం కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడిబి)కి డిపిఆర్ పంపించామని త్వరలోనే దానికి ఆమోదం లభిస్తుందని భావిస్తున్నట్టు వివరించారు. ఏడిబి తన తదుపరి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఏడిబి తిరస్కరించడం అనేది అవాస్తమని అన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా ఏడిబికి వీలుకాక పోతే ఇతరత్రా మార్గాలు అన్వేషిస్తామని తెలిపారు. ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగుతుందని స్పష్టం చేసారు.

# వెలుగుమట్ల భూదాన్ బాధితులకు హైకోర్టు తీర్పుతో ఊరట

**ఖమ్మం బిజెపి కార్యకర్తల విజయం - బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు**

**హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలోని భూదాన్ భూములపై హైకోర్టు ఇచ్చిన తీర్పు అణగారిన పేదల విజయమని, కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారానికి ఇది చెంపపెట్టు అని బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు పేర్కొన్నారు. హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఆయన స్పందిస్తూ, బాధితులకు న్యాయం చేసిన న్యాయస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు. వెలుగుమట్లలో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేసిన నాటి నుండి భారతీయ జనతా పార్టీ బాధితుల పక్షాన నిలిచిందని వాసుదేవరావు గుర్తుచేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, ఎంపి ఈటల రాజేందర్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ స్వయంగా సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు అండగా నిలిచారు. అదేవిధంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎప్పటికప్పుడు స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, "నేనున్నాను" అని భరోసా కల్పిస్తూ బాధితులకు భరోసా కల్పించారు. క్షేత్రస్థాయిలో బిజెపి చేసిన ఉధృత పోరాటాల ఫలితంగానే బాధితులకు న్యాయం జరిగిందని దేవకి వాసుదేవ రావు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా తెలంగాణలో ఎక్కడ పేదలకు అన్యాయం జరిగినా భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటం కొనసాగుతుందని దేవకి వాసుదేవ రావు స్పష్టం చేశారు.

# విద్యుత్ కారు ఛార్జింగ్‌పాయింట్ బ్లాస్ట్ - ఏడుగురు సజీవదహనం



**ఇండోర్; మార్చి 18:** ఇంటి బయట ఛార్జింగ్‌కు పెట్టిన ఓ ఎలక్ట్రిక్ వాహనం(ఈవీ) పేలడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించి, ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు సజీవ దహనమయిన విషాద ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బుధవారం చోటుచేసుకుంది. మృతుల్లో 12 ఏళ్ల బాలిక కూడా ఉండటం అందరినీ కలచివేసింది. పోలీసుల కథనం ప్రకారం.. బృజేశ్వరి అనెక్స్ ప్రాంతంలోని ఓ మూడంతస్తుల నివాస భవనం బయట పార్క్ చేసిన ఎలక్ట్రిక్ కారుకు తెల్లవారుజామున 3:30 నుంచి 4 గంటల మధ్య ఛార్జింగ్ పెట్టారు. ఒక్కసారిగా ఆ ఛార్జింగ్ పాయింట్ వద్ద భారీ శబ్దంతో పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే ఆ మంటలు భవనం మొత్తానికి వ్యాపించాయి. అదే సమయంలో ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు 10 గ్యాస్ సిలిండర్లు ఒకదాని తర్వాత ఒకటి పేలడంతో మంటల తీవ్రత ఊహించని స్థాయికి చేరింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు కుటుంబ సభ్యులందరూ గాఢ నిద్రలో ఉన్నారు. అగ్నిప్రమాదం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో భవనానికి ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎలక్ట్రానిక్ లాకింగ్ సిస్టమ్ మొరాయించింది. దీంతో తలుపులు తెరుచుకోక బాధితులు బయటపడలేకపోయారు. లోపలే చిక్కుకుని పొగతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. ఈ భవనం యజమాని మనోజ్ పుగాలియా పాలిమర్ వ్యాపారి కావడంతో ఇంట్లో పాలిమర్ మెటీరియల్ నిల్వ చేశారని,మంటలు వేగంగా వ్యాపించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై మంత్రి కైలాష్ విజయ్ వర్గీయ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాల్లో ఈవీ ఛార్జింగ్‌కు నిపుణుల కమిటీతో విచారణ జరిపించాలన్నారు.

# ఇడి దాడులుచేస్తుంటే అడ్డుకుంటారా?

## పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, మార్చి 18:** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై భారత సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకవైపు ఈడీ దాడులు జరుగుతుంటే, అక్కడికి దూసుకెళ్లి, దాడుల్ని అడ్డుకుంటారా అంటూ మండిపడింది. ఐప్యాక్ ఆఫీసు, ఆ సంస్థ చీఫ్ ఇంటిపై ఈడీ దాడుల సందర్భంగా మమతా బెనర్జీ అడ్డు తగిలిన సంగతి తెలిసిందే. దీనిపై ఈడీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు తాజాగా స్పందించింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియా ఆధ్వర్యంలోని బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత జనవరి 8న పశ్చిమ బెంగాల్, కోల్‌కతాలో ఐ ప్యాక్ సంస్థ ఆఫీసులపై, ఆ సంస్థ చీఫ్ ప్రతీక్ జైన్ ఇంటిపై ఈడీ దాడులు చేసింది. ఒక మనీ లాండరింగ్ కేసుపై విచారణలో భాగంగా ఈ దాడులు చేసింది. ఈ దాడుల సందర్భంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హైడ్రామా నడిపారు. దాడులు జరుగుతున్న ఐ ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ ఇంటికి వెళ్లి ఈడీ కార్యకలాపాలకు అడ్డు తగిలారు. ప్రతీక్ జైన్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, ఇంకొన్ని కీలక డాక్యుమెంట్లు తీసుకెళ్లారు. అక్కడ్నుంచి ఐప్యాక్ ఆఫీసుకు వెళ్లి ఈడీ దాడుల్ని అడ్డుకుని, ఇంకొన్ని డాక్యుమెంట్లు తీసుకుని మమత వెళ్లిపోయారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఈడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణ సందర్భంగా మమత తీరును సుప్రీం కోర్టు తప్పుబట్టింది. మమత విచారణకు అడ్డు తగలడం మంచి పరిణామం కాదని వ్యాఖ్యానించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ కార్యకలాపాలకు ఒక రాష్ట్ర సీఎం అడ్డుతగులుతారా దీనికి పరిష్కారం ఏంటి మరో సీఎం కూడా ఇలాగే చేస్తే పరిస్థితి ఏంటి దీనికి పరిష్కారం ఉన్నప్పుడు మేం సరైన రీతిలో స్పందించాల్సిందే అని కోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు వ్యాఖ్యలపై మమత, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తరఫు లాయర్ శ్యామ్ దివాన్ స్పందిస్తూ దీనిపై కౌంటర్ అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలన్నారు. ఈడీ తరఫు న్యాయవాది తుషార్ మెహతా దీన్ని ఖండించారు. విచారణ ఆలస్యం చేసేందుకే ప్రభుత్వం సమయం అడుగుతోందన్నారు. దీంతో తాము తగిన ప్రొసీడింగ్స్‌తో విచారణ కొనసాగిస్తామన్నారు.

# వడగండ్లతో అన్నదాతలకు కడగండ్లు

**- మామిడి, మొక్కజొన్న, వరి, కూరగాయల రైతులకు తీవ్ర నష్టం - మరో మూడు రోజులు వడగండ్ల వానలు - ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ కేంద్రం**

**హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త :** వేసవి ఆరంభం మార్చిలోనే 40 డిగ్రీల ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు మారిన వాతావరణంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉపశమనం కలుగుతున్నా అన్నదాతలకు మాత్రం తీరని నష్టం మిగులుతోంది. నాలుగు రోజులుగా పలు జిల్లాల్లో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. గత శనివారం నుంచి ప్రతి రోజూ రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురుస్తోంది. ఫలితంగా చేతికంద వచ్చిన మొక్కజొన్న, వరి, మామిడి, కూరగాయల పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. ఇటీవలి అకాల వర్షాలతో వికారాబాద్ జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లాలోని పూడూరు మండలం నిజాంపేట మేడిపల్లిలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీ వడగండ్ల వర్షంతో గ్రామ శివారులో ఆరుగురు కాపర్లకు చెందిన 150 మేకలు మృతి చెందాయి. జిల్లాలోని చౌడాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన కొందరు సంచార కాపరులు మేడిపల్లి దగ్గర మేకలను ఆపి ఉండగా కురిసిన వర్షానికి మేకలు మృతి చెందాయి. మెదక్, సిద్దిపేట, హనుమకొండ, రంగారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులకు తోడు వర్షం, వడగండ్లు కురవడంతో వరి, మామిడి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ మండలంలోని గాజిరెడ్డిపల్లితండా, బూరుగుపల్లి, తోగుట గ్రామాల్లో 135 ఎకరాల్లో వరికి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామంలో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు నేలవాలగా పిందె దశలో ఉన్న మామిడికాయలు నేలరాలాయి. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో అకాల వానలతో అపార పంట నష్టం జరుగుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఏటుగా పెరిగిన పంట అకాల వర్షం,ఈదురు గాలుల ధాటికి ఇలా కుప్పకూలింది. చెట్టుపైన మచ్చుకైనా లేకుండా మామిడి కాయలు నేలరాలాయి. మొక్క కూడా మిగలకుండ జొన్నచేను వాలిపోయింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇది పరిస్థితి అటు సంగారెడ్డి జిల్లాలో కూడా ఇదే దుస్థితి నెలకొంది. జోరు వానకు జొన్నచేన్లు ధ్వంసమయ్యాయి. మామిడి, టమాట ఇలా అన్ని పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. ఇక సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాంతంలో కూడా ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఇక కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉరుములు,మెరుపులు ఈదురు గాలులతో అకాల వర్షం దంచి కొట్టింది.గాంధారి, జుక్కల్ మండలాల్లో ఈదురు గాలులకు జొన్న, మొక్కజొన్న, కూరగాయల పంటలు ధ్వంసమయ్యాయి.తెలంగాణపై కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడు రోజులపాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా కామారెడ్డి, సిద్దిపేట, జనగాం జిల్లాలో వడగండ్ల వాన కురిసే అవకాశం ఉన్నందున ఆ జిల్లాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## వసంతోదయం

సృష్టికి పునాది
యుగ యుగాలకు ఆది
తెలుగు వారి ఉగాది
ప్రకృతి చైతన్యానికి ఆరంభం
అందుకే ఉగాది
ఇంత సంబరం
చిగురించజేసే హృదయాలలో
సరికొత్త ఆశలు
సంతోషపు పూరేకులు
హరితవర్ణ శోభితమై..
ఆహ్లాదభరితమై...
కొత్త ఆశలతో..
కొత్త కోర్కెలతో..
అలరించే వసంత మాసం
నవజీవనానికి పునాది
ఆ శుభ ముహూర్తమే ఉగాది

- కాయల నాగేంద్ర.



## ఉగాది పచ్చడి..

**కావలసినవి పదార్థాలు :** కొత్త చింతపండు- కొద్దిగా, వేపపూత-తగినంత, తురిమిన కొత్త బెల్లం-సరిపడినంత, చిన్న తరిగిన మామిడికాయ ముక్కలు కొద్దిగా, నీళ్లు - ఒక లీటరు.

**తయారు చేసే విధానం :** చింతపండులో గింజలు, నార లేకుండా శుభ్రం చేసి కొద్దిసేపు ఓ గిన్నెలో నానబెట్టాలి. ముందుగా వేపపూతను నీటిలో పోసి కడగాలి. మామిడి ముక్కలు, బెల్లం తురుము సిద్ధంగా ఉంచుకోవాలి. ఓ పాత్రలో వట్టిన నీటిని తీసుకోవాలి. అందులో సిద్ధంగా వుంచుకున్న చింతపండు రసం, బెల్లంతురుము, మామిడిముక్కలు వేయాలి. తరువాత కొద్దిగా వేపపూత వేయాలి. పచ్చి పదనట్లుగా చిటెడు ఉప్పు వేసి బాగా కలిపితే బెల్లం తురుము కరిగి ఉగాది పచనచడి తయారువుతుంది. తాగే సమయంలో ఒకద్దిమంది పుట్నాలపప్పు వేసుకుంటారు. మరికొంతమంది చెరకుముక్కలు, కొబ్బరి పొడి, పండుముక్కలు కలుపుకుంటారు.

## బొబ్బట్లు

**కావలసిన పదార్థాలు :** మైదా-అరకిలో, పచ్చి సోనగపప్పు- పావు కిలో, బెల్లం-పావు కిలో, యాలకుల పొడి-కొద్దిగా, నెయ్యి - సరిపడినంత.

**తయారు చేసే విధానం :** మైదాపిండి జల్లించి పెట్టుకోవాలి. మైదా పిండిలో సరి పడినన్ని నీళ్లు పోసి ముద్దగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఒక పాత్రలో సెనగపప్పును వేసి మెత్తగా ఉడికించుకోవాలి. పప్పు ఉడికిన తర్వాత మిగిలిన నీటిని పూర్తిగా వంపేయాలి. ఈ పప్పులో బెల్లం తరుము, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. కలిపిన తర్వాత చిన్న చిన్న ఉండలుగా తీసుకొని రెడీ చేసి పెట్టు కున్న సెనగపప్పు ముద్దని మధ్యలో పెట్టి మళ్లీ ఉండలుగా చేసి కాస్త మందంగా చపాతిలా చేసి పెనంపై నెయ్యి వేసి కాల్చాలి.



## మామిడి బజ్జీలు



**కావల్సినవి :** బియ్యంపిండి- కప్పు, సెనగపిండి-ముప్పావు కప్పు, మామిడికాయ తురుము- అరకప్పు, ఉల్లిపాయలు- అర కప్పు, ఉల్లికాడలు- అరకప్పు, కొత్తిమీర-పావు కప్పు, చాట్ మసాలా-అర టీస్పూను, కరివేపాకు- టేబుల్‌స్పూను, పుదీనా- టేబుల్ స్పూను, అల్లం- అంగుళం ముక్క, వెల్లుల్లి- రెండు రెబ్బలు, జీలకర్ర పొడి- అర టీస్పూను, పచ్చిమిర్చి-ఒకటి, బేకింగ్‌సోడా- చిటికెడు, వాము-పావు టీస్పూను, నూనె-డీప్‌ఫ్రైకి సరిపడా, ఉప్పు తగినంత, **తయారీ :** ముందుగా అల్లం, వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకొని పెట్టుకోవాలి. ఆపై మిగిలిన పదార్థాలనినంటినీ ఒక బౌల్‌లో వేసి నీళ్లు పోస్తూ బజ్జీల పిండిలా జారుడుగా కలుపుకోవాలి. ఆ తర్వాత నూనె వేడి చేసి ఈ మిశ్రమాన్ని మనకు నచ్చిన సైజులో బజ్జీల్లా వేతసుకొని వేయించుకోవాలి.

## వ్యథ

## కౌన్సెలింగ్ ద్వారా కొందరిని మార్చలేము !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న :** నా భర్త బాగా చదువుకుని ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారిగా పనిచేస్తున్నారు..ఆయన ప్రవర్తనలో కొన్ని లోపాలు ఉన్నాయి. నన్ను ఒక బానిసలా చూస్తారు. నాతో పాటు ఇతర మహిళల శీలాన్ని కూడా అనుమానిస్తుంటారు. తనను తాను చాలా గొప్పగా భావిస్తారు. ఎదురు చెప్పినా సహించరు. నేను యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. మాకు ఒకటే అమ్మాయి. ఆమె ఇంటర్ చదువుతోంది. ఆమెపై కూడా అనవసర అనుమానాలు పెంచుకుని కఠినమైన నియమాలు పెడుతున్నారు. దీనివల్ల ఆమె కూడా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతోంది.ఇలాంటి వ్యక్తిని కౌన్సెలింగ్ ద్వారా మార్చడం సాధ్యమా? - ఒక సోదరి, తిరుపతి

**జవాబు:** మనుషుల ఆలోచనలు, ప్రవర్తనలను మార్చడంలో కౌన్సెలింగ్ ప్రభావవంతమైన పద్ధతి. అయితే ప్రతి వ్యక్తిని పూర్తిగా మార్చడం ఎప్పుడూ సాధ్యం కాదు. ఎందుకంటే కొంతమంది వ్యక్తుల వ్యక్తిత్వ లక్షణాలు చాలా గట్టిగా ఏర్పడి పోతాయి. చిన్ననాటి అనుభవాలు, కుటుంబ వాతావరణం, వ్యక్తిగత నమ్మకాలు, అలవాట్లు కలిసి ఒక వ్యక్తి స్వభావాన్ని నిర్మిస్తాయి. సైకాలజిస్టుల అనుభవం ప్రకారం కొన్ని రకాల వ్యక్తులను మార్చడం చాలా కష్టం. ఉదాహరణకు అహంకార వ్యక్తిత్వం ఉన్న వారు తామే గొప్పవాళ్లమని నమ్ముతారు. తమ తప్పులను ఒప్పుకోరు. ఇతరులను తక్కువగా చూస్తారు. విమర్శను సహించలేరు. అసాంఘిక వ్యక్తిత్వం స్వభావం ఉన్న వ్యక్తులు ఇతరుల భావాలను పట్టించుకోరు. అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం, హింసాత్మక ప్రవర్తన అలవాటుగా ఉంటుంది. తమ చర్యలకు పశ్చాత్తాపం కూడా చూపరు. అనుమాన వ్యక్తిత్వం కలిగివారిలో అనుమానం ఎక్కువగా ఉంటుంది. ఇతరులపై నమ్మకం ఉండదు,. చిన్న విషయాన్ని కూడా కుట్రగా భావించే స్వభావం ఉంటుంది. సంకుచిత అభిప్రాయాలు ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయం మాత్రమే సరైందని భావిస్తారు. కొత్త ఆలోచనలను అంగీకరించరు. ఇతరుల మాట వినరు. బాధ్యతా రహిత స్వభావులు తమ తప్పులకు ఇతరులనే బాధ్యుల్ని చేస్తారు. సమస్యలకు తాము కారణమని అంగీకరించరు. మారడానికి ప్రయత్నం చేయరు. ఇలాంటి వ్యక్తులను వారి సమ్మతి లేకుండా మార్చడం చాలా కష్టం. ఎందుకంటే మొదట వారు తమలో సమస్య ఉందని ఒప్పుకోరు. రెండవది మారాలనే ఆసక్తి ఉండదు. మారాలనే కోరిక లేకపోతే ప్రపంచంలో ఉన్న ఉత్తమ సైకాలజిస్టు కూడా వారిని మార్చలేరు. సమాజంలో అనేక కుటుంబ సమస్యలకు వ్యక్తిత్వ లక్షణాలే కారణమవుతుంటాయి. అందుకే ప్రతి వ్యక్తి తనలోని లోపాలను గుర్తించి మారడానికి సిద్ధంగా ఉండాలి. స్వీయ అవగాహన ఉన్నప్పుడు మాత్రమే నిజమైన మార్పు ప్రారంభమవుతుంది. కాబట్టి మీరు ఆయనతో వ్యవహరించేటప్పుడు మెలుకువగా ఉండడం, అవసరమైతే కుటుంబ కౌన్సెలింగ్ ప్రయత్నించడం మంచిది.

## శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది

తెలుగు సంస్కృతిలో కాలగణన అనేది కేవలం అంకెలు కాదు, అది ఒక నిరంతర ప్రవాహం. మన తెలుగు పంచాంగం ప్రకారం 60 సంవత్సరాల చక్రం ఉంటుంది. అందులో 40వ సంవత్సరమే 'పరాభవ'. 'పరాభవ' అంటే లోక రీత్యా 'అవమానం' అనే అర్థం స్ఫురించినప్పటికీ, ఆధ్యాత్మికంగా ఇది అహంకారాన్ని పారద్రోలి, వినయాన్ని ప్రసాదించే కాలం అని అర్థం. ఉగాది అంటే 'యుగము' + 'ఆది'. బ్రహ్మదేవుడు చైత్ర శుద్ధ పాడ్యమినాడు సూర్యోదయ సమయంలో సృష్టిని ప్రారంభిం 'చాడని 'చతుర్వర్గ చింతామణి' వంటి గ్రంథాలు చెబుతున్నాయి. వేదాలను దొంగిలించిన సోమకాసురుడిని సంహరించి, మత్స్యావతారంలో ఉన్న విష్ణుమూర్తి తిరిగి బ్రహ్మకు వేదాలను అప్పగించింది ఉగాది రోజే. విక్రమాదిత్యుని విజయం తర్వాత శాలివాహన శకం ఈ రోజు నుండే ప్రారంభమైంది. అందుకే దీనిని చైత్ర శుక్ల ప్రతిపద ('ప్రతిపద' అంటే మొదటిది లేదా తొలి అడుగు అని అర్థం. తిథి పరంగా ఆలోచిస్తే ప్రతి పక్షంలో వచ్చే మొదటి తిథిని 'ప్రతిపద' అం టారు. దీనినే వాడుక భాషలో మనం 'పాడ్యమి' అని పిలుస్తాము.)అని కూడా అంటారు. పరాభవ నామ సంవత్సర విశిష్టత గురించి తెలుసుకుం దాం. ప్రతి ఉగాదికి ఒక పేరు ఉంటుంది. ఈ 60 సంవత్సరాల పేర్లకు ఒక్కో అర్థం ఉంది. 'పరాభవ సంవత్సరంలో జన్మించిన వారు లేదా ఈ కాలంలో జీవించే వారు పట్టుదల కలిగి ఉంటారని, ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉం టుందని జ్యోతిష్య శాస్త్రం చెబుతోంది. ఈ ఏడాది వానలు, పంటలు ఎలా ఉంటాయో పంచాంగ శ్రవణం ద్వారా తెలుసుకోవడం ఆనవాయితీ. పరాభవ నామ సంవత్సరంలో లోక కల్యాణం కోసం శాంతి పూజలు నిర్వహించడం శుభకరం. ఉగాది పచ్చడి కేవలం రుచి కోసం చేసేది కాదు. ఇది మానవ జీవితంలోని ఆరు ప్రధాన రుచుల సమ్మేళనం మరియు ఆరోగ్య ప్రదాయిని . తీపి కొత్త బెల్లం సుఖ సంతోషాలు మధుర స్మృతులు. పులుపు చింతపండు నేర్పుగా వ్యవహరించాల్సిన చిక్కు ముడులు. చేదు వేపపూత అనుకోకుండా వచ్చే కష్టాలు, సవాళ్లు. ఉప్పు ఉప్పు జీవితం రుచికరం గా ఉండటానికి కావాల్సిన ఉత్సాహాన్ని స్తుంది. కారం పచ్చిమిర్చి ఆవేశం, కోపం, పౌరు షాల మిళితం. వగరు లేత మామిడి కొత్తదనా నికి చిహ్నం, ఆశ్చర్యకర మైన మార్పులు. ఈ ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యాలు కూడా దాగి ఉన్నాయి. వసంత కాలంలో శరీరంలో 'వాత, పిత్త, కఫ' దోషాలు సమతుల్యంగా ఉండవు. వేప పూత రక్తశుద్ధిని చేస్తుంది, చింతపండు జీర్ణక్రియను మెరుగుపరు స్తుంది, బెల్లం శక్తిని ఇస్తుంది. ఇదొక సహజ సిద్ధమైన 'డీటాక్స్' పానీయం. పంచాంగ శ్రవణం కాల జ్ఞానాన్ని ఎలా సూచిస్తుందో తెలుసు కుందాం. ఉగాది నాడు కొత్త పంచాంగాన్ని పూజించి, పండితుల ద్వారా వినడం అత్యంత ముఖ్యం. ఇందులో ఐదు భాగాలు (తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు) ఉంటాయి. ఆదాయ వ్యయాలు ప్రతి రాశి వారికి ఈ ఏడాది ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేస్తారు. రాజ పూజ్యం అవమానాల సామాజిక హోదా ఎలా



ఉంటుందో వివరిస్తారు. లోక రీతి దేశంలో వర్ష పాతం, రాజకీయ మార్పులు, వ్యాధుల ప్రబలత వంటి అంశాలను ముందుగానే అంచనా వేస్తారు. ఇతర రాష్ట్రాలలో వైవిధ్య భరితంగా ఎలా చేస్తారు. భారతదేశం అంతటా ఈ నూతన సంవత్సర వేడుకలు వివిధ రూపాల్లో జరుగు తాయి. మహారాష్ట్రలో గుడి పడ్వా అని చేస్తారు. వీరు ఇంటి ముందు 'గుడి' అంటే విజయ కేతనం ఎగురవేస్తారు. సింధీలు 'చేతీ చాంద్' అని చేస్తారు. వరుణ దేవుని ఆరాధిస్తూ ఈ పండుగ జరుపుకుంటారు. మణిపూర్‌లో 'సజీబు నోంగ్మా పాన్బాకొండ' పేరుతో చేస్తారు. ఈరోజు దేవతలను పూజి స్తారు. ఇండోనేషియాలో 'బాలి' అని చేస్తారు. అక్కడ కూడా 'న్యేపి' పేరుతో మోనంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటారు. ఇలా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల సాంప్రదాయ పద్ధతుల్లో ఉగాది పండుగను జరుపుకుంటారు. ఇప్పుడు పూజా విధానం గురించి తెలుసుకుందాం. అభ్యంగన స్నానం అంటే నువ్వుల నూనె రాసుకుని తలస్నానం చేయడం వల్ల లక్ష్మీదేవి కటాక్షం కలుగుతుందని నమ్మకంతో ఉదయాన్నే తలస్నానం చేస్తారు. ఇంటి ద్వారాలకు మామిడి ఆకులు, వేప కొమ్మలతో తోరణాలు కట్టడం వల్ల గాలి శుద్ధి అవుతుంది, దుష్టశక్తులు రాకుండా ఉంటాయని ఇంటి గుమ్మాలను తోరణాలతో అలంకరిస్తారు. షోడశోపచార పూజ చేస్తారు. అంటే ఇష్ట దైవానికి ధూప, దీప, నైవేద్యాలు (ముఖ్యంగా ఉగాది పచ్చడి,బొబ్బట్లు) సమర్పి స్తారు. పితృదేవతలను స్మరించుకోవడం కూడా కొన్ని ప్రాంతాల్లో ఆచారంగా ఉంది.సామాజిక కోణంలో ఆలోచిస్తే అనేక ప్రాంతాలలో, దేవాల యాల్లో కవి సమ్మేళనాలు జరుగుతాయి. తెలుగు సాహిత్యంలో ఉగాదికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం రాజుల కాలం నుండి నేటి వరకు ఉగాది నాడు కవి సమ్మేళనాలు నిర్వహించడం ఆన వాయితీ. ప్రకృతిని వర్ణిస్తూ, సమాజంలోని మార్పులను ఎండగడుతూ కవులు తమ కవి త్వాన్ని వినిపిస్తారు. ఇది అక్షరానికి, మేధస్సుకు ఇచ్చే గొప్ప గౌరవం. కవులకు సత్కారం కూడా



చేస్తారు. పరాభవనామ సంవ త్సరం పరివర్తనకు నాంది పలుకుతూ మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది. పేరులో పరాభవం ఉన్నా, అది మనలోని దుర్గుణాలకు పరాభవం కలగాలని, సద్గుణాలు విజయం సాధించాలని కోరుకోవాలి. కొత్త చిగురులా పాత జ్ఞాపకాలను వదిలేసి, కొత్త ఆశలతో జీవితాన్ని ప్రారంభించ డమే ఉగాది పండుగ యొక్క పరమార్థం. ఈ పరాభవ నామ సంవత్సరంలో పరాభవాలు యుద్ధాలు అశాంతిలు అన్నీ తొలగిపోయి మనందరికీ విజయాలు కలగాలని కోరుకుంటూ స్నేహితులందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు జేజేలు వందనాలు.

- పింగళి భాగ్యలక్ష్మి.

## పూజకి ముస్తాబు



ప్రతి పండక్కి పూజగదికి చేసే అలంకరణే ప్రత్యేక ఆకర్షణగా నిలు స్తుంటుంది. ఉగాది రోజున కూడా దీన్ని కొన సాగిస్తుంటాం. ఉదయాన్నే చక్కగా తల స్నానం చేసిన తర్వాత పూజ గదిని శుభ్రం చేసి ముగ్గులు వేయాలి. ఆపై దేవుడి విగ్రహాలను శుభ్రం చేసి.. పసుపు, కుంకుమ, పూలతో అలంకరించాలి. అనంతరం గది గుమ్మానికి పచ్చటి మామిడాకులు కట్టి, పూలదండలతో అలంకరిం చాలి.ఇందులోనూ కాస్త వైవిధ్యం కోరుకునే వారు పూలు, మామిడాకులు కలిపి సరికొత్తగా లభిస్తున్న తోరణా లను ఇంటి గుమ్మానికి, పూజ గది గుమ్మానికి వేలాడదీస్తే పండగ శోభ ఉట్టిపడుతుంది. రాత్రిపూట శోభా యమానంగా కనిపించ డానికి, చిన్న చిన్నఫ్లోరసెంట్ బల్బులను కూడా మందిరానికి అమర్చవచ్చు.. అలాగే గుమ్మాలకు టెర్రాకోటాతో రూపొందించిన డోర్ హ్యాంగింగ్స్‌ని కూడ వేలాడదీయచ్చు. ఇక సాధారణంగా పూజగదిలో రోజూ ఇత్తడి సామగ్రిని ఉపయోగించడం మనకు అలవాటు! అయితే ఈ పండగ రోజున మీకు వీలుంటే వీటికి బదులుగా వెండి, రాగి వంటి వస్తువుల్ని వాడచ్చు.

## వనజీవి దరిపల్లి రామయ్య బయోపిక్



రామయ్యగా ప్రసిద్ధి చెందిన వనజీవి దరిపల్లి రామయ్య జీవిత కథ వెండితెరపైకి వచ్చింది. సమాజానికి పర్యావరణ సందేశాన్ని అందించిన ఈ మహనీయుడి జీవితం ఆధారంగా రూపొందిన వనజీవి రామయ్య బయోపిక్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే గద్దర్ అవార్డుల్లో బెస్ట్ షార్ట్ ఫిలిమ్స్ విభాగంలో ఎంపికైంది. తాజాగా చిత్రయూనిట్ హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ప్రత్యేక ప్రివ్యూ ప్రదర్శన నిర్వహించిందిఈ చిత్రాన్ని భారతీయ భాషల్లో కూడా విడుదల చేయాలని నిర్ణయించినట్లు చిత్ర బృందం వెల్లడించింది. దర్శకుడు వేముగంటి మాట్లాడుతూ, కోటి మొక్కలు నాటి ప్రకృతికి సేవ చేసిన రామయ్య గారి జీవితం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దరిపల్లి రామయ్య పర్యావరణ పరిరక్షణలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. 'వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ఊరూరూ తిరిగిన ఆయన, పద్మశ్రీ అవార్డు వచ్చింది. శుభకార్యాల్లో మొక్కలను బహుమతులుగా ఇవ్వడం ద్వారా సరికొత్త ఆచారాన్ని నెలకొల్పారు. చెట్ల గింజలను సేకరించి అటవీ ప్రాంతాల్లో చల్లడం ఆయన నిత్యకృత్యంగా ఉండేది.

## తెర

## ఉగాదిన 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదల



'ఉస్తాద్ భగత్ సింగ్' చూసిన ప్రతి ఒక్కరూ అనుకుంటారు: ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్‌ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్' రూపంలో ఒక మంచి తెలుగు సినిమా వస్తుంది: కథానాయిక శ్రీలీల 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా కాగా, ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఉగాది కానుగా మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చిత్ర బృందం, ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను నిర్వహించింది. ఈ సందర్భంగా కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ మాట్లాడుతూ.. "ముందుగా మీడియా మిత్రులకు కృతజ్ఞతలు. చాలా రోజుల తరువాత మిమ్మల్ని ఇలా కలవడం సంతోషంగా ఉంది. ఈ ఉగాది 'ఉస్తాద్ భగత్ సింగ్' కాబోతుంది. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లా డుతూ.. "చాలా చాలా సంతోషంగా ఉంది. పవన్ కళ్యాణ్ గారితో సినిమా చేయాలనేది మా కల. అది ఉస్తాద్ భగత్ సింగ్‌తో నెరవేరింది. ఐదారేళ్ళ క్రితం సినిమా చేయాలనుకున్నాము. కోవిడ్, పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం వంటి కారణాల వల్ల.. గతేడాది జూన్ లో సినిమా ప్రారంభించాము. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. "ముందుగా అందరికీ ఉగాది శుభాకాంక్షలు. తెలుగు నూతన సంవత్స రాది కానుకగా మా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదలవుతుండటం మాకు చాలా చాలా ప్రత్యేకం. సినిమా పట్ల మేము చాలా నమ్మకంగా ఉన్నాము.

## జాక్ పాట్ కొట్టిన రియా కపూర్..



ఏకంగా 4వేల కోట్ల బడ్జెట్ మూవీలో! భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమాలో నటించే ఛాన్స్ రావడం అంటే మామూలు విషయం కాదు. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమాలో నటించే ఛాన్స్ రావడం అంటే మామూలు విషయం కాదు. తాజాగా నటి రియా కపూర్ ఈ మెగా ప్రాజెక్టులో తాను భాగమయ్యానని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. రణబీర్ కపూర్ సరసన కీలక సీన్లలో కనిపిస్తానని ఆమె చెప్పడంతో సోషల్ మీడియాలో ఒక్కసారిగా చర్చ మొదలైంది. అసలు ఆమె పోషిస్తున్న పాత్ర ఏంటి? ఫ్యాన్స్ ఏమనుకుంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. రణబీర్ కపూర్‌తో స్క్రీన్ షేరింగ్: రణబీర్ కపూర్ 'రాముడి' పాత్రలో నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో తనకు చాలా ముఖ్యమైన రోల్ దక్కిందని రియా కపూర్ స్వయంగా వెల్లడించింది. కేవలం చిన్న పాత్ర మాత్రమే కాకుండా, కథను మలుపు తిప్పే కీలక సన్నివేశాల్లో తాను కనిపిస్తానని ఆమె పేర్కొంది. ఇక ముఖ్యంగా రణబీర్ కపూర్‌తో కలిసి నటించే సీన్స్ సినిమాకు హైలైట్‌గా ఉంటాయని చెప్పడంతో అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిగిపోయింది. అయితే తన క్యారెక్టర్ పేరును మాత్రం ఆమె ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచింది. ఇంటర్వెల్‌లో స్నాక్స్ సరిపోవు..ఫుల్ మీల్స్ ఆర్డరివ్వాలి సోషల్ మీడియాలో ఫ్యాన్ థియరీస్: రియా కపూర్ ప్రకటన వచ్చినప్పటి నుండి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రామాయణంలో ఆమె ఏ పాత్రలో కనిపించవచ్చు అనే దానిపై ఫ్యాన్స్ చర్చించుకుంటున్నారు.

## చంద్రబోస్ ఆవిష్కరించిన 'ధర్మస్థల నియోజకవర్గం' లిరికల్ సాంగ్



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం 'ధర్మస్థల నియోజక వర్గం'. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేర్ను భాస్కర్ నిర్మిస్తోన్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం.. ప్రస్తుతం షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపు కుంటోంది. ఈ చిత్ర మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ఇటీవలే మేకర్స్ ప్రారంభించారు. ఈ పాట ఆవిష్కరణ అనంతరం లిరిసిస్ట్ చంద్రబోస్ మాట్లాడుతూ.. 'ధర్మస్థల నియోజకవర్గం ' కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది. ఈ సినిమాలో 'న్యాయం చేయరా దేవుడా..' అనే లిరికల్ సాంగ్‌ని విడుదల చేసినందుకు సంతోషంగా ఉంది. చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. 'న్యాయం చేయరా దేవుడా..' పాటకు లిరిక్స్ అందించడమే కాకుండా, మేము అడగగానే ఆవిష్కరించిన ఆస్కార్ విజేత చంద్రబోస్ గారికి మా టీమ్ తరపున ధన్య వాదాలు తెలుపుకుంటున్నాము. సంగీత దర్శకుడు మహావీర్ ఎల్లెందర్ మాట్లాడుతూ.. నేను సంగీతాన్ని అందించిన ధర్మ స్థల నియోజక వర్గం సినిమా నుండి ఈ రోజు ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్ర బోస్ గారు స్వరపరిచిన న్యాయం చేయరా దేవుడా సాంగ్ ఆయన చేతుల మీదుగా విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

## అవార్డ్‌లు గెల్చుకున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న నటించిన ది గర్ల్ ఫ్రెండ్ సినిమా వరుసగా అవార్డ్స్ సొంతం చేసుకుంటోంది. ఇటీవలే ఈ సినిమాకు ఉత్తమ నటిగా రశ్మిక గద్దర్ అవార్డ్ సొంతం చేసుకుంది. ఇక తాజాగా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఉగాది పురస్కారాల్లో ఈ సినిమాకు మూడు అవార్డ్స్ దక్కాయి. చెన్నైలో జరిగిన శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ 28వ ఉగాది పురస్కారాల్లో ఉత్తమ నటిగా రశ్మిక, ఉత్తమ విలన్ గా దీక్షి త్ శెట్టికి అవార్డ్స్ దక్కాయి. ఉత్తమ రచన, దర్శకత్వం విభాగంలో బాపు రమణల పురస్కారం దర్శకుడు రాహుల్ రవీంద్రన్ గెల్చుకున్నారు. దీక్షి త్ శెట్టి, రాహుల్ రవీంద్రన్ ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డ్స్ స్వీకరించారు. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందించారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహించారు.

## 'హ్యాపీ రాజ్' ఫస్ట్ సింగిల్ అద్దిరా లెక్క రిలీజ్

స్టార్ కంపోజర్‌హీరో జివి ప్రకాష్ కుమార్ అప్ కమింగ్ మూవీ 'హ్యాపీ రాజ్'. హీరో డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియా రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై జైవర్ధ నిర్మించారు. మ్యాడ్ ఫేం శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్ గా నటిచింది. మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్పీ ద్వారా మార్చి 27న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సృష్టిస్తోంది, ఇటివల విడుదలైన పోస్టర్ కి అద్భుత మైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'అద్దిరా లెక్క" సాంగ్ రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకరన్ అదిరిపోయే బీట్స్‌తో ఈ సాంగ్‌ని కంపోజ్ చేశారు. గాయకుడు గోవింద్ ప్రసాద్ ఎనర్జీతో పాడిన ఈ పాటకు రెహ్మాన్ రాసిన లిరిక్స్ మంచి వైబ్ తీసుకొచ్చాయి.ఈ సాంగ్‌లో జివి ప్రకాష్ కుమార్ చేసిన డ్యాన్స్ మూమెంట్స్ స్పెషల్ హైలైట్‌గా నిలిచాయి. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, స్టెప్స్ అన్నీ కలిసి సాంగ్‌ను మరింత ఎంటర్టైనింగ్‌గా మార్చాయి.రిలీజ్ అయిన వెంటనే ఈ సాంగ్ సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ అందుకుంటూ, ఇన్సంట్ హిట్‌గా మారింది.




# ఐపిఎల్‌లో అన్ లక్కీ హీరోలు

## రన్ అవుట్ జాబితాలో దిగ్గజాలు.. అగ్రస్థానంలో హెడ్‌కోచ్ గంభీర్

**న్యూఢిల్లీ:** మరో పది రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 సందడి మొదలవ్వనుంది. ఈ నెల 28న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అయితే ఇదే సమయంలో ఈ మెగా టోర్నీ చరిత్రలో రన్ అవుట్‌కు సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా బ్యాటర్లకు అత్యంత భారంగా అనిపించే రన్ అవుట్ గణాంకాలను గమనిస్తే పలువురు దిగ్గజ ఆటగాళ్ల పేర్లు ఆ జాబితాలో ఉండటం విశేషం. క్రీజులో ఒక్క పరుగు కోసం ఆశపడి లేదా తోటి బ్యాటర్‌తో సమన్వయ లోపం కారణంగా విలువైన వికెట్లను సమర్పించుకున్న వారిలో టీమిండియా ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అగ్రస్థానంలో నిలిచాడు. గంభీర్ తన ఐపీఎల్ ప్రస్థానంలో ఆడిన 154 మ్యాచ్‌ల్లో ఏకంగా 16 సార్లు రన్ అవుట్ అయ్యి ఈ అన్‌లక్కీ రికార్డును మూటగట్టుకున్నాడు. గంభీర్‌తో పాటు టీమిండియా మాజీ స్టార్ ఓపెనర్







శిఖర్ ధావన్ కూడా ఇదే తరహాలో 16 సార్లు రన్ అవుట్ అయ్యి మొదటి స్థానాన్ని పంచుకున్నాడు. 2008 నుంచి 2024 వరకు సాగిన తన సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌లో ధావన్ 222 మ్యాచ్‌లు ఆడి అనేకసార్లు పరుగుల కోసం ప్రయత్నిస్తూ వికెట్ పారేసుకున్నాడు. వీరిద్దరూ క్రీజులో పరుగుల వేటలో ఎంత వేగంగా దూసుకెళ్తారో, కొన్నిసార్లు అంతే వేగంగా దురదృష్టవశాత్తూ అవుట్ అవ్వడం విశేషం. మైదానంలో అత్యంత చురుగ్గా ఉండే ఈ ఆటగాళ్లే రన్ అవుట్లలో టాప్ ప్లేస్‌లో ఉండటం గమనార్హం. ఈ జాబితాలో తర్వాతి స్థానంలో సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ దినేష్ కార్తీక్ నిలిచాడు. మొత్తం 257 మ్యాచ్‌లు ఆడిన కార్తీక్, తన కెరీర్‌లో 15 సార్లు రన్ అవుట్ అయ్యాడు. సాధారణంగా కార్తీక్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లలో బ్యాటింగ్‌కు వస్తుంటాడు. ఆ సమయంలో స్కోరు బోర్డును పరుగుల ఒత్తిడిలో వేగంగా సింగిల్స్, డబుల్స్ తీయబోయి రన్ అవుట్‌గా వెనుదిరిగేవాడు. ఫినిషర్‌గా జట్టుకు భారీ స్కోరు అందించే క్రమంలో ఆయన ఈ చేదు అనుభవాన్ని పదిహేను సార్లు చవిచూశాడు. కేవలం కార్తీక్ మాత్రమే కాకుండా టీమిండియా ఆటగాళ్లు సురేష్ రైనా, అంబటి రాయుడు కూడా ఈ రన్ అవుట్ల గండం నుంచి తప్పించుకోలేకపోయారు. రైనా 205 మ్యాచ్‌ల్లో, రాయుడు 204 మ్యాచ్‌ల్లో చెరో 15 సార్లు రన్ అవుట్ అయ్యి కార్తీక్‌తో సమానంగా రెండో స్థానంలో నిలిచారు. ఐపీఎల్ 2026లో మరికొన్ని కొత్త నిబంధనలు వస్తున్న తరుణంలో, ఈ రన్ అవుట్ల సంఖ్య తగ్గుతుందో లేదో చూడాలి.

# వరల్డ్ చాంప్ అంతిమ్ ఓటమి

**న్యూఢిల్లీ:** రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత అయిన అంతిమ్ పంఘల్ ఓటమితో 2026 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో అర్హత నుంచి అనూహ్యంగా నిష్క్రమించింది. దీంతో భారత జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది. మహిళల 53 కేజీల ఫైనల్లో, స్కోరు బోర్డుపై 2-6తో వెనుకబడిన ఆమె, చివరి క్షణాల్లో 25 ఏళ్ల మీనాక్షి చేతిలో పిన్‌ఫాల్‌తో ఓడిపోయింది. అంతిమ్ ప్రయత్నించిన అన్ని మూవ్స్‌ను మీనాక్షి సమర్థవంతంగా తిప్పికొట్టి, తొలిసారిగా సీనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌కు తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆమె ఈ సంవత్సరం కూడా తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, ప్రో రెజ్లింగ్ లీగ్‌లో పర్ఫెక్ట్ రికార్డు సాధించి, ఆ తర్వాత ముహమెట్ మాలో ర్యాంకింగ్ సిరీస్‌లో రజత పతకాన్ని గెలుచుకుంది. ఇక హెవీవెయిట్ విభాగం మహిళల 76 కేజీల ఫైనల్‌లో ఫేవరెట్‌గా ఉన్న ప్రియా మాలిక్‌ను కాజల్ ధోచక్ వెనుక నుండి వచ్చి 4-2 తేడాతో ఓడించింది. మరోవైపు, నీలం సిరోహి (50 కేజీలు), మనీషా భాన్వాలా (57 కేజీలు) వంటి ఇతర అగ్రశ్రేణి రెజ్లర్లు ఆధిక్యతతో గెలుపొందారు. డిఫెండింగ్ ఛాంపియన్ మనీషా ఈసారి 62 కేజీల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది. మరోవైపు, మాజీ ప్రపంచ పతక విజేత మాన్సీ అహ్లావత్, సవిత, భాగ్యశ్రీ ఫాండ్‌లపై విజయాలు సాధించి 62 కేజీల వెయిట్ క్లాస్‌లో స్థానం సంపాదించారు.



మరోవైపు, గాయం కారణంగా నిషా దహియా ఎంపిక ట్రయల్స్ నుండి వైదొలగడంతో, 68 కేజీల వెయిట్ క్లాస్‌లో మాన్సీ లాథర్ స్థానం సంపాదించింది.




**న్యూఢిల్లీ:** ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ సత్తా చాటారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టీమిండియా ప్లేయర్లు టాప్ 5లో ఏకంగా మూడు స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మహిళల విభాగంలో స్టార్ ఓపెనర్, మహిళా టీం వైస్ కెప్టెన్ స్మృతి మంధాన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కివర్‌బ్రంట్ రెండో స్థానంలో, భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదో స్థానంలో నిలిచి టాప్5లో చోటు సంపాదించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ, దక్షిణాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్ కూడా మెరుగైన ర్యాంకులు సాధించారు. ఇక పురుషుల విషయంలో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, భారత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచి తన ఫామ్‌ను చాటుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో, భారత కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానంలో, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచారు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నారు. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ తర్వాతి స్థానాల్లో నమీబియాకు చెందిన బెర్నార్డ్ స్కోల్జ్ నాలుగో స్థానంలో నిలిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో కూడా ఆఫ్ఘనిస్తాన్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ మొదటి స్థానంలో ఉండగా, సికందర్ రజా (జింబాబ్వే), మహ్మద్ నబీ (ఆఫ్ఘనిస్తాన్) టాప్3లో నిలిచారు.

# సింగపూర్ నేషనల్స్‌లో.. ఆస్థాకు రజతం

**న్యూఢిల్లీ:** సింగపూర్ నేషనల్స్ ఏజ్ గ్రూప్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన ఆస్థా చౌదరి 200 మీటర్ల బటర్‌ఫ్లైలో అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసింది. నాలుగేళ్ల క్రితం అపేక్ష ఫెర్నాండెజ్ నెలకొల్పిన 2:18.18 సెకన్ల రికార్డును 22 ఏళ్ల ఈమె ఒక సెకనుకు పైగా మెరుగుపరిచి, సూపర్ ఫైనల్‌లో 2:17.09 సెకన్లతో రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. జపాన్‌కు చెందిన మత్సురాయు (2:15.91 సెకన్లు) వెనుక నిలిచి, ఓవరాల్ విభాగంలో ఆమె స్వర్ణ పతకాన్ని కోల్పోయినప్పటికీ, ఆస్థా ఆశాజనకమైన ఆరంభాన్ని పొందింది. అయితే మత్సురాయు ప్రధానంగా అండర్ 17 విభాగంలో పోటీ పడటంతో, ఆస్థా కూడా 18 ఏళ్లు పైబడిన వారి విభాగంలో అగ్రస్థానంలో నిలిచి, సీనియర్ విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఈ రోజు అంతకుముందు జరిగిన ప్రిలిమినరీ రౌండ్‌లో ఆస్థా 2:18.37 సెకన్ల సమయాన్ని నమోదు చేసి, తన హీట్‌లో మొదటి స్థానంలో నిలిచి సూపర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అంతకు ముందు భారత్ మరో 3 పతకాలను కైవసం చేసుకుంది. షిరిన్ (1500మీ ఫ్రీస్టైల్), శ్రీహరి నటరాజ్ (100మీ బ్యాక్‌స్ట్రోక్) రజత పతకాలను గెలుచుకోగా, సాజన్ ప్రకాష్ 200మీ ఇండివిడ్యువల్ మెడ్లేలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.



# వరల్డ్ బాక్సింగ్ కప్.. చంద్రికకు టైటిల్

**న్యూఢిల్లీ:** వరల్డ్ బాక్సింగ్ ఫ్యూచర్స్ కప్-2026 మహిళల 51 కేజీల టైటిల్‌ను చంద్రిక పూజారి కైవసం చేసుకుంది. దీంతో బ్యాంకాక్‌లో జరిగిన ఈ పోటీల్లో భారత్ ఒక స్వర్ణం, మూడు రజతాలు, ఒక కాంస్యంతో సహా ఐదు పతకాలను సాధించి తన ప్రచారాన్ని ముగించింది. మహిళల 51 కేజీల ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన చంద్రిక ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మర్దోనోవా నజోకాట్‌ను ఓడించింది. యూత్ ఒలింపిక్ వెయిట్ కేటగిరీలలో తమతమ విభాగాలలో ఫైనల్స్‌కు చేరిన ముగ్గురు భారత బాక్సర్లు రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. గుంజన్ (48 కేజీలు) ఇంగ్లాండ్‌కు చెందిన తన ప్రత్యర్థి చేతిలో 5-0 తేడాతో ఓడిపోగా, జయశ్రీ దేవి (54 కేజీలు) గట్టిగా పోరాడినా అమెరికాకు చెందిన బాక్సర్ చేతిలో 4-1 తేడాతో పరాజయం పాలయింది. పురుషుల 50 కేజీల విభాగంలో, ఎల్. అంబేకర్ మీతేయ్ కూడా ఉక్రెయిన్‌తో జరిగిన తన చివరి బౌట్‌లో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకున్నాడు. అంతకు ముందు ఉక్రెయిన్‌కు చెందిన యెవాన్‌హెలినా పెట్రుక్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో సెమీఫైనల్స్‌లో నిష్క్రమించిన తర్వాత రాధామణి లాంగ్‌జామ్ (57 కేజీలు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.



# లాభాల్లో హ్యాట్రిక్ కొట్టిన సెన్సెక్స్, నిఫ్టీ షేర్లు

## రూ.6 లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద



**ముంబయి, మార్చి 18:** దేశీ ఈక్విటీమార్కెట్లు బుధవారం భారీ లాభాల దిశగా దూసుకుపోయాయి. వరుసగా మూడోరోజు కూడా లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీలు హ్యాట్రిక్ కొట్టాయి. ఇన్వెస్టర్ల సంపద ఏకంగా ఆరు లక్షలకోట్లు పెరిగింది. బిఎస్‌ఇలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువలు ఒక్కసారిగాపెరిగి 439 లక్షలకోట్లకు పెరిగింది. ఇన్వెస్టర్లు ఎక్కువగా ఫెడరి జర్వ్ పాలసీ నిర్ణయాలపైనే ఫోకస్ పెంచారు.బిఎస్ఇ సెన్సెక్స్ 633.29 పాయింట్లుపెరిగి 76,704.13 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 196.65 పాయింట్లుపెరిగి 23,777.80 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.87శాతం, నిఫ్టీ 2.71శాతం చొప్పున లాభపడ్డాయి. ఇన్ఫోసిస్ 2.74శాతం,మహీంద్ర అండ్ మహీంద్ర 2.66శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.53శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 1.80శాతంపెరిగితే బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 2.05శాతం పెరిగింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 3202 కంపెనీలషేర్లుపెరిగితే 1088 షేర్లుక్షీణించాయి. 147 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి రికార్డుకనిష్టానికి క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 92.65కి చేరింది. గత ముగింపు 94.20తో పోలిస్తే మరింతగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌నెల నాటి సెటిల్‌మెంట్లు 0.39శాతం క్షీణించి రూ. 1,55,370కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మేనెల సెటిల్ మెంట్లు 15 సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 103.57 డాలర్లుగా కొనసాగింది. ఎల్ అండ్‌టి 1.75శాతంపెరిగిటే అర్బన్‌కంపెనీ కూడా 10.33వాతం పెరిగింది. బొడాడా ఇంజనీరింగ్ 3.07శాతం, స్ట్రైడ్స్ ఫార్మా సైన్స్ 3.29శాతం పెరిగింది. మాన్‌కైండ్ ఫార్మాకూడా 1.72శాతంపెరిగింది. ప్రెసి షన్ వైర్స్ ఇండియా 6.51శాతం పెరిగితే ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ 0.16శాతం క్షీణించింది. ఫ్రాక్టల్ ఎనలిటిక్స్ మాత్రం 1.19శాతంపెరిగింది. ఇక ఐపిఒలపరంగా జిఎస్‌పి క్రాప్‌సైన్స్ ఐపిఒ బిడ్డింగ్‌లో 1.60రెట్లు కొనుగోళ్లుజరిగినట్లు తేలింది. ఐపిఒ ధరలు రూ.304నుంచి 320గా కంపెనీ నిర్ణయించిన సంగతి తెలిసిందే.




## చమురు మార్కెట్లు అతలాకుతలం బ్యారెల్ ముడిచమురు 103 డాలర్లు

**టెహ్రాన్, మార్చి 18:** ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ భద్రతా వ్యవహారాల వ్యూహకర్త అలీ లారిజానీ మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ప్రపంచ చమురు మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. కొన్ని గంటల వ్యవధిలోనే బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 103 డాలర్లను దాటి, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఆందోళనలకు కారణమైంది. లారిజానీ మరణానికి ప్రతీకారంగా హార్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ఇప్పటికే అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో ఈ ప్రాంతంలో భారీ బాంబు దాడులు నిర్వహిస్తుండటంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. సప్లై చైన్ దెబ్బతినే ప్రమాదం ఉండటంతో చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఆధార్‌తో పాన్ దరఖాస్తు మార్చి 31 వరకే..

**న్యూఢిల్లీ, మార్చి 18:** ఆధార్‌తో పాన్ దరఖాస్తు మార్చి 31 వరకే విధించారు. ఆ గడువు దాటితే. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్‌తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పాన్ కార్డు అత్యంత కీలకమన్నసంగతి తెలిసిందే. ఇప్పటివరకు నూతన పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు కాపీ ఇస్తే సరిపోయేది.అయితే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు బర్త్ సర్టిఫికెట్, ఓటర్‌ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి వాటిల్లో ఏదో ఒకటి జత చేయాల్సి ఉంటుంది.

# వాడుకలోలేని ఖాతాలపై పిఎన్‌బీ హెచ్చరిక


## కెవైసి అప్‌డేట్ లేకుంటే మూసివేస్తాం

**ముంబయి, మార్చి 18:** ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఇనాపరేటివ్‌ఖాతాల కస్టమర్లను హెచ్చరించింది. చాలా కాలంగా వాడుకలో లేని (ఇన్‌ఆపరేటివ్) ఖాతాలను పునరుద్ధరించుకోవాలని ఇందుకోసం నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపింది. వచ్చేనెల 15వ తేదీలోగా కేవైసీ అప్‌డేట్ చేయని ఖాతాలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మూసివేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు బ్యాంకు తన సోషల్ మీడియాలో ప్రకటిం చింది. గడువు ముగిసిన తర్వాత అకౌంట్ క్లోజ్ అయితే, ఎలాంటి బ్యాం కింగ్ లావాదేవీలు జరపడం సాధ్యం కాదని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఒక సేవింగ్స్ లేదా కరెంట్ ఖాతాలో కస్టమర్ వరుసగా రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఎలాంటి లావాదేవీలు నిర్వహించకపోతే, ఆ ఖాతాను ఇన్ ఆపరేటివ్ అకౌంట్‌గా వర్గీ కరిస్తారు. ఇలాంటి ఖాతాలపైనే పీఎన్‌బీ తాజా ప్రకటన చేసింది. ఖాతా దారులు తమ ఖాతాను తిరిగి యాక్టివేట్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తు న్నట్లు తెలిపింది. కవైసీ ప్రక్రియ అంటే కస్టమర్ తన గుర్తింపు, చిరునామా వివరాలను బ్యాంకు వద్ద అప్‌డేట్ చేసుకోవడమే. ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి అధికారిక పత్రాలను బ్యాంకు శాఖలో సమర్పించి కేవైసీని పూర్తి చేయవచ్చు. కొన్ని సందర్భాల్లో బ్యాంకులు ఆన్‌లైన్ ద్వారా కూడా కేవైసీ అప్‌డేట్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పిస్తున్నాయి. ప్రస్తుత కాలంలో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉండటం సర్వసాధారణమైపోయింది. ఉద్యోగం మారినప్పుడు కొత్తగా శాలరీ అకౌంట్ తెరవడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి ప్రత్యేక ఖాతా, ఇతర వ్యక్తిగత అవసరాల కోసం అకౌంట్లు తెరవడం వంటి కారణాలతో ఖాతాల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో అన్నిఖాతాలను చురుగ్గా నిర్వహించడం చాలా మందికి కష్టమవు తుంది. కొన్ని ఖాతాలలో కనీస బ్యాలెన్స్ కూడా మెయింటెయిన్ చేయలేకపోవడంతో వాటిని పూర్తిగా పక్కన పెట్టేస్తుంటారు. దీర్ఘకాలంగా లావాదేవీలు జరగని ఖాతాలపైనే బ్యాంకులు దృష్టి సారిస్తున్నాయి.


## యాపిల్ కంపెనీని నడిపించేందుకే కట్టుబడిఉన్నా: టిమ్ కుక్

**వాషింగ్టన్, మార్చి 18:** టెక్ దిగ్గజం యాపిల్ సీఈవో టిమ్ కుక్ తన పదవీ విరమణపై వస్తున్న ఊహాగానాలకు బ్రేక్ వేసారు. యాపిల్ కంపెనీని నడిపించేందుకే తాను కట్టుబడి ఉన్నానని, ప్రస్తుతానికి తప్పుకునే ఆలోచన లేదని కుక్ స్పష్టం చేశారు. టిమ్ కుక్ తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఎన్నడూ చెప్పలేదని, అదొకపుకారు మాత్రమేనని అన్నారు. దాదాపు మూడు దశాబ్దా లుగా యాపిల్‌తో తనకున్న అనుబం ధాన్నిగుర్తు చేసుకుంటూ నేను చేస్తున్న పనిని ఎంతగానో ప్రేమిస్తున్నాను. యాపిల్ లేని జీవితాన్ని నేను ఊహించలేనని భావోద్వేగంగా తెలిపారు.

# రికార్డు కనిష్టానికి క్షీణించిన రూపాయి: డాలర్ వర్సెస్ రూపీ 92.63



**ముంబయి, మార్చి 18:**అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మరోసారి రికార్డు కనిష్టానికి పడిపోయింది. బుధవారం ట్రేడింగ్‌లో రూపాయి విలువ 92.63 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు విత్‌డ్రా కొనసాగడం వంటి అంశాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో బుధవారం ఉదయం 92.42 వద్ద ప్రారంభమైన రూపాయి, ఆ తర్వాత మరింత బలహీనపడింది. మంగళవారం రూపాయి 92.37 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఒకదశలో 92.50 స్థాయిని దాటి కిందకు పడటంతో అమ్మకాల ఒత్తిడి పెరిగిందని, దీనికి తోడు బ్యాంకు సెలవుల కారణంగా డాలర్ల లభ్యత తక్కువగా ఉండటం కూడా రూపాయి పతనానికి కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ వివరించారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా ఉందని ఆయన తెలిపారు. మరోవైపు పెరుగుతున్న దిగుమతుల బిల్లుల కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల అధిక ముడి చమురు ధరలు, హార్మూజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయాలు కలగడం వంటి అంశాలు భారత్‌కు దిగుమతి వ్యయాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులు రూపాయికి ప్రతికూలంగా ఉన్నాయని రానున్న రోజుల్లో డాలర్‌తో రూపాయి విలువ 92.25 నుంచి 92.95 శ్రేణిలో కదలాడవచ్చని త్రివేది అంచనా వేశారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.